
శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


చిక్కులున్నా లెక్కచేయకుండా గగనయాన్ ఉరవడి కొనసాగాలి : శుక్లా

ఆరోగ్య కారణాల వల్ల.. 'వాంగ్‌చుక్ విడుదల' సాధ్యం కాదు

ఒప్పందం కాదు.. అమెరికా దోపిడీ

05


సంపుటి 28, సంచిక: 231 | గురువారం | 12-02-2026 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00


## గ్రేటర్ హైదరాబాద్ ఇక
# 3 కార్పొరేషన్‌లు

**జిహెచ్‌ఎంసి, సిఎంసి, ఎంఎంసిగా విభజన**

- మూడు కార్పొరేషన్‌లలో ఏక కాలంలో.. ప్రారంభమైన ప్రత్యేకాధికారి పాలన
- మూడు కార్పొరేషన్‌లలో ప్రత్యేక కమిషనర్‌గా జయేష్ రంజన్
- జిహెచ్‌ఎంసి కమిషనర్‌గా ఆర్‌వి కర్ణన్, సిఎంసి కమిషనర్‌గా సృజన, ఎంఎంసి కమిషనర్‌గా వినయ్ కృష్ణారెడ్డి బాధ్యతలు స్వీకరణ



ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ మహానగర పాలనలో ఒక నూతన శకం ప్రారంభమైంది. పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న నగరాన్ని దృష్టిలో ఉంచుకుని, రాష్ట్ర ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి)ని మూడు కార్పొరేషన్‌లుగా విభజిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. అధికార వికేంద్రీకరణ లక్ష్యాలతో ప్రభుత్వం జిహెచ్‌ఎంసిని మూడు వేర్వేరు మున్సిపల్ కార్పొరేషన్‌లుగా విభజిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి), సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి), మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి)గా నగర పాలన కొనసాగనుంది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వచ్చినట్లు ప్రభుత్వం ఉత్తర్వులలో స్పష్టం చేసింది. ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడిన వెంటనే మూడు కార్పొరేషన్‌లలో ప్రత్యేక కమినర్‌గా తరువాయి 2లో

**జిహెచ్‌ఎంసి :** శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్లు ఈ కార్పొరేషన్ పరిధిలో ఉంటాయి. ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం, శాసనసభ, శాసనమండలి, సచివాలయం, సిఎం నివాసం, ఎయిర్‌పోర్ట్ వంటి ప్రధాన పరిపాలన సాగే భవనాలు జిహెచ్‌ఎంసి పరిధిలోనే కొనసాగనున్నాయి. రాజధాని నగర పరిపాలన జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలోనే ఉంటుందని అధికారులు తెలిపారు.

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్.. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్లు సైబరాబాద్ కార్పొరేషన్ పరిధిలోకి వస్తాయి. సైబర్ టవర్‌తో పాటు ఐటి కారిడార్ ప్రాంతాలు ఈ కార్పొరేషన్ పరిధిలో ఉండనున్నాయి.

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్.. మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్.బి.నగర్ జోన్లు మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలో ఉంటాయి. ప్రముఖ శైవ క్షేత్రం కీసర పుణ్యక్షేత్రం ఈ కార్పొరేషన్ పరిధిలోకి వస్తోంది. అయితే మూడు కార్పొరేషన్‌ల చెత్త వ్యర్థాలను డంప్ చేసే జవహర్ నగర్ డంపింగ్ యార్డు మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోకి వస్తోంది.



# బ్యాలెట్ బాక్సుల్లో భవితవ్యం

- ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్
- పలుచోట్ల చెదురు మదురు ఘటనలు.. ఉమ్మడి మెదక్‌లో స్వల్ప ఘర్షణలు
- మున్సిపాలిటీల్లో 75.88, కార్పొరేషన్లలో 66.05శాతం ఓటింగ్
- కొడంగల్‌లో సిఎం రేవంత్‌రెడ్డి, మధిరలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహా పలు చోట్లు ఓటేసిన ప్రముఖ నేతలు
- కొత్తగూడెం కార్పొరేషన్‌లోని పలు డివిజన్లలో ఓటింగ్ సరళిని పరిశీలించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని





ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా బుధవారం మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఓటర్లు తమ నిర్ణయాన్ని బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం చేశారు. ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థుల భవితవ్యం ఈ నెల 13న తేలనుంది. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తంగా 73.1శాతం పోలింగ్ నమోదైంది. మున్సిపాల్టీల్లో 75.88శాతం, కార్పొరేషన్లలో 66.05శాతం ఓటింగ్ నమోదైంది. అక్కడక్కడా స్వల్ప ఉద్రిక్తతలు మినహా రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా సాగింది. సాయంత్రం 5 గంటల వరకు క్యూలైన్‌లలో ఉన్న వారికి అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా చెదురుమదురు ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ, మొత్తం మీద పోలింగ్ ప్రశాంతంగా సాగినట్లు అధికారులు తెలిపారు. మహబూబాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కార్యకర్తల మధ్య స్వల్ప ఘర్షణలు, నినాదాలు, దొంగ ఓట్ల యత్నాలు వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. పోలీసులు వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో సంగారెడ్డి 34వ వార్డు పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి, పోలీసులు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. నర్సాపూర్, రామాయంపేట ప్రాంతాల్లో బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ తరువాయి 2లో

## మున్సిపల్ ఎన్నికలలో 'హస్తం'దే హవా

**పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్స్ అంచనా**

మంచిర్యాల, రామగుండం, నల్లగొండ, మహబూబ్‌నగర్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లలో కాంగ్రెస్ గెలుపు? 03

## పది మంది ఐఎఎస్‌ల బదిలీ

- సింగరేణి సిఎండిగా జ్యోతి బుద్ధప్రకాశ్
- జలమండలి జెఎండిగా మయాంక్ మిట్టల్



బుద్ధప్రకాశ్

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో పది మంది ఐఎఎస్‌లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్‌సి అభివృద్ధి శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్‌ను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సిసిఎల్ ) చైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. పూర్తి అదనపు బాధ్యతల నుంచి డి. కృష్ణ భాస్కర్‌ను తప్పించారు. ఎస్‌సి అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సబ్యసాచి ఘోష్‌కు అదనపు బాధ్యతలను, అలాగే గిరిజన సంక్షేమ శాఖ బాధ్యతలను కూడా ఆయనకే అప్పగించారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న సందిప్ కుమార్ సుల్తానియాకు అదనంగా ప్రణాళిక శాఖ తరువాయి 2లో

### భారతమాతను
# మోదీ సర్కార్ అమ్మేసింది

**హోల్‌సేల్‌గా అమెరికాకు సరెండర్**



- భారతదేశ ఇంధన భద్రతను అమెరికా చేతుల్లో పెట్టారు
- యుఎస్-భారత్ మధ్యంతర వాణిజ్య ఒప్పందంతో దెబ్బతిననున్న రైతుల ప్రయోజనాలు
- ఇకపై భారత్ ఎవరి నుంచి చమురును కొనాలో అమెరికాయే చెబుతుంది
- లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ తీవ్ర మండిపాటు

**న్యూఢిల్లీ :** భారత్ – అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పదం ద్వారా భారతమాతను కేంద్ర ప్రభుత్వం అమ్మేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. భారతదేశ ఇంధన భద్రతను అమెరికా చేతుల్లో పెట్టి, రైతుల ప్రయోజనాలను ఫణంగా పెట్టి సర్కారు హోల్‌సేల్‌గా సరెండర్ అయిపోయిందని ఆయన ఆరోపించారు. బుధవారం లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా రాహుల్ మాట్లాడారు. భారత్ –అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఏకపక్షంగా ఉందని, దీని వల్ల భారత రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయన్నారు. ఈ ట్రేడ్ డీల్ అమల్లోకి వస్తే, భారత మార్కెట్‌లోకి అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల ప్రవాహం భారీగా పెరుగుతుందని రాహుల్ తెలిపారు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల ధాటికి భారత రైతులు విలవిలలాడాల్సిన దుస్థితి వస్తుందన్నారు. ఇక భారత దేశ వస్త్ర పరిశ్రమ పని అయిపోయినట్టేనని ఆయన వ్యాఖ్యానించారు. అమెరికాతో ట్రేడ్ డీల్ ఫలితంగా ఇంధన భద్రతను భారత్ కోల్పోయిందన్నారు. ఇకపై భారత్ ఎవరి నుంచి చమురును కొనాలో అమెరికాయే చెబుతుందని రాహుల్ పేర్కొన్నారు. ట్రేడ్ డీల్‌పై చర్చల సందర్భంగా, భారత్‌ను సరిసమాన భాగస్వామిగా పరిగణించాలని అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్‌ను కేంద్ర ప్రభుత్వం కోరి ఉండాల్సిందన్నారు. "మీ ప్రభుత్వం భారతదేశాన్ని అమ్మేసింది. దేశాన్ని అమ్ముతున్నందుకు సిగ్గుగా లేదా ? మీరు భారత మాతను అమ్మేశారు' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

**ఎప్‌స్టీన్ ఫైల్స్ ప్రభావం మోదీపై పడి ఉండొచ్చు: రాహుల్**

'అంత సాధారణంగా భారత్‌ను ప్రధాని మోదీ అమ్మేస్తారంటే నేను నమ్మను. బహుశా, ఆయనపై ఏదో బయటి ఒత్తిడి ప్రభావం పడి ఉండొచ్చు. ఎప్‌స్టీన్ ఫైల్స్ రిలీజ్ అయ్యాయని తెలిసినప్పటి నుంచి ప్రధాని మోదీ తరువాయి 2లో

# నేడే సార్వత్రిక సమ్మె

- దేశవ్యాప్త నిరసనలకు కార్మికులు, కర్షకులు సిద్ధం
- హక్కుల పరిరక్షణకు ఐక్యపోరు
- మద్దతిచ్చిన వామపక్షాలు, బ్యాంకు ఉద్యోగులు, ప్రజా సంఘాలు




**న్యూఢిల్లీ:** సార్వత్రిక సమ్మెకు సర్వం సిద్ధమైంది. పది కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం 24 గంటల పాటు నిరసనలతో దేశం మార్మోగబోతోంది. ధర్నాలు, ప్రదర్శనలతో దేశవ్యాప్త సమ్మె పెద్దఎత్తున జరగబోతోంది. నాలుగు కార్మిక కోడ్‌లు, అమెరికా–భారత్ వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు పోరుబాట పట్టారు. ఐక్యంగా సమ్మెకు సమాయత్తమయ్యారు. పోరాడి సాధించుకున్న తమ హక్కులను కాలరాసేందుకు, వ్యవసాయ రంగానికి హాని కలించేందుకు తీసుకొచ్చే విధానాలను, చట్టాలను ముక్తకంఠంతో వ్యతిరేకిస్తూ వాటి రద్దునకు సర్కారుపై ఒత్తిడి పెంచేందుకు దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చారు. ఏకపక్ష నిర్ణయాలతో సర్కారు దూకుడును అడ్డుకుంటామని ప్రకటించారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో తరువాయి 12లో



## సర్కారు మెడలు వంచుదాం

**సార్వత్రిక సమ్మె జయప్రదం చేద్దాం: డి.రాజా పిలుపు**

కార్మికులకు, రైతులకు, ఉద్యోగులకు వ్యతిరేకమైన విధానాలతో ముందుకెళుతున్న కేంద్ర ప్రభుత్వం మెడలు వంచేలా ఐక్యంగా పోరాటాలు అవసరమని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా సూచించారు. చారిత్రక పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కుల పరిరక్షణకు ఉక్కు సంకల్పంతో కదం తొక్కాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లు, అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా ఈనెల 12న అనగా గురువారం తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దామంటూ డి.రాజా బుధవారం సామాజిక మాధ్యమం వేదికగా పిలుపునిచ్చారు. ఉద్దేశపూర్వకంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ తరువాయి 12లో

# భారత్@ 91

## దేశంలో ఏటేటా పెరుగుతున్న అవినీతి



**కరప్షన్ పర్సెప్షన్ ఇండెక్స్ –2025 నివేదిక వెల్లడి**

**న్యూఢిల్లీ :** దేశంలో ప్రతి ఏటా అవినీతి పెరిగిపోతోంది. 'ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్' అనే సంస్థ వెలువరించిన వార్షిక కరప్షన్ పర్సెప్షన్ ఇండెక్స్ (సీపీఐ)2025 నివేదికలో భారత్ 91వ స్థానంలో నిలిచింది. 182 దేశాలకు ప్రతీఏటా స్కోర్, ర్యాంకులను ఇస్తారు. 100 పాయింట్లకు గానూ ఇచ్చే ఈ స్కోరులో తక్కువ పాయింట్లు సాధించిన దేశాల్లో ఎక్కువ అవినీతి ఉన్నట్టు పరిగణిస్తారు. అలా తాజా నివేదికలో 100 పాయింట్లకు 39 స్కోరుతో భారత్ 91వ స్థానానికి పరిమితమైంది. కాగా , 2014లో మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టినప్పుడు అవినీతి సూచీలో 85వ ర్యాంకులో ఉన్న భారత్ ఇప్పుడు 91వ ర్యాంకుకు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది.

# బంగ్లాదేశ్ దిశానిర్దేశ ఎన్నికలు నేడే

**44 శాతం యువతరం ఓటింగే కీలకం**



**ఢాకా:** బంగ్లాదేశ్‌కు దిశానిర్దేశం చేసే సార్వత్రిక ఎన్నికల పోలింగ్ గురువారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దీంతోపాటు రాజ్యాంగంలో మార్పులకు ఉద్దేశించిన "జులై ఛార్టర్"పై ప్రజాభిప్రాయ సేకరణ కూడా నిర్వహిస్తారు. ప్రజా ఓటు ద్వారా రాజ్యాంగంలో చేసే ఈ మార్పులు దేశ ప్రధానమంత్రి చెలాయించే అధికారాలపై పరిమితులు విధించనున్నాయి. అదేవిధంగా ప్రస్తుతం ఒక రబ్బరుస్టాంపుగా ఉన్న బంగ్లాదేశ్ అధ్యక్షుడికి కూడా రాబోయే రాజ్యాంగ మార్పుల ద్వారా కొత్త అధికారాలు దఖలు పడతాయి. పార్లమెంటు "జతియా సంసద్"లో ఉన్న 350 స్థానాలకుగాను నిర్ణీత ప్రకారం 300 నియోజకవర్గాలలో పోలింగ్ జరగాల్సి ఉంది. కానీ షెర్పూర్–3 నియోజకవర్గంలో జమాత్–ఏ–ఇస్లామ్ అభ్యర్థి మరణించడంతో అక్కడి పోలింగ్ వాయిదా వేయడంవల్ల 299 స్థానాలలో మాత్రమే పోలింగ్ జరుగుతుంది. మిగిలిన 50 స్థానాలను మహిళలకోసం రిజర్వు చేశారు. దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు బుధవారం ఎన్నికల సామాగ్రిని తరలించేందుకు ఎన్నికల సంఘం ముమ్మర ఏర్పాట్లు చేసింది.

42,779 కేంద్రాలలో ఉదయం 7.30 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకూ పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. దేశవ్యాప్తంగా 12.77 కోట్ల మంది అర్హులైన ఓటర్లు ఉండగా, వీరిలో 6.48 కోట్లమంది పురుషులు, 6.28 కోట్ల మంది స్త్రీలు ఉన్నారు. మత హింస ప్రజ్వరిల్లుతుందని మైనారిటీలు భయాందోళన చెందుతున్న తరుణంలో కట్టుదిట్టమైన భద్రత మధ్య ఎన్నికలు జరుగుతున్నాయి. షేక్ హసీనా ప్రభుత్వాన్ని కూలదోసి చరిత్రాత్మకమైన హింసాత్మక తిరుగుబాటు తర్వాత మొదటిసారి అవామీలీగ్ పార్టీని ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించారు. 13వ పార్లమెంటుకు జరుగుతున్న ఈ ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ తరువాయి 12లో



ఇకపై స్కూళ్లలో
## వందేమాతరం తప్పనిసరి..

**జనగణమన కంటే ముందే పాడాలి.. కేంద్రం ఆదేశాలు**

**న్యూఢిల్లీ :** జాతీయ గేయం 'వందేమాతరం' ఆలపించే విషయంలో కేంద్ర హోం శాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇకపై ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా జాతీయ గేయం 'వందేమాతరం' ఆలపించాలని అని ఆదేశించింది. జాతీయ గీతం 'జనగణమన' పాడటానికి ముందు తరువాయి 12లో



## కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రోపై హత్యాయత్నం


**బోగోటా :** కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో (66)పై హత్యా ప్రయత్నం జరిగింది. తప్పించుకుని సురక్షితంగా తాను బయటపడ్డానని పెట్రో బుధవారం స్వయంగా ప్రకటించారు. 2022 ఆగస్టులో అధికారం చేపట్టినప్పటినుండీ మాదక ద్రవ్యాల ముఠాలు ఆయనను హత్య చేసేందుకు పథకం చేస్తున్నాయి. మంత్రివర్గ సమావేశంలో హత్యాయత్నం గురించి వివరిస్తూ ఆయన చేసిన ప్రసంగాన్ని లైవ్ టెలికాస్ట్ చేశారు. అజర్ న్యూస్ చెప్పిన ఈ సమాచారం ఫ్రాన్స్ పత్రికల ద్వారా ప్రపంచానికి తెలిసింది. కొద్దినెలల్లో కొలంబియాలో అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగనున్న తరుణంలో ఈ ఘటన జరిగింది. కొలంబియా సైనిక బలగాలకు గుస్తావో పెట్రో రాజ్యాంగబద్ధంగా కమాండర్ ఇన్ చీఫ్‌గా వ్యవరిస్తారు. 2022లో ఆయన అధ్యక్ష బాధ్యతలు తీసుకున్నారు. ఈ ఏడాది మే 31వ తేదీన మళ్ళీ అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. 2016లో శాంతి ఒప్పందం ప్రకారం ఫార్క్ గెరిల్లా ఆర్మీ ఆయుధాలు వదిలి పెడతానని అంగీకరించింది. ఫార్క్‌తోపాటు ఇవాన్ మోర్డిస్క్ వంటి వార్‌లార్డ్స్, మాదక ద్రవ్యాల ముఠాలు ఆయనను హత్య చేసేందుకు కాచుకుని ఉన్నాయి. కొలంబియాలో అనేక సంవత్సరాలుగా ఎంతోమంది వామపక్ష, కమ్యూనిస్టు నాయకులు, అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు సన్నద్ధులైన వామపక్ష నాయకులు ఈ విధంగానే హత్యలకు గురయ్యారు. ఇంతకుముందు 2024లో కూడా ఆయనపై హత్యా ప్రయత్నం జరిగింది. దక్షిణ అమెరికా కొలంబియాలో మొట్టమొదటి వామపక్ష దేశాధ్యక్షుడు గుస్తావో పెట్రో.

హెలికాప్టర్‌లో ప్రయాణం చేస్తూ ఒకచోట దిగేందుకు ప్రయత్నం చేశారు. కానీ ఆయన హెలికాప్టర్ దిగిన వెంటనే కాల్పులు జరిపి హతమార్చేందుకు కొందరు గుర్తుతెలియని వ్యక్తులు సిద్ధంగా కాచుక్కూర్చున్నారన్న సమాచారంతో ఆకాశంలోనే ఆయన హెలికాప్టర్ పలు గంటలు చక్కెర్లు కొట్టింది. నాలుగు గంటలపాటు తన కుటుంబ సభ్యులతో కలిసి హెలికాప్టర్‌లోనే ఉండిపోయానని, సముద్రంపైనే తన హెలికాప్టర్ చక్కెర్లు కొట్టిందని, ఈ కారణంగా తాను కరీబియన్ తీరంలో నిర్ణీత సమయానికి నేలమీదకు దిగలేకపోయాయని గుస్తావో పెట్రో చెప్పారు.

ఆయన విమానంలో ఉండగా ఈ ప్రయత్నం జరిగింది. కొలంబియా మాదక ద్రవ్యాల రవాణాకు అతిపెద్ద కేంద్రంగా ఉందని, ఈ వ్యవహారాల్లో ఆయనే ప్రధాన నిందితుడుగా ఉన్నాడని అమెరికా ప్రభుత్వం ఏడాదికాలంగా ఆయనకు బెదిరింపులు చేస్తోంది. వెనిజులా అధ్యక్ష దంపతుల కిడ్నాప్ తర్వాత నుండి తమ తదుపరి లక్ష్యం కొలంబియా,క్యూబాలేనని ట్రంప్ చెబుతూ వచ్చారు.

# ఇరాన్ ప్రజలకు మసౌద్ క్షమాపణ

ఆర్థిక సమస్యలు పరిష్కరిస్తామని దేశాధ్యక్షుడు హామీ
భారీ జన సమక్షంలో 47వ ఇస్లామిక్ విప్లవ వేడుకలు



**టెహ్రాన్ :** ఇరాన్ ప్రజలకు ఆ దేశాధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ క్షమాపణలు చెప్పారు. కరెన్సీ విలువ దిగజారకుండా తాము కాపాడలేకపోయామన్నారు. ఈ సమస్యలన్నింటినీ ప్రభుత్వం పరిష్కరిస్తుందని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఆర్థిక సమస్యలు పరిష్కరించడానికి అవసరమైన వనరులను సమీకరిస్తామని, ప్రజల జీవనాధారాన్ని, ఉపాధి అవకాశాలను మెరుగు పచడమే తమ పాలనాయంత్రాంగం ప్రధాన ప్రాధాన్యతాంశంగా తీసుకుని పనిచేస్తుందని ప్రకటించారు. ఇరాన్‌లో ఇస్లామిక్ రివల్యూషన్ విజయం సాధించి 47 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జరిగిన వార్షికోత్సవ వేడుకలకు రాజధాని టెహ్రాన్‌లోని ఆజాదీ స్క్వేర్ వద్ద బుధవారం ఉదయం వేలాదిమంది హాజరైన సభలో పెజెష్కియన్ ప్రసంగించారు. ఇరాన్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుకుంటుందని ప్రకటించారు. ప్రజలకు క్షమాపణ చెప్పారు. గత ఏడాది డిసెంబరు 28 నుండి 18 రోజులపాటు చరిత్రలో లేనివిధంగా దేశంలో కొనసాగిన హింసాత్మక ప్రజా తిరుగుబాటు, ప్రభుత్వ అణచివేత, ఊచకోతల తర్వాత క్రమంగా పరిస్థితులు చక్కబడిన నేపథ్యంలో ఎంతో విజయవంతంగా ఇస్లామిక్ రివల్యూషన్ వార్షికోత్సవ వేడుకలను ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. ఇరాన్ అధికార పత్రిక ఈ వార్త ప్రచురించింది. వేలాదిమంది ప్రజలు ప్రదర్శనలు చేస్తూ ఆజాదీ స్క్వేర్ వద్దకు చేరుకుని బహిరంగసభలో పాల్గొన్నారు. ఇరాన్ దేశాన్ని, ఇస్లామిక్ విప్లవాన్నీ కాపాడుకోవడంకోసం వేలాదిమంది ప్రజలు ఈ విధంగా వీధుల్లోకి తరలిరావడం యావత్ ప్రపంచం ఈనాడు తమ కళ్ళతో తప్పక చూడాలని పెజెష్కియన్ ఈ సందర్భంగా అన్నారు. ఇరాన్ ప్రజలు ఇస్లామిక్ విప్లవాన్ని కాపాడుకోవడానికి, తమ నాయకత్వాన్ని సమర్థించడానికి, వారి విలువలను, గర్వించదగిన భూమిని సంరక్షించుకోవడానికి ప్రజలు లక్షలాదిగా ఈ ప్రాంతానికి తరలి వచ్చిన విషయాన్ని యావత్ ప్రపంచం చూడాలని ఆయన అన్నారు. 1979 నాటి తిరుగుబాటు న్యాయాన్ని స్థాపించి స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడమేనన్నారు. ఇరానియన్లు, ముస్లింలు తమ సొంత బలం, జ్ఞానం, సంస్కృతి, కళలద్వారా దేశాన్ని నిర్మించుకుని, గౌరవం, స్వేచ్ఛను తిరిగి తీసుకురాగలమని నిరూపించడమే దేశం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇస్లామిక్ విప్లవం ప్రారంభమైనప్పటినుండీ దేశంలో విభజన తీసుకువచ్చి కుట్రలు పన్ని దేశాన్ని నాశనం చేయాలని శత్రువులు ప్రయత్నం చేస్తూ వచ్చారన్నారు. ఇస్లామిక్ విప్లవాన్ని తమ ఎదురుగా మోకాళ్ళమీద కూర్చోబెట్టడానికి అమెరికా, యూరప్ దేశాలు చేయవలసిన కుట్రలు, ప్రయత్నాలు అన్నీ చేశాయని, దేశాన్ని ఎనిమిది సంవత్సరాలపాటు యుద్ధం ఊబిలోకి దింపాయని, దేశాన్ని విభజించి ఆక్రమించే ప్రయత్నాల్లో భాగంగా ఇరాక్‌లో సద్దాం హుస్సేన్‌కు మద్దతు ఇచ్చాయని పెజెష్కియన్ విమర్శించారు. కానీ ఇరాన్ దేశ యువకులు మరోవైపు చూపించిన ధైర్యసాహసాల ముందు ఆ ప్రయత్నాలు విఫలమయ్యాయన్నారు. ఈ వేదికపైనుండే ఇరాన్ కోసం ప్రాణ త్యాగాలు చేసిన అమర వీరులకు ఆయన నివాళులు అర్పించారు. మేజర్ జనరల్ మహ్మద్ బఘేరీ, మేజర్ జనరల్ హుస్సేన్ సలామీ దగ్గర నుండి క్వాస్సెమ్ సోలైమనీ వరకూ అనేకమంది అమరవీరులకు ఆయన నివాళులు అర్పించారు. ఈ అమరవీరులంతా దేశం నుండి సంపదను కోరుకోలేదని, అధికారాన్ని కోరుకోలేదని, దేశంకోసం, ఇస్లామిక్ విప్లవం కోసం వారు తమ ప్రాణాలు త్యాగం చేశారన్నారు.

మరోవైపు పాశ్చాత్య పత్రికల కథనాలు భిన్నంగా ఉన్నాయి. ఇరాన్‌లో 47వ విప్లవ వార్షికోత్సవాల సందర్భంగా ముందురోజు మంగళవారం రాత్రి ప్రజలు వీధుల్లోకి వచ్చి ఖమేనీని ఉరితీయాలంటూ నినాదాలు చేశారని వార్తలు ప్రచురించాయి. మసీదుల వద్ద ఖమేనీ వ్యతిరేకులు గుమిగూడి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. జెండాలు ఊపుతూ ఖమేని వైదొలగాలని కోరారు.



## కెనడా స్కూలులో కాల్పులు 10 మంది మృతి


భారత్, బ్రిటన్ ప్రధానమంత్రుల సంతాపం

**వాంకోవర్:** పశ్చిమ కెనడాలోని గుర్తుతెలియని దుండగులు కాల్పులు జరపడంతో పిల్లలు సహా 10మంది మరణించారు. మరో 25మంది గాయపడ్డారు. గుర్తు తెలియని ఒక మహిళ మృతదేహాన్ని కాల్పులకు పాల్పడిన వ్యక్తిగా భావిస్తున్నారు. తనను తాను కాల్చుకుని ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు అంచనావేశారు. సమీపంలోనే ఒక ఇంటిలో మరో ఇద్దరు మరణించి ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. రాయల్ కెనడియన్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించి గాలింపు చేపట్టారు. కెనడా ప్రధానమంత్రి కార్నీ తీవ్ర దిగ్భ్రాంతి ఆవేదన వ్యక్తం చేశారు. గాయపడినవారు ప్రమాదకరస్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కెనడాలో పాఠశాలపై కాల్పులు జరపడం చాలా అరుదైన ఘటన కావడంతో దేశవ్యాప్తంగాతీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది. కాల్పులకు పాల్పడిన వ్యక్తి మరణించినప్పటికీ ఆ వివరాలు తెలియరాలేదు. ఉత్తర వాంకోవర్‌కు 1000కి.మీ దూరంలో ఉన్న టంబ్లెర్ రిడ్జ్ పట్టణంలోని సెకండరీ స్కూలులో ఈ ఘటన జరిగింది. ఈ స్కూలులో ఘటనా సమయంలో 175మంది విద్యార్థులు ఉన్నారు. కేవలం రెండు నిమిషాల వ్యవధిలోనే పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారని బ్రిటిష్ కొలంబియా ప్రీమియర్ డేవిడ్ ఎబై విలేకరులకు చెప్పారు. కాల్పులకు పాల్పడిన మరణించిన మహిళా షూటర్ పేరును పోలీసులు వెల్లడించలేదు. కెనడాలో గన్ చట్టాలు చాలా కఠినంగా ఉంటాయి. అక్కడ తుపాకులు వాడరు. ఇలాంటి ఘటనలు చాలా అరుదుగా ఉంటాయి. కెనడాలోని ఒక స్కూలులో జరిగిన కాల్పుల్లో పదిమంది విద్యార్థులు, ఇతరులు మరణించిన ఘటనపట్ల ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్ర సంతాపం ప్రకటించారు. ఈ మేరకు కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీకి తన సంతాప సందేశం పంపించారు.బ్రిటిష్ కొలంబియాలోని టంబ్లర్ రిడ్జ్ టౌన్‌లో ఈ కాల్పుల ఘటన సంభవించింది. గాయపడినవారంతా త్వరగా కోలుకోవాలని ఆయన ప్రార్థించారు. ఈ ఘటన విన్న వెంటనే తాను దిగ్భ్రాంతికి గురయ్యానన్నారు. అదేవిధంగా బ్రిటన్ ప్రధానమంత్రి కీవ్ స్టార్మర్ కూడా ఈ ఘటనపట్ల తీవ్ర సంతాపం ప్రకటించారు.

## 17న మేక్రాన్ భారత్ పర్యటన

'ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్' ప్రారంభం

**పారిస్:** ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఈ నెల 17వ తేదీ నుండి మూడు రోజులు భారత్‌లో పర్యటిస్తారు. కృత్రిమ మేధపై జరిగే అంతర్జాతీయ సదస్సులో పాల్గొంటారు. ఆయన పర్యటన సమయంలోనే రాఫెల్ యుద్ధ విమానాల సరఫరాకు సంబంధించి అతిపెద్ద ఒప్పందం కూడా బహుశా ఆయన సమక్షంలోనే జరిగే అవకాశాలున్నాయి. భారత్‌కు మరోవిడత అత్యంత శక్తిమంతమైన రాఫెల్ విమానాలను సరఫరా చేసేందుకు రూ.3.25 లక్షలకోట్లు విలువైన అతిపెద్ద ఒప్పందం ఖరారు కానున్నది. ఈ పర్యటనలో మేక్రాన్ భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సమావేశమై ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. 17వ తేదీన నేరుగా ఆయన ముంబైకి చేరుకుంటారు. పర్యాటక–సాంస్కృతిక రంగాలతో సహా వివిధ విభాగాలలో భారత్–ఫ్రాన్స్ మధ్య ద్వైపాక్షిక సహకారం పెంపొందించేందుకు 2026వ సంవత్సరాన్ని ''భారత్–ఫ్రాన్స్ ఇయర్ ఆఫ్ ఇన్నొవేషన్''గా ప్రకటించారు. ముంబైలోనే మోదీతో కలిసి మేక్రాన్ ఈ ఇయర్ ఆఫ్ ఇన్నొవేషన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. అక్కడే ద్వైపాక్షిక సమావేశం నిర్వహిస్తారు. ఇండో–పసిఫిక్ సహకారం, ప్రాంతీయ అంతర్జాతీయ సమస్యలు సహా రెండు దేశాలకు ప్రయోజనం కలిగించే అనేక అంశాలపై వారు చర్చలు జరుపుతారు. తర్వాత 19వ తేదీన ఢిల్లీలో జరిగే అంతర్జాతీయస్థాయి ''ఎ.ఐ ఇంపాక్ట్ సమ్మిట్''లో పాల్గొంటారు.



## ఐఎఎస్‌ల బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యతలను అప్పగించారు. కాగా జిహెచ్ఎంసి ని మూడు కార్పొరేషన్లను విభజించిన నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లకు ప్రత్యేక కమిషనర్‌గా జయేశ్ రంజన్‌ను ప్రభుత్వం నియమించింది.

**బదిలీ అయిన ఐఎఎస్ అధికారులు వీరే:** సింగరేణి సిఎండిగా జ్యోతి బుద్ధ ప్రకాశ్, ఎస్‌సి అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా సవ్యసాచి ఘోష్‌కు అదనపు బాధ్యతలు, సెర్ప్ సిఇఒగా ఉన్న దివ్యకు పంచాయతీరాజ్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలను అప్పగించారు. సెర్ప్ అడిషనల్ సిఇఒగా కాత్యాయని ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా నియమించారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ జెఎండిగా కాత్యాయనీ దేవికి అదనపు బాధ్యతలు, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా, మంత్రి శ్రీధర్‌బాబుకు ఓఎస్‌డిగా అదనపు బాధ్యతలను రఘురామ్‌కు అప్పగించారు. జలమండలి జెఎండిగా మయాంక్ మిట్టల్‌ను ప్రభుత్వం నియమించింది.

## 3 కార్పొరేషన్‌లు

(మొదటి పేజీ తరువాయి)

జయేష్ రంజన్ బాధ్యతలు స్వీకరించారు. ఆ వెంట వెంటనే ముగ్గురు కమిషనర్లు ఆర్.వి.కర్ణన్ (జిహెచ్ఎంసి), సృజన (సిఎంసి), వినయ్ కృష్ణారెడ్డి (ఎంఎంసి) కమిషనర్లుగా పదవీ బాధ్యతలు చేపట్టారు. అలాగే బదిలీ అయిన ఇతర అధికారులు సైతం బాధ్యతలు స్వీకరించారు. దీంతో మూడు కార్పొరేషన్‌లలో ఏక కాలంలో ప్రత్యేకాధికారి పాలన ప్రారంభమైంది. సుదీర్ఘకాలం అనంతరం జిహెచ్ఎంసి పరిధిలో ప్రత్యేకాధికారి పాలన మొదలైంది.

**300 డివిజన్లు, 60 సర్కిళ్లు, 12 జోన్లు**

ఇప్పటివరకు 150 డివిజన్‌లతో ఉన్న జిహెచ్ఎంసి పరిధి వార్డుల పునర్విభజన ప్రక్రియ అనంతరం 243 డివిజన్‌లకు పెరిగింది. విలీన మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌ల పరిధిలో 57 కొత్త డివిజన్లు ఏర్పాటవడంతో మొత్తం డివిజన్‌ల సంఖ్య 300కు చేరింది. నగర పాలనను 12 జోన్లు, 60 సర్కిళ్లుగా పునర్వ్యవస్థీకరించారు. జిహెచ్ఎంసి చట్టం1955 సెక్షన్ 3(1) ప్రకారం ప్రభుత్వం ఈ విభజన చేపట్టింది. మెట్రోపాలిటన్ ఏరియా, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ జారీ చేసిన జిఓ ఎంఎస్. నెంబర్ 55 ద్వారా పునర్వ్యవస్థీకరణకు చట్టబద్ధత కల్పించారు. విభజన అనంతరం జిహెచ్ఎంసి150, సైబరాబాద్ 76, మల్కాజిగిరి 74 కార్పొరేటర్ వార్డులుగా ఏర్పాటు చేశారు.

**కమిషనర్ల నియామకం**

మూడు కార్పొరేషన్లకు ప్రభుత్వం కమిషనర్లను నియమించింది. అలాగే మూడు కార్పొరేషన్‌లకు ఎన్నికలు జరిగే వరకు ప్రత్యేక అధికారిగా జయేష్ రంజన్ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. సాధారణంగా ఒక్కో కార్పొరేషన్‌కు ఒక్కో ప్రత్యేకాధికారి ఉంటారు. ప్రస్తుతం మూడు కార్పొరేషన్‌లకు ఒకరినే ప్రత్యేక అధికారిగా నియామకం జరపడం గమనార్హం.

**విభజన నేపథ్యం..**

ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలోని సుమారు 2,060 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టిసియుఆర్/ సియుఆర్ఇ)గా ప్రభుత్వం ప్రకటించింది. 2025లో సమీప మున్సిపాలిటీలు, గ్రామాలను జిహెచ్ఎంసిలో విలీనం చేయడంతో నగర పరిధి విస్తరించింది. పాలక మండళ్ల గడువు ముగియడంతో పాటు పెరిగిన విస్తీర్ణానికి అనుగుణంగా పరిపాలనను వికేంద్రీకరించాలనే ఉద్దేశంతో ఈ పునర్వ్యవస్థీకరణ చేపట్టారు.

**లక్ష్యం వేగవంతమైన పౌర సేవలు**

పెరుగుతున్న జనాభా, విస్తరించిన నగర పరిమాణం నేపథ్యంలో స్థానిక సమస్యలకు త్వరితగతిన పరిష్కారం అందించడం, మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేయడం, బాధ్యతాయుతమైన పరిపాలన అందించడం ఈ విభజన ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం పేర్కొంది. నూతన కార్పొరేషన్లు వేర్వేరు చట్టబద్ధ సంస్థలుగా పని చేయనున్నాయి. ఎన్నికల అనంతరం ప్రతి కార్పొరేషన్‌కు మేయర్, డిప్యూటీ మేయర్‌లతో కొత్త పాలక వర్గాలు ఏర్పాటు కానున్నాయి. ఇకపై గ్రేటర్ హైదరాబాద్ నగర పాలన మూడు కార్పొరేషన్‌ల ఆధ్వర్యంలో వికేంద్రీకృత వ్యవస్థలో కొనసాగ నుంది.





## పాల్వంచలో ఉద్రిక్తత

### పోలీస్ స్టేషన్‌ను ముట్టడించిన సిపిఐ శ్రేణులు

**ప్రజాపక్షం/ఖమ్మం:** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పాల్వంచలో బుధవారం సాయంత్రం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పాల్వంచ సిఐ సతీష్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా పట్ల అనుచితంగా ప్రవర్తించడంతో సిపిఐ శ్రేణులు నిరసనకు దిగాయి. పోలీస్ స్టేషన్‌ను ముట్టడించి ఆందోళన చేపట్టాయి. వివరాల్లోకి వెళితే... కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచలో ఓ మహిళను దొంగ ఓటు ఆరోపణతో పోలీసులు స్టేషన్‌కు తరలించారు. గంటల తరబడి నిర్బంధించి ఆమెను వదలకపోవడంతో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా సమాచారం తెలుసుకుని అక్కడకు వెళ్లి మహిళను విడుదల చేయాలని కోరారు. ఆ సమయంలో సిఐ సతీష్ సాబీర్‌పాషా పట్ల దురుసుగా ప్రవర్తించారు. దీనితో సిపిఐ శ్రేణులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యాయి. స్థానిక శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు స్టేషన్ వద్దకు చేరుకుని పోలీసుల ప్రవర్తనను నిలదీశారు. అధికార పార్టీ చెబితే ఇష్టానుసారంగా వ్యవహరిస్తారా అని ఆయన ప్రశ్నించారు. సిపిఐ శ్రేణులతో పాటు కూనంనేని పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. పోలీసులు తమ వైఖరిని మార్చుకోవాలని అధికార పార్టీ చెప్పింది చేస్తూ ఇతర పార్టీలకు చెందిన వారి పట్ల దురుసుగా ప్రవర్తిస్తారా అని ఆయన నిలదీశారు. సిఐ క్షమాపణ చెప్పేంత వరకు ఆందోళన విరమించేది లేదని హెచ్చరించారు.

## శిక్షణ హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్

**ముంబై:** సాంకేతిక సమస్యతో ప్రైవేట్ సంస్థకు చెందిన హెలికాప్టర్ పాల్ఘర్ జిల్లాలోని ఓ ప్రైవేట్ స్కూల్ మైదానంలో అత్యవసర ల్యాండింగ్ అయిం ది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సాంకేతిక కారణాలతో మహారాష్ట్ర పాల్ఘర్ జిల్లాలోని ఓ ప్రైవేట్ స్కూల్ మైదానంలో శిక్షణకోసం ఉపయోగించే హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్ అయింది. ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు బుధవారం తెలిపారు. ప్రైవేట్ సంస్థకు చెందిన హెలికాప్ట ర్ ముంబైలోని జుహు నుంచి గుజరాత్ రాష్ట్రం సూరత్ వెళ్తుండగా సాంకేతిక సమస్య వచ్చినట్లు అధికారులు తెలిపారు. హెలికాప్టర్‌లో ప్రధాన పైలెట్‌తో పాటు శిక్షణ పైలెట్, టెక్నికల్ ఇంజినీర్, మరొకరు ఉన్నారన్నారు.

## భవితవ్యం

(మొదటి పేజీ తరువాయి)

కార్యకర్తల మధ్య స్వల్ప ఘర్షణలు జరిగినట్లు సమాచారం.

**మందకొడిగా మొదలై పుంజుకున్న పోలింగ్..**

అయితే ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్ ఆ తర్వాత పుంజుకుంది. పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 60 శాతానికి మించి పోలింగ్ నమోదైనట్లు అధికారులు అంచనావేస్తున్నారు. పోలింగ్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 8,203 పోలింగ్ కేంద్రాలు, 16,031 బ్యాలెట్ బాక్సులు ఏర్పాటు చేశారు. 8,191 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. బ్యాలెట్ బాక్సుల భద్రపరిచేందుకు 137 స్ట్రాంగ్ రూమ్‌లు సిద్ధం చేశారు. మున్సిపాల్టీలలో 2,582 వార్డులకు కౌన్సిలర్‌ల ఎన్నిక జరిగింది. తొమ్మిది పురపాలికల్లో 12 వార్డులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. మొత్తం 10,719 మంది అభ్యర్థులు మున్సిపాల్టీలలో పోటీలో నిలిచారు. కార్పొరేషన్‌లలో 412 డివిజన్లకు ఎన్నికలు జరగగా, 2,225 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 52 లక్షల 17 వేల 413 మంది ఓటర్లు ఉన్నారు. 60 శాతానికి పైగా పోలింగ్ నమోదైనట్లు అంచనగా ఉంది. మక్తల్ మున్సిపాల్టీలోని 6వ వార్డులో బిజెపి అభ్యర్థి మహదేవప్ప బలవన్మరణానికి పాల్పడటంతో అక్కడ ఎన్నిక నిర్వహించలేదు. ఈ నెల 13న ఉదయం 8 గంటలకు 136 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ఫలితాలు వెల్లడైన అనంతరం ఈ నెల 16న మున్సిపాల్టీల్లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కార్పొరేషన్లలో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆరు రోజులపాటు సాగిన ప్రచారంలో ప్రధాన రాజకీయ పార్టీలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాయి.

**సిఎం సహా ఓటేసిన ప్రముఖులు**

తెలంగాణలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సిఎం రేవంత్‌రెడ్డి తన నియోజకవర్గం కొడంగల్‌లోని జెడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో ఓటు వేశారు. ఖమ్మం జిల్లా మధిరలోని 9వ వార్డులో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఓటు హక్కు వినియోగించుకున్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపాలిటిలోని 3వ వార్డులోని నవభారత్ పబ్లిక్ స్కూల్‌లో కుటుంబ సమేతంగా మంత్రి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

సూర్యాపేటలో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ఓటు వేశారు. బిఆర్‌ఎస్ నాయకులతో కలిసి పోలింగ్ కేంద్రంలో ఫోటో దిగారు. నల్లగొండ పబ్లిక్ స్కూల్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన ఓటు వేశారు. నిజామాబాద్‌లో పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కరీంనగర్ 50వ డివిజన్ జ్యోతినగర్‌లో కేంద్రమంత్రి బండి సంజయ్ కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేశారు. సంగారెడ్డి జిల్లా జోగిపేట 9వ వార్డులో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఓటు వేశారు. జనగామలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. నందికొండ మున్సిపాలిటీ ప్రభుత్వ జూనియర్ కళాశాల 5 వార్డులో మాజీ మంత్రి జానారెడ్డి కుటుంబ సభ్యులతో వచ్చి ఓటు వేశారు. నల్లగొండ ఎంపి రఘువీర్ రెడ్డి, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి ఉన్నారు.

## మోదీ సర్కార్ అమ్మేసింది

(మొదటి పేజీ తరువాయి)

కళ్లలో భయం స్పష్టంగా కనిపిస్తోంది. వాటితో ముడిపడిన ఒత్తిడి ప్రభావం ప్రధానిపై పడిందేమో. వాళ్లు ప్రధాని మోదీని ఉక్కిరిబిక్కిరి చేసి ఉండొచ్చు. బెదిరించి ఉండొచ్చు. ఇంకో 30 లక్షలకుపైగా ఎప్‌స్టీన్ ఫైల్స్ తదుపరి విడతల్లో రిలీజ్ కావాల్సి ఉంది. గతంలో భారత వస్తు, ఉత్పత్తులపై అమెరికా 3 శాతం సుంకాన్నే విధించేది. కానీ ఇక నుంచి ఆరు రెట్లు అదనంగా 18 శాతం సుంకాన్ని విధిస్తుందట. ఇక ఇదే సమయంలో అమెరికా సరుకులపై భారత్ విధించే 16 శాతం సుంకాన్ని, సున్నాకు తగ్గిస్తారట. ఎందుకోసం ప్రధాని మోదీ ఇలాంటివన్నీ ఒప్పుకున్నారు? ప్రస్తుతం అమెరికా నుంచి భారత్ ఏటా 46 బిలియన్ డాలర్లు విలువైన వస్తు, ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటోంది. దీన్ని ఏకంగా 100 బిలియన్ డాలర్లు దాటిస్తామని ట్రంప్‌కు మోదీ ఎందుకు హామీ ఇచ్చారు?' అని రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు.

**మోదీ, దోవల్ చెప్పిన దానికి రివర్స్‌లో ప్రపంచం పోక డ**

''ప్రపంచంలో ఇక యుద్ధాల శకం ముగిసిందని గతంలో ప్రధాని మోదీ, జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఎ) అజిత్ దోవల్ చెప్పారు. కానీ ప్రస్తుత పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ఆపరేషన్ సిందూర్‌ను గత సంవత్సరమే మనం చూశాం. రష్యా ఉక్రెయిన్ యుద్ధం గత మూడేళ్లుగా జరుగుతోంది. ఇజ్రాయెల్ గాజా సైనిక ఘర్షణను యావత్ ప్రపంచం చూసింది. ఇరాన్ లక్ష్యంగా అమెరికా కుట్రలను ఇప్పుడు చూస్తున్నాం. ఇంధన వనరులు, ఆర్థిక వనరులను ఆయుధాలుగా మలుచుకొని ప్రపంచ దేశాలపై అమెరికా ఒత్తిడిని పెంచుతోంది. అమెరికా ఆధిపత్యాన్ని, దాని డాలరు పెత్తనాన్ని చైనా, రష్యా లాంటి దేశాలు వ్యతిరేకిస్తున్నాయి. అంటే మనం ఏకధ్రువ ప్రపంచం నుంచి బహుళ ధ్రువ ప్రపంచం దిశగా పయనిస్తున్నాం' అని రాహుల్ గాంధీ తెలిపారు.

**అమెరికా ఆధిపత్యాన్ని, డాలరు పెత్తనాన్ని సవాల్ చేయాలి**

'భారత ప్రభుత్వ తాజా ఆర్థిక సర్వే నివేదికలో రెండు ముఖ్యమైన పాయింట్లను ప్రస్తావించారు. అవి నాకు నచ్చాయి. ప్రపంచ దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయని, అమెరికా ఆధిపత్యాన్ని చైనా, రష్యా లాంటి దేశాలు సవాల్ చేస్తున్నాయి అనేది తొలి పాయింట్. ఇంధన వనరులు, ఆర్థిక వనరులను ఆయుధాలుగా మలిచి దేశాలపై దాడి చేసే పరిస్థితులు ప్రపంచంలో ఏర్పడుతున్నాయి అనేది రెండో పాయింట్. అందుకే అమెరికా ఆధిపత్యాన్ని, డాలరు పెత్తనాన్ని మనం సవాల్ చేయాలి. సింగిల్ సూపర్ పవర్ కాన్సెప్ట్‌ను ఒప్పుకోకూడదు. కానీ ఇంధన వనరులు, ఆర్థిక వనరులను ఆయుధాలుగా మలిచి భారత్‌పైకి ప్రయోగించే అవకాశాన్ని అమెరికాకు మోదీ సర్కారు ఇచ్చింది. భారత్ ఎవరి నుంచి ముడి చమురును కొనాలి అనేది, మరో దేశం(అమెరికా) వాళ్లు నిర్ణయించాలా? భారత ప్రయోజనాలను దెబ్బతీసే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నందుకు సిగ్గుగా లేదా?' అని రాహుల్ గాంధీ మండిపడ్డారు.

**అనిల్ అంబానీని ఎప్‌స్టీన్‌కు పరిచయం చేసింది ఎవరు ?**

'జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ పేరు కూడా వచ్చింది. ఇప్పటిదాకా ఆయన్ను ఎందుకు జైలులో పెట్టలేదు? అనిల్ అంబానీని జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు పరిచయం చేసింది ఎవరు? దీనికి కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి సమాధానం చెప్పాలి. ఎప్‌స్టీన్‌కు అనిల్ అంబానీని ఎవరు పరిచయం చేశారో నాకు తెలుసు. ఈ విషయం హర్దీప్ సింగ్ పురికి కూడా తెలు సు. భారతదేశ రక్షణ రంగ బడ్జెట్‌లో కేంద్ర బిందువుగా అదానీ కంపెనీ ఉంది. ఆ కంపెనీ చెప్పినట్టుగానే రక్షణ రంగ బడ్జెట్‌ను కూర్చారు' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

**డిజిటల్ ట్రేడ్ రూల్స్‌నూ ఫణంగా పెట్టారు**

''భారత్‌ను పాకిస్థాన్‌తో అమెరికా పోల్చి చూడటానికి వీల్లేదు. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ తనతో బ్రేక్ ఫాస్ట్ చేయాలని అమెరికా ప్రెసిడెంట్ కోరుకుంటే, అది జరిగిపోయింది. కానీ భారత్ విషయంలో అలా జరగలేదు. మేం మరోలా జవాబు ఇచ్చాం. కానీ ఇప్పుడు అదే అమెరికాతో అన్యాయమైన ట్రేడ్ డీల్‌ను మోదీ ప్రభుత్వం కుదుర్చుకుంది. చివరకు డిజిటల్ ట్రేడ్ రూల్స్‌నూ అమెరికా కోసం ఫణంగా పెట్టేందుకు కేంద్ర సర్కారు రెడీ అయిపోయింది. అమెరికా కంపెనీలు భారత్‌లో డేటా లోకలైజేషన్ చేయాల్సిన అవసరం లేని రూల్‌ను తెచ్చేందుకు ఓకే చెప్పారు. భారత్ నుంచి అమెరికాకు పూర్తి ఉచితంగా డేటా బదిలీకి అనుమతులు ఇస్తామని మోదీ హామీ ఇచ్చారు.

అమెరికా కంపెనీలపై విధించే డిజిటల్ ట్యాక్స్‌నూ తగ్గించేందుకు అంగీకరించారు. అమెరికా డిజిటల్ కంపెనీలు ఇకపై సోర్స్ కోడ్‌ను భారత సర్కారుకు బహిర్గతపర్చాల్సిన అవసరం లేని రూల్‌ను తెచ్చేందుకూ కేంద్ర ప్రభుత్వం రెడీ అయింది. ఆర్థిక మంత్రి నిర్మల బాగా నవ్వుతున్నారు. ఆమెకు నవ్వడం అంటే ఇష్టం. అమెరికా ప్రభుత్వం సూచించే కంపెనీలకు 20 ఏళ్ల ట్యాక్స్ హాలిడేను ఇచ్చేందుకూ కేంద్రం ఒప్పుకుంది'' అని రాహుల్ గాంధీ ఫైర్ అయ్యారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అరాచకాలకు పాల్పడింది : కెటిఆర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అనేక అరాచకాలు, దౌర్జన్యాలకు పాల్పడిందని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ ఆరోపించారు. అధికార పక్షం ఎన్నికల్లో ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ప్రలోభాలకు గురిచేసినా మొక్కవోని దీక్షతో వీరోచితంగా పోరాడిన బిఆర్ఎస్ కార్యకర్తలకు పేరుపేరునా హృదయపూర్వక అభినందనలన్నారు. ఆదిలాబాద్ నుంచి ఆలంపూర్ వరకు పురపాలక సమరంలో గులాబీ సైనికులు కనబరిచిన పోరాట స్ఫూర్తి పార్టీకి కొండంత బలాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపిందని ఆయన కొనియాడారు. గత రెండేళ్ల పాలనలో ఘోరమైన వైఫల్యాలను మూటగట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఓటమి భయంతోనే ఈ ఎన్నికల్లో దౌర్జన్యకాండకు దిగారని కేటీఆర్ విమర్శించారు. పంచాయతీ ఎన్నికల్లో ఎదురైన పరాభవం పట్టణాల్లోనూ తప్పదనే ఆందోళనతోనే రేవంత్ రెడ్డి అడుగడుగునా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని మండిపడ్డారు. పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ శ్రేణులపై సాగించిన వేధింపులకు, దాడులకు ముఖ్యమంత్రి త్వరలోనే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని పేర్కొన్నారు. ఎన్ని నిర్బంధాలు ఎదురైనా, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ప్రజల తరుపున బిఆర్ఎస్ పోరాటం నిరంతరం కొనసాగుతుందని కెటిఆర్ స్పష్టం చేశారు.

## అధికార పార్టీ అడుగడుగునా అధికార దుర్వినియోగం : హరీష్ రావు

ప్రజాపక్షం /హైదరాబాద్ : ముఖ్యమంత్రి మొదలుకొని మంత్రులు, ఎంఎల్ఎలు, కాంగ్రెస్ నాయకులు అడుగడుగునా అధికార దుర్వినియోగానికి, ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు పాల్పడ్డారని మాజీ మంత్రి టి.హరీష్ రావు ఆరోపించారు. నామినేషన్ల దాఖలు మొదలు పోలింగ్ వరకూ కాంగ్రెస్ అనేక అరాచకాలకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. బిఆర్ ఎస్ పార్టీ అభ్యర్థులను బెదిరించడమే గాక, వారిపై భౌతిక దాడులకు తెగబడటం హీనమైన రాజకీయ సంస్కృతికి నిదర్శనమని హరీష్‌రావు పేర్కొన్నారు. చట్టాన్ని సైతం లెక్కచేయకుండా.అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తిన కొందరు పోలీసుల తీరు గర్హనీయమని, ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ ఇలాంటి నీచ రాజకీయాలకు తెగబడటం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనన్నారు.కాంగ్రెస్ కుట్రలు, కుతంత్రాలు, డబ్బు సంచులు, దుష్ట పన్నాగాలు ప్రజల తీర్పును ఏమాత్రం ప్రభావితం చేయలేవని ఆయన ధీమా వ్యక్తంచేశారు. అధికార పార్టీ ఆకృత్యాలకు అదరకుండా, బెదరకుండా బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం చివరి వరకు కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇన్‌చార్జ్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. బిఆర్ఎస్‌పై విశ్వాసంతో తమ అమూల్యమైన ఓటు వేసిన ప్రతి ఓటరుకు హృదయ పూర్వక ధన్యవాదాలన్నారు.

# సార్వత్రిక సమ్మెకు సన్నద్ధం



ప్రజాపక్షం/హైదరాబాద్ : కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త పిలుపుతో గురువారం చేపట్టిన సార్వత్రిక సమ్మెకు కార్మిక, కర్షక, ఉద్యోగ వర్గాలు సన్నద్ధమయ్యాయి. కేంద్రం వ్యవహరిస్తున్న తీరుపైన తమ నిరసన గళాన్ని వినిపించేందుకు రాష్ట్రంలోని అన్ని వర్గాలూ సమ్మెలో పాల్గొననున్నాయి. సార్వత్రిక సమ్మెలో భాగంగా భారీ ప్రదర్శనలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. సమ్మెలో భాగంగా కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఆర్‌టిసి కల్యాణ మండపం నుంచి ఇందిరాపార్క్ వరకు భారీ ప్రదర్శన, బహిరంగ సభను నిర్వహించనున్నారు. అలాగే వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నారాయణగూడ ఫ్లైఓవర్ వద్ద ప్రదర్శన చేపట్టనున్నారు. ఈ కార్యక్రమాల్లో తెలంగాణ రాష్ట్ర నాయకులు హాజరు కానున్నారు. కేంద్ర కార్మిక సంఘాలకు మద్దతుగా ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఉద్యోగ ,రైతు, మహిళా, జర్నలిస్టులు, విద్యార్థి, యువజన, వివిధ ప్రజా సంఘాలు సార్వత్రిక సమ్మెకు సంఘీభావం వ్యక్తం చేశాయి. బిజెపి మినహా అన్ని రాజకీయ పార్టీలకు చెందిన కార్మిక సంఘాలు కూడా సమ్మెకు మద్దతునిచ్చాయి. అనేక పోరాటాల ఫలితంగా సాధించిన కార్మిక చట్టాలను, హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలని, కనీస వేతనాల పెంపు, ప్రైవేటీకరణను ఆపివేయాలని, కాంట్రాక్ట్ విధానాల రద్దు చేయాలని, వ్యవసాయ నల్ల చట్టాలను పూర్తిగా రద్దు చేయాలని, విత్తన , విద్యుత్ సవరణ బిల్లులను రద్దు చేయాలని, కనీస మద్దతు ధర చట్టాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఆయా సంఘాల నాయకులు నిరసన గళాన్ని వినిపించనున్నారు.

**కూనంనేని సాంబశివ రావు...**

కేంద్ర కార్మిక సంఘాల పిలుపునిచ్చిన దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మె'కు సిపిఐ సంపూర్ణ మద్దతునిస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రకటించారు. గురువారం తలపెట్టిన సమ్మెకు మద్దతుగా రాష్ట్ర వ్యాపితంగా ఊరేగింపులు, ప్రదర్శనలలో సిపిఐ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని, సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు. .

ఈ అంశాలన్నింటిపైనా తలపెట్టిన దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మెకు ప్రజలందరూ మద్దతు తెలిపి, జయప్రదం చేయాలని కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు.

**మోటార్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ సమ్మెను విజయంతం చేయాలి : బైరగోని రాజు గౌడ్**



కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తూ, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్ల జీవన ఉపాధిని దెబ్బతీస్తుందని, ప్రధానంగా ఓలా ఊబర్ లాంటి కార్పొరేట్ కంపెనీలు విచ్చలవిడిగా దోపిడీకి పాల్పడుతున్న వారిపై చెర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీనతవైఖరితో హైదరాబాద్ మహానగరంలో కార్పొరేట్ కంపెనీలు క్యాబ్ డ్రైవర్ల పొట్టకొడుతున్నాయని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైటెక్ సిటీ ఐటీ క్యాడర్‌లో వెండర్లు, సబ్ వెండర్లు దోచుకుంటున్నారని, డ్రైవర్లు 10 లక్షలు పెట్టి కార్‌ను కొనుగోలు చేస్తే, గిట్టుబాటు ధర లేదని, ఇఎంఐలను కూడా కట్టే పరిస్థితి లేదన్నారు.

**సార్వత్రిక సమ్మెలో మహిళలు జయప్రదం చేయాలి**

బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ కార్మిక, వాణిజ్య, ఆర్థిక విధానాలకు నిరసనగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెలో మహిళలు, మహిళా కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ శ్రామిక మహిళా ఫోరం కన్వీనర్ పి.ప్రేమ్ పావని, తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య ఉపాధ్యక్షురాలు ఎస్.ఛాయాదేవి పిలుపునిచ్చారు. హైదరాబాద్, హిమాయత్‌నగర్, సత్యనారాయణ రెడ్డి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత, సామాజిక భద్రతా, రక్షణ, యూనియన్ హక్కులను దెబ్బతీస్తున్న నాలుగు కార్మిక కోడ్లను రద్దు చేయాలని, విబి జిరామ్‌జి చట్టాన్ని రద్దు చేసి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కొత్త విత్తన, విద్యుత్ సవరణ బిల్లులను వెనిక్కి తీసుకోవాలన్నారు. అంగన్‌వాడి, ఆశ వర్కర్స్ , మధ్యాహ్న భోజన పథకంలో మహిళలు ఎక్కువ పనిచేస్తున్నారని, వారికీ 'సమాన పనికి సమాన వేతనం' ఇవ్వాలని కోరారు.

సార్వత్రిక సమ్మెలో భాగంగా హైదరాబాద్, బాగ్‌లింగంపల్లి నుండి ఇందిరా పార్క్ వరకు జరిగే భారీ కార్మికుల ప్రదర్శనలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, నిరసన వ్యక్తం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి నందూరి కరుణ కుమారి, మహిళా సమాఖ్య హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు పడాల నళిని, శ్రామిక మహిళా ఫోరం హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

**సార్వత్రిక సమ్మెలో ఆటో, క్యాబ్, లారీ వాహనాల బంద్ : వెంకటేశం**

సార్వత్రిక సమ్మెలో భాగంగా ఆటో, క్యాబ్, లారీ వాహనాల బంద్‌ను విజయవంతం చేయాలని ఆటో, క్యాబ్, లారీ, సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ బి.వెంకటేశం పిలుపునిచ్చారు. 2019 మోటార్ వాహనాల చట్టాన్ని రద్దు చేయాలని,ఆటో, క్యాబ్ డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఆటోలకు మీటర్ చార్జీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఓలా, ఊబర్, ర్యాపిడోల ద్వారా అక్రమంగా నడుస్తున్న బైక్‌లను నిషేధించాలని,ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12వేలు ఇవ్వాలని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆటోలకు ఈ ఛలాన్ల నుండి మినహాయింపు ఇవ్వాలన్నారు.

**సమ్మెకు 'ఎస్‌టియు' మద్దతు**

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఎస్‌టియు టిఎస్ తమ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు, చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జి. సదానందం గౌడ్, ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యారంగానికి బడ్జెట్‌లో అధిక నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## వర్కింగ్ జర్నలిస్టుల చట్టం, వేజ్ బోర్డు పునరుద్ధరణ

### ఐజెయు డిమాండ్ : సార్వత్రిక సమ్మెకు మద్దతు

హైదరాబాద్/చండీగఢ్ : నాలుగు కార్మిక కోడ్లకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు, దాని అనుబంధ సంఘాలు గురువారం తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఐజెయు అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బల్విందర్ సింగ్ జమ్ము బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్కింగ్ జర్నలిస్టుల చట్టం సహా 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకురావడంపై తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. ఈ చర్య మీడియా సహా అన్ని రంగాల కార్మికులు, ఉద్యోగులకున్న రక్షణను బలహీనపరుస్తుందన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని తక్షణమే తిరిగి అమల్లోకి తేవాలని, మీడియా కార్మికులకు రక్షణ, న్యాయమైన వేతనాలకు హామీనిచ్చేలా వేజ్ బోర్డు వ్యవస్థను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని శ్రీనివాస్ రెడ్డి, బల్విందర్‌సింగ్ జమ్ము డిమాండ్ చేశారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాయడమే కాకుండా ఉద్యోగ భద్రతకు, సామాజిక భద్రతా ప్రయోజనాలకు కొత్త లేబర్ కోడ్‌లు విఘాతం కలిగిస్తాయన్నారు. కార్మిక చట్టాలను ఏకీకృతం చేసే నెపంతో వర్కింగ్ జర్నలిస్టులు, ఇతర వార్తా పత్రికల ఉద్యోగులు (సేవల షరతులు), ఇతర నిబంధనల చట్టం, వేజ్ బోర్డు వంటివి రద్దు చేయడం ఆక్షేపణీయమన్నారు. సేవల షరతులు, వేతనాలు, జర్నలిస్టులు నాన్ జర్నలిస్టుల వృత్తిపరమైన హక్కుల పరిరక్షణకు ఈ నిబంధనలు కీలకమని ఐజెయు నమ్ముతుందని వెల్లడించారు. వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని తిరిగి అమల్లోకి తేవాలని, మీడియా కార్మికులకు రక్షణ, న్యాయమైన వేతనాలకు హామీనిచ్చేలా వేజ్ బోర్డు వ్యవస్థను పునరుద్ధరించాలని శ్రీనివాస్ రెడ్డి, బల్విందర్ సింగ్ జమ్ము డిమాండ్ చేశారు. దేశ కార్మికవర్గానికి ఐజేయూ ఎల్లప్పుడు వెన్నుదన్నుగా నిలుస్తుందని ప్రకటించారు. కార్మికుల హక్కులను పరిరక్షించడమే కాకుండా ప్రజాస్వామిక సిద్ధాంతాలను కాపాడేలా కార్మిక సంఘాలతో అర్థవంతమైన చర్చలు జరపాలని ప్రభుత్వాన్ని శ్రీనివాస్‌రెడ్డి, బల్విందర్ సింగ్ జమ్ము కోరారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఐజేయూ అనుబంధ సంఘాలకు పిలుపునిచ్చారు.

**పత్రికా స్వేచ్ఛను హరించొద్దు : 'ది వైర్'పై చర్యలకు ఖండన**

ప్రముఖ వార్తా సంస్థ ది వైర్‌కు చెందిన ఇన్‌స్టాగ్రామ్ పేజిని నిషేధించడాన్ని ఐజెయు ఖండించింది. ఏకపక్షంగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఆక్షేపించింది. సామాజిక మాధ్యమాల నుంచి వ్యంగ్య వీడియో తొలగింపును తప్పుపట్టింది. ముందస్తు సమాచారం లేకుండా, మీడియా సంస్థకు సరైన వివరణ ఇవ్వకుండా తీసుకునే ఇలాంటి చర్యలు స్వతంత్ర జర్నలిజంపై పెరుగుతున్న అసహనానికి అద్దంపడుతున్నాయని శ్రీనివాస్‌రెడ్డి, బల్విందర్ సింగ్ జమ్ము వేరొక ప్రకటనలో వ్యాఖ్యానించారు. 'లీగల్ రిక్వెస్ట్' అంటూ పారదర్శకత లేకుండా గందరగోళానికి గురిచేసే చర్యలు తీసుకోవడం జవాబుదారీతనంపై ప్రశ్నలకు తావిస్తుందన్నారు. వ్యంగ్యం, విమర్శలు, వ్యాఖ్యలు పత్రికా స్వేచ్ఛలో భాగమని, రాజ్యాంగం ఇందుకు రక్షణ కల్పించిందని గుర్తుచేశారు. సంబంధిత అధికారులు తక్షణమే ఈ వ్యవహారంలో స్పష్టతివ్వాలని ఐజెయు తరపున శ్రీనివాస్‌రెడ్డి, బల్విందర్ సింగ్ జమ్ము డిమాండ్ చేశారు. పత్రికా స్వేచ్ఛను అణచివేస్తూ, ప్రజాస్వామిక విలువలను కాలరాస్తూ, పారదర్శకత లేని చర్యలు తీసుకోవడాన్ని ప్రభుత్వం మానుకోవాలని సూచించారు. మీడియా గొంతు నొక్కేందుకు ప్రత్యక్షంగా లేక పరోక్షంగా జరిగే ఏ ప్రయత్నమైనా గానీ ప్రజాస్వామ్యంలో ఆమోదయోగ్యం కాదని శ్రీనివాస్‌రెడ్డి, బల్విందర్ సింగ్ జమ్ము స్పష్టంచేశారు.

## మున్సిపల్ ఎన్నికల్లో 'హస్తం' హవా

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో 70 శాతం 'హస్తగతం' కానుందని పీపుల్స్ పల్స్ ఎగ్జిట్‌పోల్ సర్వే తెలిపింది. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన ఎగ్జిట్‌పోల్‌ను పీపుల్స్‌పల్స్ బుధవారం సాయంత్రం వెల్లడించింది. మంచిర్యాల, రామగుండం, నల్లగొండ , మహబూబ్‌నగర్ , కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లు కాంగ్రెస్‌కు, కరీంనగర్, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లు బిజెపికి దక్కె అవకాశాలు ఉన్నట్టు సర్వే తెలిపింది. బిఆర్ఎస్‌కు ఏ ఒక్క స్థానం దక్కె అవకాశాలు లేదని స్పష్టం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలలో కాంగ్రెస్‌కు 68 నుంచి 76, బిఆర్ఎస్‌కు 29 నుంచి 36, బిజెపికి 3 నుంచి 5 , ఎంఐఎంకు ఒకటి గెలిచే అవకాశాలు ఉండగా, 8 నుంచి 14 మున్సిపాలిటీలలో గట్టిపోటీ ఉన్నదని ఎగ్జిట్‌పోల్ తెలిపింది. నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్లలో ఎంఐఎం కీలక కానుందని తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీల్లో మొత్తం 2582 వార్డులలో కాంగ్రెస్‌కు 1210 నుంచి 1290 వార్డులు( 36 ఓట్ల శాతం), బిఆర్ఎస్‌కు 860 నుంచి 930వార్డులు(29.7 శాతం ఓట్లు), బిజెపికి 250 నుంచి 270 వార్డులు (19.3 శాతం ఓ ట్లు), ఎంఐఎంకు 35 నుంచి 44 వార్డులు( రెండు శాతం ఓట్లు), సిపిఐకి 12 నుంచి 17వార్డులు(రెండు శాతం ఓట్లు), సిపిఐ(ఎం)కు 10 నుంచి 14వార్డులు (1.2 శాతం ఓట్లు), ఇతరులు 90 నుంచి 110 వార్డులు (9.7 శాతం ఓట్లు) వరకు గెలిచే అవకాశాలు ఉన్నాయని పీపుల్స్‌పల్స్ సర్వే ఎగ్జిట్‌పోల్స్ తెలిపింది.

**కార్పొరేషన్ల వారీగా...**

**రామగుండం:** కాంగ్రెస్ 30–34, బిఆర్ఎస్ 16–20,బిజెపి 36, ఇతరులు 47 డివిజన్లు.

**మంచిర్యాల:** కాంగ్రెస్ 39–43, బిఆర్ఎస్ 8–12, బిఆర్ఎస్ 69, ఇతరులు 12.

**కొత్తగూడెం:** కాంగ్రెస్ 28–34, బిఆర్ఎస్ 79, సిపిఐ 14–16, ఇతరులు 24.

**మహబూబ్‌నగర్ :** కాంగ్రెస్ 26–30, బిఆర్ఎస్ 18–22, బిజెపి 68, ఎంఐఎం 24, ఇతరులు 01.

**నల్లగొండ :** కాంగ్రెస్ 21–26,బిబిఆర్ఎస్ 8–12, బిజెపి 610, ఎంఐఎం 24, ఇతరులు 12.

**నిజామాబాద్:** కాంగ్రెస్ 10–16, బిఆర్ఎస్ 24, బిజెపి 26–31, ఎంఐఎం 8–12, ఇతరులు 12.

**కరీంనగర్:** కాంగ్రెస్ 14–16, బిబిఆర్ఎస్ 10–12,బిజెపి 24–29, ఎంఐఎం 69, ఇతరులు 13.



## కొత్తగూడెం కార్పొరేషన్‌పై ఎగిరేది కంకికొడవలే

### 36కి పైగా డివిజన్లలో ఎర్రజెండా రెపరెపలు : కూనంనేని ధీమా

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలపక్షాన పోరాడుతున్న సిపిఐ అభ్యర్థుల విజయం ఖాయమని, 36కి పైగా డివిజన్లలో ఎర్రజెండా రెపరెపలాడబోతోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం జరిగిన ఎన్నికల సరళిని ఆయన 60 డివిజన్ల వ్యాప్తంగా పర్యటించి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికల్లో ఓటర్లు ఎంతో చైతన్యవంతంగా పాల్గొన్నారని, సిపిఐ ఎన్నికల గుర్తు కంకికొడవలికి ప్రజల నుండి విశేషస్పందన లభించిందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఉత్సాహాన్ని చూపుతుంటే సిపిఐ అభ్యర్థుల మెజార్టీ స్పష్టంగా కనిపిస్తోందన్నారు.

**అధికార పక్షానికి బుద్ధి చెప్పిన ఓటర్లు :** ఎన్నికల సమయంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొందరు ఇష్టాను సారంగా వ్యవహరిస్తూ ఓటర్లను ప్రభావితం చేయాలని చూశారని కూనంనేని విమర్శించారు. అక్కడక్కడా పోలీసుల తీరు వల్ల చిన్నపాటి అసంతృప్తికర సంఘటనలు ఎదురైనప్పటికీ, ప్రజలు శాంతియుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకున్నారని అన్నారు. అధికార పక్ష ప్రలోబాలను కాదని ప్రజా సమస్యలపై నిలబడే సిపిఐకే ఓటర్లుపట్టం కట్టారని ఆయన విశ్లేషించారు.

**యంత్రాంగానికి అభినందనలు :** ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగాసాగేలా కృషి చేసిన జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పి రోహిత్ రాజ్‌కు కూనంనేని అభినందనలు తెలిపారు. రెండు రోజుల్లో జరగబోయే ఓట్ల లెక్కింపులో ప్రజల తీర్పు స్పష్టంగా వెల్లడవనుందని, కొత్తగూడెం అభివృద్ధిలోసిపిఐ కీలకపాత్ర పోషించబోతోందని ఆయన స్పష్టం చేశారు.

# భారీ భద్రత మధ్య ముగిసిన పోలింగ్

### చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతం

### పోలింగ్ సిబ్బందిపై పిచ్చికుక్కల దాడి

### పోలింగ్ బూత్‌లోకి కత్తితో ప్రవేశించిన మహిళ

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటిల్లో భారీ పోలీసు బందోబస్తు మధ్య పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ప్రధానంగా ఎక్కడా పెద్ద హింసాత్మక సంఘటనలు జరగకపోవడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.నల్గొండ, నిజామాబాద్, మెదక్,నారాయనపేట్, సింగారెడ్డి,జనగామ,మహబూబాబాద్ జిల్లాలలో చోటు చేసున్న గొడవలు పెద్దవి కాకుండా భద్రత బలగాలు చాకచక్యంగా వ్యవహరించడంతో పరిస్థితులు నియంత్రణలో ఉన్నాయి. ములబబాబాద్, నిజామాబాద్, మేడక్ వంటి చోట్ల అక్కడి స్థానిక నేతల మధ్య గొడవలు, చేయి వేసుకున్న ఘటనలు నమోదయ్యాయి.జనగామలో కొంతమంది ఓటర్లు ఓటుకు డబ్బులు ఇవ్వలేదని రోడ్డుపై నిరసనగా ప్రదర్శించారు. పురపాలక ఎన్నికల సందర్భంగా పలుచోట్ల స్వల్ప ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో చెదురుమదురు ఘటనల మినహా పురపాలిక పోలింగ్ సజావుగా సాగింది. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో బోగస్ ఓట్లు వేస్తున్నారని బిఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటుండగా.. మరికొన్ని చోట్ల ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బులు పంచుతున్నారన్న సమాచారంతో ఇరు పార్టీల కార్యకర్తలు బాహాబాహీకి దిగారు.

**సంగారెడ్డిలో పోలీసులకు, జగ్గారెడ్డి మధ్య ...**

సంగారెడ్డి మున్సిపాలిటీలో పోలీసులకు, జగ్గారెడ్డి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. 34వ వార్డులో ఆ వార్డు అభ్యర్థి అడ్డుకుని సిఐ కాలర్ పట్టుకోవడంతో గొడవ మొదలైంది. కాంగ్రెస్ శ్రేణులు సిఐ తీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న జగ్గారెడ్డి పోలింగ్ సెంటర్ వద్దకు చేరుకుని పోలింగ్ ఆపేస్తానంటూ బూత్‌లోకి వెళ్లడానికి ప్రయత్నించారు. పోలీసులతో జగ్గారెడ్డి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. పోలీసులు జగ్గారెడ్డికి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు.ఈ సందర్భంగా జగ్గారెడ్డి పోలీసులపై ఘాటు వ్యాఖ్యలతో రెచ్చిపోయారు. రిగ్గింగ్ చేస్తున్నారని చెప్పిన మా అభ్యర్థిపై సిఐ శివకుమార్ గల్లా పట్టాడని ఆ సిఐ మొగోడు అయితే ఇక్కడికి రావాలని మండిపడ్డారు. సంగారెడ్డిలో శాంతిభద్రతల సమస్య వస్తే దానికి సిఐ, హోంగార్డే కారణం అని ఆయన ఆరోపించారు.కాంగ్రెస్ అభ్యర్థి గల్లా పట్టుకున్నా సిఐని వెంటనే సస్పెండ్ చేయాలని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి డిమాండ్ చేశారు.

**సిబ్బందిపై పిచ్చికుక్కల దాడి..**

కరీంనగర్ జిల్లాలో ఎన్నికల సిబ్బంది పై పిచ్చి కుక్కలు దాడి చేశాయి. ఎన్నికల పోలింగ్ కేంద్రం ప్రాంగణంలో ఉన్న ఎన్నికల సిబ్బందిపై దాడి చేసిన రెండు పిచ్చి కుక్కలు అటాక్ చేశాయి. ఈ దాడిలో ముగ్గురు అధికారులు గాయపడ్డారు. గాయపడినవారికి అక్కడే ఉన్న వైద్య శిబిరంలో ప్రాథమిక చికిత్స చేయించి.. వ్యాక్సిన్ ఇప్పించి ఇంటికి పంపించారు.

**పలుచోట్ల స్వల్ప ఘర్షణలు ..**

నర్సాపూర్ మున్సిపాలిటీ 15వ వార్డులో బిఆర్ఎస్, బిజెపి కార్యకర్తల మధ్య ఘర్షణ చెలరేగింది. ఈ క్రమంలోనే పరస్పర దాడులకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. రామాయంపేట ఏడో వార్డులో బిజెపి, కాంగ్రెస్ వర్గాల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది.

**కానిస్టేబుల్‌పై ఎంపి ఆగ్రహం..**

నిజామాబాద్ పరిధిలోని బూత్ నంబర్ 7లో శంకర్ అనే కానిస్టేబుల్, ఒక మున్సిపల్ ఉద్యోగి కలిసి ఓటర్లను కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలంటూ ప్రభావితం చేస్తున్నారని ఎంపి అరవింద్ సమాచారం అందిందని.. దీనిపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న ఎసిపితో ఎంపి మాట్లాడారు. 'మీ కానిస్టేబుల్ తప్పు చేస్తే, మీరు చేసినట్టే' అని ఎంపి అరవింద్ ఎసిపిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. 'మాకు నేర్పించినట్లు కాదు.. మీరే నేర్చుకోండి ముందు' అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

**బూత్‌లోకి కత్తితో..**

ఆదిలాబాద్ పట్టణంలో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. పట్టణంలోని రాంనగర్లోని పోలింగ్ కేంద్రానికి ఓటు వేయడానికి వచ్చిన ఓ మహిళ తన వెంట కత్తిని తీసుకురావడాన్ని చూసిన తోటి ఓటర్లు, అక్కకోవడంతో సిబ్బంది షాక్‌కు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సదరు మహిళను, ఆమె భర్తను అదుపులోకి తీసుకున్నారు. ఆమె కత్తిని ఎందుకు తీసుకువచ్చింది అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

**నకిలీ వెండి నాణాల గోల..**

మేడ్చల్ జిల్లా అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో ఎన్నికల వేళ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బిజెపి పార్టీ 5 వ వార్డు అభ్యర్థి మాలతి మాధవరెడ్డి నకిలీ వెండి నాణేలను పంచుతూ ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారంటూ బిఆర్ఎస్ పార్టీ నాయకుడు దశరథ్ ఆరోపించారు.ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి మాలతి మాధవరెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆయన ఆరోపించారు.

**పరిగిలో కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల మధ్య ఉద్రిక్తత..**

వికారాబాద్ జిల్లా పరిగి మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న ఎన్నికల పోలింగ్లో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. పట్టణంలోని 13వ వార్డు 27వ పోలింగ్ కేంద్రం వద్ద అధికార కాంగ్రెస్ , ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ కార్యకర్తల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. పోలింగ్ సజావుగా సాగుతున్న సమయంలో, కాంగ్రెస్ నాయకులు బోగస్ ఓట్లు వేయిస్తున్నారని బిఆర్ఎస్ శ్రేణులు ఆరోపించాయి. బయటి వ్యక్తులతో దొంగ ఓట్లు వేయించేందుకు ప్రయత్నిస్తున్నారంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిరసన చేపట్టారు. దీనిపై కాంగ్రెస్ వర్గీయులు ధీటుగా స్పందించారు. తాము ఎలాంటి బోగస్ ఓట్లు వేయించడం లేదని, స్థానిక ఓటర్లే తమ వెంట తెచ్చుకున్న ప్రభుత్వ గుర్తింపు కార్డుల ద్వారా నిబంధనల ప్రకారమే ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని వారు వాదించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం పెరిగి తోపులాట వరకు దారితీసింది.

**కర్రలతో దాడి : పలువురికి గాయాలు..**

గాంధీనగర్ 13వ వార్డులో తీన్మార్ మల్లన్న నేతృత్వంలోని టిఆర్‌పి (తెలంగాణ రైట్ పార్టీ) ,కాంగ్రెస్ కార్యకర్తలు భౌతిక దాడులకు దిగారు. పరస్పరం కర్రలతో దాడులు చేసుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు అకారణంగా తమపై లాఠీచార్జ్ చేశారని ఆరోపిస్తూ బాధితులు సూర్యాపేట జనగామ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీనివల్ల కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది.

**యాదాద్రి భువనగిరి:**

**ఓటుకు నోటు కలకలం..**

భువనగిరి మున్సిపాలిటీలో ఓటర్లకు బహిరంగంగా నగదు పంపిణీ చేస్తున్నారంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద నగదు పంపిణీని అడ్డుకునే క్రమంలో స్వల్ప ఘర్షణలు జరిగాయి.

**ఇతర ప్రాంతాల్లో ఫిర్యాదుల పర్వం..**

చండూరు, చౌటుప్పల్, తిరుమలగిరి మరియు మోత్కూరు మున్సిపాలిటీల్లోనూ ఉద్రిక్తత నెలకొంది. నిబంధనలకు విరుద్ధంగా పోలింగ్ బూత్ల వద్ద ప్రచారం చేస్తున్నారంటూ అభ్యర్థులు రిటర్నింగ్ అధికారులకు ఫిర్యాదులు చేశారు.

### మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో

## 90 శాతం స్థానాలు కాంగ్రెస్‌వే

### మహేశ్ కుమార్ గౌడ్ ధీమా



ప్రజాపక్షం/హైదరాబాద్ : మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ 90 శాతం కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను కైవసం చేసుకోబోతోందని టిపిసిసి అధ్యక్షుడు ఎంఎల్‌సి, బిమహేశకుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు జరిగిన పోలింగ్ సరళిని పరిశీలిస్తే.. అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ గెలుపొందనుందన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో అందిస్తున్న ప్రజా పాలన, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ కార్యపథకాలకు పట్టణ ఓటర్లు పట్టం కట్టారని తెలిపారు. ప్రభుత్వ పనితీరుపై రాష్ట్ర ప్రజలు పూర్తిగా సంతృప్తిగా ఉన్నారని ఈ ఫలితాలు స్పష్టం చేయనున్నాయని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారంటీల పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణ మాఫీ, రైతు భరోసా ఇందిరమ్మ ఇళ్లు, పట్టణాభివృద్ధికి ప్రత్యేక నిధుల కేటాయింపు 200 యూనిట్ల లోపు ఉచిత కరెంట్ తదితర కార్యక్రమాలు ప్రజల మన్నలను పొందాయని వివరించారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, పారిశుద్ధ్య వ్యవస్థ మెరుగుదలపై ప్రభుత్వం తీసుకున్న అనేక చర్యలు ఓటర్లలో సానుకూల భావనను కలిగించాయని చెప్పారు. పార్టీ విజయానికి ఈ ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు.

GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-43, తార్నాక.
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు
NIT No. 09/EE-II/Cir.43/SBZ/GHMC/2025-26, తేది: 10.02.2026
పని పేరు: 10 సంఖ్యలు, జిహెచ్ఎంసి, ఎస్‌బిజెడ్, తార్నాక సర్కిల్-43లోని వార్డు నెం.173లో అడిక్‌మెట్, టిప్పుఖాన్ మజీద్, ఈద్గా కోసం నల్ల మచ్చలను కవర్ చేయడానికి PSCC పోల్‌తో పాటు 1x6+25 AB కేబుల్ స్ట్రింగ్ మరియు అన్ని ఉపకరణాలను అందించడం (రీకాల్). అంచనా మొత్తం / ఇసివి (రూ.లక్షలలో): 1,52,107. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: 12.02.2026న మ.2.00గం.ల నుండి 16.02.2026న మ.2.00గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-43, తార్నాక, జిహెచ్ఎంసి, సికింద్రాబాద్ జోన్, సెల్ నెం. 9704405076. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-43, తార్నాక, సికింద్రాబాద్ జోన్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 15229-PP/CL/ADVT/1/2025-26, Date: 11-02-2026

# పురపోరులో 73.01 శాతం పోలింగ్





ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్ల ఎన్నికల్లో మొత్తం 73.01 శాతం పోలింగ్ నమోదయింది. ఏడు కార్పొరేషన్లలో 66.05 శాతం,116 మున్సిపాలిటీల్లో 75.88 శాతం పోలింగ్ జరిగినట్టు రాష్ట్ర ఎన్నిక కమిషన్ బుధవారం రాత్రి వెల్లడించింది. రాష్ట్రంలోనే అత్యధికంగా చౌటుప్పల్ మున్సిపాలిటీలో 91.91 శాతం నమోదవ్వగా, అత్యల్పంగా నందికొండ మున్సిపాలిటీలో 59.68 శాతం నమోదయింది. అత్యధికంగా నల్లగొండ కార్పొరేషన్‌లో 77.36 శాతం, అత్యల్పంగా నిజామాబాద్ కార్పొరేషన్‌లో 59.12 శాతం పోలింగ్ జరిగింది.

**ప్రశాతంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ : రాణి కుముదిని**

రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల కమిషన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మసబ్ ట్యాంక్‌లోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుండి ఎన్నికల కమిషనర్ ఐ. రాణి కుముదిని పోలింగ్ సరళిని వెబ్ కాస్టింగ్ ద్వారా నిశితంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలు చదురు మొదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా కొనసాగిందని తెలిపారు. ఎన్నికలలో వెబ్ కాస్టింగ్ ప్రాధాన్యతను వివరించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఏం జరుగుతుందో ప్రత్యక్షంగా చూడటం ద్వారా అక్రమాలకు తావులేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించవచ్చని ఆమె తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో వెబ్ కాస్టింగ్ ద్వారా నిరంతర నిఘా ఉంచడం వల్ల శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవడానికి వీలవుతుందన్నారు. ఎన్నికల ప్రక్రియలో సాంకేతికతను జోడించడం ద్వారా యువ ఓటర్లలో అవగాహన పెరుగుతుందని, ఇది వ్యవస్థపై వారికి నమ్మకాన్ని కలిగించి ఓటింగ్ శాతం పెరగడానికి దోహదపడుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌తో పాటు పలువురు కీలక అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్ రెడ్డి, మున్సిపల్ పరిపాలన శాఖ కమిషనర్, డైరెక్టర్ డాక్టర్ టి.కె. శ్రీదేవి, రాష్ట్ర డిజిపి బి.శివధర్ రెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ పాల్గొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పోలింగ్ సరళిని, భద్రతా ఏర్పాట్లను, సాంకేతిక అంశాలను సమీక్షించారు.

**పోలింగ్ తీరును పరిశీలించిన డిజిపి బి.శివధర్ రెడ్డి**

మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిన పోలింగ్ సరళిని వెబ్ కాస్టింగ్ విధానం ద్వారా తన కార్యాలయంలో కమాండ్ కంట్రోల్‌లో డిజిపిబి.శివధర్ రెడ్డి, అదనపున డిజిపి మహేష్ భగవత్ ఇతర అధికారులు ఎప్పకప్పుడు పర్యవేక్షించారు. ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాల్లో జరుగుతున్న పోలింగ్‌ను వెబ్‌కాస్టింగ్ ద్వారా నేరుగా వీక్షిస్తూ ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి అధికారులకు ఆయన సూచనలు జారీ చేశారు.

**వృద్ధులు ఓట్లు వేసేలా పోలీసుల సహాయం**

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వృద్ధులు ఓట్లు వేసేందుకు పోలీస్ సిబ్బంది సహాయం చేశారు. నిజామాబాదులో సిపి పి.సాయి చైతన్య, నల్గొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్, వనపర్తి జిల్లా ఎస్‌పి సునీత రెడ్డి, పెద్దపెల్లి డిసిపి బి రామ్ రెడ్డి వృద్ధ ఓటర్లను, వికలాంగులను వీల్ చైర్‌లో పంపించారు. ములుగు జిల్లాలో మున్సిపల్ ఎన్నికల విధులు నిర్వహిస్తున్న నాలుగో బెటాలియన్ సిబ్బంది మూర్ఛ వచ్చి పడిపోయిన ఓటరుకు ప్రథమ చికిత్స చేసి ఆసుపత్రికి తరలించారు. అదేవిధంగా అక్కడ ఉన్న వృద్ధ ఓటర్లను పోలింగ్ కేంద్రంకు తీసుకువెళ్లి ఓట్లు వేసేలా సహాయపడ్డారు. అదేవిధంగా, సంగారెడ్డి జిల్లా లోని జిన్నారం మండల పరిధికి చెందిన రాలకత్వలో వృద్ధులను ఆటోలు తీసుకువెళ్లి ఓట్లు వేసేలా తోడ్పాటు అందించారు. మహబూబాబాద్ జిల్లాలో ఓటర్ల పసిపిల్లలను వారు ఓటేసి వచ్చే వరకు శ్రద్ధగా పోలీస్ సిబ్బంది చూశారు.

## కాంగ్రెస్, బిఆర్ఎస్ డబ్బు, రాజకీయాలనే నమ్ముకున్నాయ్

కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్‌ఎస్ రెండూ డబ్బు రాజకీయాలనే నమ్ముకుని ఎన్నికల్లో పాల్గొన్నాయని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ఆరోపించారు. తమ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ప్రభుత్వంపైన ప్రజలలో వ్యతిరేకత కనిపించిందని, బిఆర్‌ఎస్ పట్ల ఆదరణ లేదన్నారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావుతో కలిసి కిషన్‌రెడ్డి బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ డబ్బు, దౌర్జన్యాలతో ఎన్నికలను ప్రభావితం చేయాలని ప్రయత్నించారని, అయినప్పటికీ ఈ ఎన్నికల్లో బిజెపి మంచి ఫలితాలను సాధించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పలువురు ఐఎఎస్ అధికారులను, వివిధ శాఖల అధికారులను బదిలీ చేసిందని ఆరోపించారు. గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించడం కూడా ఎన్నికల కమిషన్ విధివిధానాలను ఉల్లంఘించడమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సమగ్ర ప్రణాళిక, ఆర్థిక వనరుల సమీకరణ లేకుండానే అనేక గ్రామాలను కొత్త కార్పొరేషన్లలో విలీనం చేసిందని ఆరోపించారు. జిహెచ్‌ఎంసి కోర్ ఏరియాలోనే అనేక ప్రాంతాల్లో కనీస మౌలిక వసతులు లేవని, చిన్న వర్షం పడితే డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని, రోడ్లు వరద నీటితో మునిగిపోతున్నాయని ఆరోపించారు. ఎటువంటి అభిప్రాయ సేకరణ లేకుండానే జిహెచ్‌ఎంసిని విభజించడం ఏక పక్షంగా నిర్ణయమన్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించడం కాంగ్రెస్ ప్రభుత్వం బెంగళూరులో ఆర్‌ఆర్ ట్యాక్స్ 12శాతం వసూలు చేస్తే, తెలంగాణలో 30శాతం వరకు వసూలు చేస్తున్నారన్నారు. రాజ్యాంగవిరుద్ధమన్నారు. ఎన్.రాంచందర్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎంఎల్‌ఎల డైరెక్షన్లతో పోలీసులు పనిచేయడం అప్రజస్వామిక చర్య అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను అశాస్త్రీయంగా మూడు భాగాలుగా విభజించిందని ఆరోపించారు. ఈ మీడియా సమావేశంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్ గౌడ్, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జ్ ఎన్.వి.సుభాష్, నాయకులు రవి నాయక్, జి.వెంకట్ రెడ్డి, సునీత, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## జూబ్లీహిల్స్, ఖానామెట్‌లో.. రూ.1003 కోట్ల ప్రభుత్వ భూమి రక్షణ

ప్రజాపక్షం/హైదరాబాద్ : జూబ్లీహిల్స్‌లో పార్కు స్థలాన్ని ఆక్రమించిన నిర్మాణాలను హైడ్రా తొలగించి ఫెన్సింగ్ వేసింది. అపోలో ఆసుపత్రి సమీపంలో 150 గజాల పార్కు భూమిని ఆక్రమించి మూడు అంతస్తుల నిర్మాణం చేపట్టినట్లు నిర్ధారించి కూల్చివేసింది. సంబంధితులపై కేసు నమోదు చేశారు. అలాగే హైటెక్స్ సమీపంలోని ఖానామెట్‌లో ఆల్ ఇండియా వెలమ సంఘానికి కేటాయించిన 5 ఎకరాల ప్రభుత్వ భూమి కోర్టు స్టే నేపథ్యంలో ఆక్రమణకు గురికాకుండా హైడ్రా ఫెన్సింగ్ వేసి బోర్డులు ఏర్పాటు చేసింది. ఈ రెండు చర్యల ద్వారా మొత్తం రూ.1003 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తిని హైడ్రా కాపాడింది.

## మూడు కార్పొరేషన్లు-ఒకే చట్టం..

### జిహెచ్‌ఎంసి చట్టం ప్రకారం మూడు కార్పొరేషన్‌ల పాలన

ప్రజాపక్షం/హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి) విభజనతో ఏర్పడిన కొత్త మున్సిపల్ కార్పొరేషన్‌ల పాలనకు 1955 నాటి జిహెచ్‌ఎంసి చట్టమే మార్గదర్శకంగా ఉండనుంది. సాధారణంగా రాష్ట్రంలోని ఇతర మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు తెలంగాణ మున్సిపాలిటీస్ చట్టం–2019 ప్రకారం నడుస్తున్నప్పటికీ, తాజాగా విభజించిన మూడు కార్పొరేషన్లు మాత్రం జిహెచ్‌ఎంసి చట్టం పరిధిలోకి రానున్నాయి. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిహెచ్‌ఎంసి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లు జిహెచ్‌ఎంసి చట్టం కింద పనిచేయనున్నాయి. ఈ చట్టంలో ఇటీవల పలు సవరణలు చేయగా, అవి జనవరి మొదటి వారంలో జరిగిన తెలంగాణ శాసనసభ శీతాకాల సమావేశాల్లో ఆమోదం పొందాయి. సవరణలలో ముఖ్యంగా కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ఎన్ని కార్పొరేషన్లనైనా ఏర్పాటు చేసే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి కల్పించారు. ప్రస్తుతం కోర్ అర్బన్ రీజియన్ అంటే ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న ప్రాంతాలన్నీగా నిర్వచించారు. ఇంకా, 'సిటీ' అనే పదానికి ఇచ్చిన నిర్వచనాన్ని కోర్‌గా మార్చగా, 'కార్పొరేషన్' అనే పదానికి ప్రభుత్వ నోటిఫికేషన్ ద్వారా ప్రకటించిన పరిధిలోని అన్ని కార్పొరేషన్లుగా అర్థం వచ్చేలా సవరణలు చేశారు. ఇంతకుముందు చట్టంలోని సెక్షన్ 3(3) ప్రకారం నగర పరిమితులను మార్పులు చేయాలంటే సంబంధిత కార్పొరేషన్‌తో సంప్రదింపులు జరపాల్సి ఉండేది. అయితే తాజా సవరణలతో ఆ నిబంధనను తొలగించి, రాష్ట్ర శాసనసభకు నగర పరిధిలోని ఏ ప్రాంతాన్నైనా చేర్చడం, తొలగించడం లేదా మార్పులు చేయడం వంటి పూర్తి అధికారం కల్పించారు.

ఈ ప్రక్రియలో కార్పొరేషన్లతో సంప్రదింపులు అవసరం లేకుండా చేశారు. అదేవిధంగా, కార్పొరేషన్ల మధ్య తలెత్తే సమస్యల పరిష్కారానికి తుది నిర్ణయం తీసుకునే అధికారం కూడా రాష్ట్ర ప్రభుత్వానికే ఇచ్చారు. చట్టంలోని నిబంధనలను అమలు చేయడంలో ఏవైనా ఇబ్బందులు తలెత్తితే, వాటిని తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకునే అధికారాన్ని కూడా ప్రభుత్వం స్వయంగా వినియోగించుకునే అవకాశం ఉంది. ఈ నూతన పాలనా సంస్కరణల ద్వారా హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతంలో పాలన మరింత కేంద్రీకృతం కానుంది.

## మూడు కార్పొరేషన్‌లలో అధికారుల బదిలీలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : కోర్ అర్బన్ రీజియన్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా కొత్తగా మూడు మున్సిపల్ కార్పొరేషన్‌లలో ఏర్పాటు నేపథ్యంలో, పలువురు అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అదనంగా, పబ్లిక్ హెల్త్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్. భాస్కర్ రెడ్డికి ఇంజనీర్ఇన్‌చీఫ్ (పబ్లిక్ హెల్త్)గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వం తరపున స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ ఈ ఆదేశాలను జారీ చేశారు.

**కీలక నియామకాలు ఇవే..**

జిహెచ్‌ఎంసి (గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్)
ఎన్. రవి కిరణ్ : జోనల్ కమిషనర్ (సికింద్రాబాద్ జోన్), అదనపు కమిషనర్ (పారిశుద్ధ్యం).
కె. సత్యనారాయణ : అదనపు కమిషనర్ (అడ్మిన్).
కె. శ్రీనివాస్ : చీఫ్ సిటీ ప్లానర్.
ఎస్. రత్నాకర్ : చీఫ్ ఇంజనీర్.
ఎంఎంసి (మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్):
సి.ఎన్. రఘు ప్రసాద్ : (అదనపు కమిషనర్ (పారిశుద్ధ్యం)
కె. వేణుగోపాల్ : (అదనపు కమిషనర్ (అడ్మిన్).
కె. ప్రదీప్ కుమార్ : (చీఫ్ సిటీ ప్లానర్).
వి. అశోక్ రెడ్డి : (చీఫ్ ఇంజనీర్).
సిఎంసి (సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్):
డాక్టర్ ఎన్. యాదగిరి రావు : (అదనపు కమిషనర్ (పారిశుద్ధ్యం).
బి. గీత రాధిక : (అదనపు కమిషనర్ (అడ్మిన్).
బి. వెంకన్న : (చీఫ్ సిటీ ప్లానర్).
ఎస్. నిత్యానందం : (చీఫ్ ఇంజనీర్).



## శ్రీశైలం మల్లన్నను దర్శించిన మంత్రి కొండా సురేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్: ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన పవిత్ర శ్రీశైలం మహాక్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లికార్జున స్వామి వారిని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ గారు ఈరోజు ఉదయం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ ప్రధాన ద్వారం వద్ద దేవస్థానం అధికారులు, వేదపండితులు ఆమెకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద మంత్రోచ్చారణల మధ్య మంత్రి గారు స్వామివారి ఆశీస్సులు పొందారు.దర్శనం అనంతరం మంత్రి రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, అభివృద్ధి, సమృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని స్వామివారిని వేడుకున్నారు.

## ఇక ఓఆర్ఆర్ వరకు.. హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డ్

పరిధి విస్తరించిన ప్రభుత్వం
కొత్త పోస్టుల మంజూరుతో
సంస్థ పునర్వ్యవస్థీకరణ



ప్రజాపక్షం/హైదరాబాద్ : నగరవాసులకు నీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ సేవలను మరింత మెరుగుపరిచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. పెరుగుతున్న నగరీకరణకు అనుగుణంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ (హెచ్‌ఎండబ్ల్యుఎస్‌ఎస్‌బి) పరిధిని విస్తరిస్తూ, సంస్థాగత మార్పులు చేస్తూ ప్రభుత్వం మూడు వేర్వేరు ఉత్తర్వులను జారీ చేసింది. ప్రభుత్వ తాజా ఆదేశాల ప్రకారం, వాటర్ బోర్డ్ అధికార పరిధిని కోర్ అర్బన్ రీజియన్ (కోర్) వరకు విస్తరించారు. మొత్తం 2053 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రాంతంలోని నీటి సరఫరా, మురుగునీటి నెట్‌వర్క్ నిర్వహణ, కొత్త ఎస్‌టిపిల నిర్మాణ బాధ్యతలను బోర్డుకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఉన్న జిహెచ్‌ఎంసి పరిమితులను తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్‌కు విస్తరించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

**జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పోస్టు మంజూరు**

పెరిగిన పనిభారం, విస్తరించిన కార్యకలాపాలను పర్యవేక్షించడానికి, బోర్డులో కొత్తగా ఒక జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (జెఎండి) పోస్టును మంజూరు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఐఎఎస్ కేడర్‌లో ఉండే ఈ అధికారి మేనేజింగ్ డైరెక్టర్‌కు పరిపాలనలో సహకరిస్తారు. బోర్డు ఏర్పడిన సమయంలో 2.50లక్షలుగా ఉన్న కనెక్షన్ల సంఖ్య ప్రస్తుతం 14లక్షలకు చేరుకోవడంతో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

**ఇద్దరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల నియామకం**

పాలనను వికేంద్రీకరించి, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడానికి బోర్డును మూడు స్వతంత్ర ప్రాంతీయ యూనిట్లుగా పునర్వ్యవస్థీకరించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ క్రమంలో భాగంగా జాయింట్ సెక్రటరీ లేదా అడిషనల్ సెక్రటరీ కేడర్‌లో ఇద్దరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. వీరు ప్రభుత్వం నుండి డెప్యూటేషన్ ప్రాతిపదికన నియమించబడతారు. ఈ విస్తరణ, కొత్త పోస్టుల భర్తీ ద్వారా ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని ప్రాంతాల్లో సమానమైన నీటి సరఫరా, సమర్థవంతమైన పారిశుద్ధ్య నిర్వహణ సాధ్యమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

**జాయింట్ ఎండిగా మయాంక్ మిట్టల్ బాధ్యతల స్వీకరణ**

ప్రభుత్వ నిర్ణయాల అనంతరం జలమండలి కొత్త జాయింట్ ఎండిగా మయాంక్ మిట్టల్ బాధ్యతలు స్వీకరించారు. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ఆయన ఛార్జ్ తీసుకున్నారు. ప్రస్తుతం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న మయాంక్ మిట్టల్‌ను జాయింట్ ఎండిగా ప్రభుత్వం నియమించింది.

**మూడు జోన్లకు కొత్త ఈడల నియామకం**

పునర్వ్యవస్థీకరణలో భాగంగా మూడు జోన్లకు కొత్త ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లను నియమించారు.
మల్కాజిగిరి జోన్ : ఎస్. పంకజ నూతన ఈడిగా బాధ్యతలు స్వీకరించారు.
సెంట్రల్ (ఖైరతాబాద్) జోన్ : స్రామాట్ అశోక్ ఈడిగా బాధ్యతలు చేపట్టారు.
సైబరాబాద్ జోన్: సంతోష్ నూతన ఈడిగా బాధ్యతలు స్వీకరించారు.



## తెలంగాణలో ఎఫ్‌పిఓలను బలోపేతం చేయాలి

రైతుకమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఇతర రాష్ట్రాల తరహాలో తెలంగాణలోను ఎఫ్‌పిఓలను బలోపేతం చేయాల్సిన అవసరముందని తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎ.కోదండరెడ్డి అన్నారు. బుధవారం సచివాలయంలోని సిఎంఓ కార్యదర్శి శేషాద్రి తో రైతు కమిషన్ చైర్మన్ సమావేశమయ్యారు. ఈ సందర్భగా రైతు కమిషన్ ఇప్పటి వరకు వివిధ రాష్ట్రాల్లో చేసిన పర్యటనలు, అక్కడ అమలవుతున్న వ్యవసాయ, మార్కెటింగ్ విధానాలపై కమిషన్ తయారు చేసిన నివేదికలను సిఎంఓ కార్యదర్శి శేషాద్రికి అందజేశారు. ఇతర రాష్ట్రాల్లో ఎఫ్‌పిఓలు చాల బలంగా పనిచేస్తున్నాయ, తెలంగాణ మాత్రం ఈ అంశంలో చాల వెనుకంజలో ఉందన్నారు. కేరళ, మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రైతులు ఆర్థికంగా బలోపేతం కావడంలో ఎఫ్‌పిఓలు కీలకంగా పనిచేస్తున్నాయని వివరించారు. రైతు కమిషన్ కేరళ, మహారాష్ట్రలోని నాసిక్‌లో పర్యటించిన సమయంలో ఎఫ్‌పిఓల ప్రభావం స్పష్టంగా కనిపించిందని తెలిపారు. కేంద్రం కూడా ఎఫ్‌పిఓలఏర్పాటుకు సానుకూలంగా వున్న విషయాన్ని కూడా సిఎంఓ సెక్రెటరీ శేషాద్రికి కోదండరెడ్డి గుర్తుచేశారు. నాసిక్‌లోని సహ్యాద్రి ఎఫ్‌పిఓ దేశంలోనే ఆదర్శంగా పనిచేస్తుందని వివరించారు. తెలంగాణలో కూడా ఎఫ్‌పిఓ ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ తీసుకుంటే బాగుంటాదన్నారు. అదేవిధంగా కేరళ రాష్ట్రంలో అమలవుతున్న మార్కెటింగ్ వ్యవస్థ, కౌలు రైతు విధానాలు పాలసీలపై కమిషన్ రూపొందించిన నివేదికలను కోదండరెడ్డి సిఎంఓ కార్యదర్శికి అందజేశారు.

## లోక్‌సభలో న్యాయం కోసం ప్రతిపక్షాల నినాదాలు, వాకౌట్

న్యూఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్షాల నిరసనల మధ్య బుధవారం ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని స్పీకర్ పి.సి.మోహన్ కొనసాగించారు. ఐతే ప్రభుత్వం–ప్రతిపక్షాలమధ్య బడ్జెట్ సమావేశాల ప్రారంభం నుండీ మొదలైన ప్రతిష్ఠంభనపై ప్రతిపక్ష ఎంపిలు ప్రభుత్వాన్ని నిలదీయడం ఆపలేదు. ప్రశ్నోత్తరాల సమయంలో ప్రతిపక్ష ఎంపీలు అడిగిన కొన్ని ప్రశ్నలను అనుమతించకపోవడంతో వివిధ సమస్యలను ప్రస్తావిస్తూ వాటికి సంబంధించిన నినాదాలు ఇస్తూ ఎంపిలు ఉదయం 11.30 గంటలకు సభ నుండి వాకౌట్ చేశారు. 'మాకు న్యాయం కావాలి' అంటూ ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు చేశారు. కానీ సభాపతిస్థానంలో ఉన్న మోహన్ సమాధానం చెప్పకుండా తిరస్కార వైఖరి అనుసరించారు. ప్రశ్నోత్తరాల సమయంలో దాదాపు 13 ప్రశ్నలు, అనుబంధ ప్రశ్నలను సభ చేపట్టింది. ప్రతిపక్ష ఎంపీలు కొన్ని ప్రశ్నలు అడిగారు. కానీ సభాపతి ఎంపీలను ప్రశ్నలు అడిగేందుకు అనుమతించలేదు. దీంతో వారు ఆగ్రహం చెందారు. కేంద్ర బడ్జెట్‌పై చర్చ మంగళవారం తిరిగి ప్రారంభమైంది. పునర్వినియోగ ఇంధనంపై అడిగిన ఒక అనుబంధ ప్రశ్నపై సంబంధిత మంత్రి ప్రహ్లాద్ జోషి స్పందిస్తూ, దేశం హరిత ఇంధనం దిశగా ముందుకు వెళుతోందన్నారు. రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్ కూడా టిఎంసి ఎంపి కీర్తీ అజాద్ అడిగిన ఒక అనుబంధ ప్రశ్నకు సమాధానం చెబుతూ బెంగాల్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. రైల్వే ప్రాజెక్టులను చేపట్టేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు భూ సేకరణ చేయడంలో వెనుకబడిందని నిలదీశారు. ఈనెల రెండో తేదీ నుండి లోక్‌సభలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకున్నాయి. సభాపతి ఏడుగురు కాంగ్రెస్ ఎంపీలను సస్పెండ్ చేశారు.

**ఇండస్ట్రియల్ కోడ్ సవరణ బిల్లు**

ఇండస్ట్రియల్ కోడ్ అమెండ్‌మెంట్ బిల్లును ప్రభుత్వం బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. 2020నాటి పారిశ్రామిక సంబంధాల స్మృతిలో కొన్ని చట్టాలను కొనసాగించే విషయంలో భవిష్యత్తులో ఎలాంటి అవాంఛనీయమైన ఉపద్రవాలు ఎదురైనాగానీ కొనసాగించేందుకు వీలుగా ఈ సవరణను కేంద్ర కార్మికశాఖామంత్రి మన్సుఖ్ మాండవీయ సభలో ప్రవేశపెట్టారు. ప్రశ్నోత్తరాల సమయం తర్వాత అనుబంధ ఎజెండా ద్వారా పారిశ్రామిక సంబంధాల స్మృతి సవరణ బిల్లు–2026ను ఆయన ప్రవేశపెట్టారు. 1926నాటి కార్మిక చట్టం, 1947 నాటి పారిశ్రామిక వివాదాల చట్టం, పారిశ్రామిక ఉపాధి, పారిశ్రామిక వివాదాల చట్టం స్థానంలో 2020లో చట్టం తెచ్చారు.

## హైడ్రా కూల్చివేత చట్ట ప్రకారం లేదు



ప్రజాపక్షం/హైదరాబాద్ : వివాదాస్పద స్థలానికి సంబంధించి మున్సిపల్ శాఖ అనుమతి లేకుండా కాంపౌండ్‌ను కూల్చివేయడం చట్ట వ్యతిరేకమని హైకోర్టు పేర్కొంది. ఆక్రమణలైనా తొలగించే ముందు నోటీసులు ఇవ్వాల్సిందేనని చెప్పింది. ప్రైవేటు వ్యక్తుల కాంపౌండ్‌ను కూల్చి వేసి ఏర్పాటు చేసిన కంచెను తమ ఉత్తర్వులు అందిన 48 గంటల్లో తొలగించాలని ఆదేశించింది. అయితే అక్కడ ఏర్పాటు చేసిన బోర్డును యథాతథంగా ఉంచవచ్చని తెలిపింది. కోర్టులో ఉన్న కేసుకు చెందిన స్థలం వద్ద కాంపౌండ్ వాల్ కూల్చడాన్ని తప్పుపట్టింది. రంగారెడ్డి జిల్లా నార్సింగ్ ప్రాంతంలో ఉన్న స్థలానికి సంబంధించి కూల్చివేతలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ ఎన్.వి. శ్రవణ్‌కుమార్ విచారణ చేపట్టారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు, హైడ్రా పురపాలక శాఖ మార్గదర్శకాలకు లోబడి పనిచేయాలన్నారు. విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది.

**మరో కేసులో..** జూబ్లీహిల్స్‌లోని రాక్ గార్డెన్‌ను ఎనిమిది వారాల్లో పునరుద్ధరించాలని హైకోర్టు హైడ్రాకు ఆదేశించింది. ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించి గార్డెన్‌ను రక్షించాల్సిన బాధ్యత హైడ్రాపై ఉందని పేర్కొంది. ఈ అంశంపై దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు విచారించి రాక్ గార్డెన్‌లో ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలంది. కోర్టు ఉత్తర్వుల అమలు నివేదికను మూడు నెలల్లో సమర్పించాలని ఆదేశించింది. దీనిపై దాఖలైన పిటిషన్‌పై విచారణను ముగించింది.

**మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్లపై పిటిషన్లు డిస్మిస్**

మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో వార్డుల రిజర్వేషన్‌ల కేటాయింపుపై జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో చివరి దశలో కోర్టును ఆశ్రయించడం సముచితం కాదని అభిప్రాయపడింది. వార్డు రిజర్వేషన్ల జీవోలు సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం, ప్రక్రియ మొదలైన తర్వాత ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోవడానికి వీల్లేదని చెప్పి పిటిషన్లను కొట్టేసింది.

**ఇంగ్లిషులోనే వాదించాలి**

ఖమ్మం జిల్లాకు సంబంధించిన పిల్‌లో తెలుగులో వాదనలు వినిపించడం సరికాదని హైకోర్టు పేర్కొంది. కోర్టు విచారణ ప్రక్రియ ఇంగ్లీషులో సాగాల్సి ఉంటుందని, అందుకు న్యాయవాదిని నియమించుకోవాలని పిటిషనర్‌కు సూచించింది. న్యాయవాదిని నియమించుకునేందుకు నాలుగు వారాల గడువు మంజూరు చేసింది. న్యాయవాదిని నియమించుకోలేనిపక్షంలో న్యాయసేవాధికార సంస్థ ద్వారా న్యాయవాదిని నియమించుకోవచ్చునని సూచన చేసింది. ఒక కాంట్రాక్టర్‌కు 22 పనుల కాంట్రాక్ట్ ఇవ్వడంపై దాఖలైన పిల్‌లో పిటిషనర్ తెలుగులో వాదించబోగా ఈ ఉత్తర్వులను జారీ చేసింది.

# అవిశ్వాస తీర్మానాన్ని తిరస్కరించే అవకాశం!

## మార్చి 9న అవిశ్వాసంపై చర్చ



**న్యూఢిల్లీ:** ప్రతిపక్ష నాయకుణ్ణి సభలో మాట్లాడనీయకుండా అడ్డుపడిన లోక్‌సభాపతిని తొలగించాలనూ ప్రతిపక్షాలు ముక్తకంఠంతో ఇచ్చిన లిఖిత పూర్వక నోటీసును తప్పుల తడకగా పేర్కొంటూ ఓంబిర్లా తిరస్కరించే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఐతే ప్రతిపక్షాలు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసులో తప్పులు ఉన్నందువల్ల వాటిలో దిద్దుబాట్లు చేసి వీలైనంత త్వరగా సభలో చర్చించేందుకు జాబితాల్లో చేర్చాలని అధికారులకు ఆయన సూచన చేశారట! పార్లమెంటరీ వర్గాలు బుధవారం ఈ విషయం వెల్లడించాయి. మార్చి తొమ్మిదో తేదీన అవిశ్వాస తీర్మానం నోటీసుపై చర్చ, తదుపరి ఓటింగ్ జరిగే అవకాశాలు ఉంటాయి. లోక్‌సభ నిబంధనావళిలో 94 సి అధికరణ ప్రకారం స్పీకర్ లేదా డిప్యూటీ స్పీకర్‌ను పదవి నుండి తొలగించాల్సి ఉంటుంది. ఐతే ఇదే నిబంధనావళిలోని 96వ అధికరణ ప్రకారం స్పీకర్ తనను తాను రక్షించుకుంటూ వాదనలు వినిపించేందుకు అవకాశం ఉంది. అవిశ్వాస తీర్మానం సమయంలో స్పీకర్‌కు ఓటు వేసే అధికారం ఉంటుంది. ఒకవేళ అధికార–ప్రతిపక్షాల మధ్య సమాన ఓట్లు గనుక వస్తే స్పీకర్‌కు ఓటు వేసే హక్కు ఉండదు. ప్రతిపక్షాలకు చెందిన దాదాపు 118 మంది ఎంపీలు అవిశ్వాస తీర్మానం నోటీసుపై సంతకాలు చేసి మంగళవారం మధ్యాహ్నం వారంతా లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్‌కు అందజేశారు. ఆ తర్వాత ప్రతిపక్షాలు ఆ నోటీసును ఉపసంహరించుకుని తేదీలను సరిదిద్ది మరో నోటీసును ఆయనకు అందజేశాయి. "ఈ నోటీసులులో 2025 ఫిబ్రవరిలో జరిగిన ఆనాటి అంశాలను కూడా నాలుగుసార్లు ఉటంకించినందువల్ల, ఆ ప్రాతిపదికపై నిబంధనలకు అనుగుణంగా ఈ నోటీసును లోక్‌సభ స్పీకర్ చర్చకు తీసుకోకుండా తిరస్కరించే అవకాశం ఉందని పార్లమెంటరీ వర్గాలు తెలియజేశాయి. ఆ నోటీసులో కొన్ని లోపాలు ఉన్నందువల్ల వాటిని సరిచేయాలని, ఆ తర్వాతే సభలో చర్చకు వీలుగా జాబితాలో చేర్చాలని స్పీకర్ సిబ్బందికి ఆదేశించారు. నిబంధనలకు అనుగుణంగా సకాలంలో చర్యలు తీసుకోవాలని ఓం బిర్లా చెప్పినట్లు కొందరు అధికారులు తెలియజేశారు. ప్రతిపక్షాలు రెండోసారి తేదీని సరిదిద్ది ఇచ్చిన నోటీసును సత్వరం పరిశీలిస్తున్నట్లు వర్గాలు చెప్పాయి. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను పదవి నుండి తొలగించాలని ప్రతిపక్షాలు మంగళవారం పట్టుపట్టాయి. ఆయన సభలో పక్షపాత ధోరణి పాటిస్తున్నారని, ప్రతిపక్షాలపట్ల తన చట్టబద్ధ విధులు నిర్వర్తించడంలేదని నోటీసు ఇచ్చిన ఎంపీలందరూ విమర్శించారు. దీంతో ఈ సమస్య పరిష్కారమయ్యేవరకూ ఓం బిర్లా సమావేశాలకు అధ్యక్షత వహించకుండా దూరంగా ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. లోక్‌సభలో కాంగ్రెస్‌పక్ష ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్, చీఫ్ విప్ కె.సురేశ్, విప్ మహ్మద్ జావెద్ లతోపాటు సమాజ్‌వాదీపార్టీ, డిఎంకె పార్టీల ఎంపీలు కూడా ఈ నోటీసు ఇచ్చారు. లోక్‌సభ నిబంధనావళిలోని 94 సి అధికరణకు అనుగుణంగా అవిశ్వాస తీర్మానం నోటీసును సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్‌కు వారంతా అందజేశారు. తనకు వ్యతిరేకంగా ప్రతిపాదించిన ఈ అవిశ్వాస తీర్మాన సమస్య పరిష్కారమయ్యే వరకూ సభా కార్యకలాపాలకు అధ్యక్షత వహించి నడిపించకూడదని నిర్ణయించుకుని అత్యున్నతమైన నైతిక ప్రమాణాలను ఓం బిర్లా పాటిస్తున్నారని లోక్‌సభ సచివాలయం అధికారులు తెలియజేశారు. బడ్జెట్‌కు సంబంధించి ఈ విడత సమావేశాలు ముగిసిన తర్వాత విరామం వస్తుంది. విరామం పూర్తయిన తర్వాత రెండో విడత సమావేశాల్లో ఈ నోటీసుపై చర్చ జరిగే అవకాశాలు ఉన్నాయి.

# పెంగ్విన్‌కు ఢిల్లీ పోలీసుల నోటీసులు




**న్యూఢిల్లీ:** భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ మనోజ్ ముకుంద్ నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం రాజకీయంగా తీవ్ర వివాదాస్పదం అవుతోంది. దీనికి సంబంధించి ప్రచురణ సంస్థ పెంగ్విన్ ర్యాండమ్ హౌజ్ ఇండియాకు ఢిల్లీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ప్రచురణ సంస్థ యాజమాన్యం విచారణలో భాగం కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఇంకా ప్రచురితం కాని ఆ పుస్తకానికి సంబంధించిన పలు ప్రశ్నలు సంధించారు. వాటికి వివరణ అడిగారు. కాగా... ప్రభుత్వ అనుమతి పొందక ముందే 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం బయటకు రావడం వివాదమవుతోంది. ఆ పుస్తకం ప్రచురితం కాలేదని, అది మార్కెట్‌లో అందుబాటులో లేదని పీఆర్‌హెచ్‌ఐ పేర్కొన్న సంగతి తెలిసిందే. అధికారికంగా విడుదల చేసి, రిటైల్ వేదికల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన పుస్తకాలనే ప్రచురితమైనవిగా పరిగణిస్తారని వెల్లడించింది. కానీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాత్రం ఆ బుక్‌ను మార్కెట్‌లో అమ్ముతున్నారని చెప్పారు. ఈ వ్యవహారంలో నేరపూరిత కుట్రకు సంబంధించిన సెక్షన్ల కింద పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

# చిక్కులున్నా లెక్కచేయకుండా గగనయాన్ ఉరవడి కొనసాగాలి: శుక్లా



**బెంగళూరు:** చిక్కులు, తెలియని సమస్యలు ఎదురైనాగానీ గగనయాన్ ప్రయోగానికి సంబంధించిన సన్నాహాలు, కార్యక్రమాల ఉరవడిని, ఇప్పుడున్న ఉత్సాహాన్ని అనివార్యంగా ముందుకు తీసుకువెళ్ళాలని భారత వ్యోమగామి శుభాంషు శుక్లా అన్నారు. ఇటీవల గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అశోక చక్ర పురస్కారాన్ని స్వీకరించిన గ్రూప్ కెప్టెన్ శుభాంషు శుక్లా బుధవారం బెంగళూరులో పాత్రికేయులతో మాట్లాడుతూ, గగనయాన్ విజయం ద్వారా భారతదేశం కూడా రోదసీ అన్వేషణలో విజయాలు సాధించిన అరుదైన జాబితాలో చేరుతుందని అన్నారు. ప్రపంచంలో ఇప్పటివరకూ మూడు దేశాలు మాత్రమే ఈ విధంగా మానవసహిత కార్యకలాపాలను సొంతంగా నిర్వహించగలిగాయన్నారు. భారతదేశం తలపెట్టిన మొట్టమొదటి మానవసహిత రోదసీ యాత్ర గగనయాన్ కావడంతో ఈ ప్రయోగంపై దేశ ప్రజల్లో భారీ అంచనాలు, ఆశలు ఉన్నాయి. 2027 నాటికి గగన్‌యాన్ ప్రయోగం చేయాలన్నది ఇస్రో సంకల్పం. దీనికి అనుగుణంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. 2040 నాటికి చంద్రుడి మీదకు యాత్రికులతో వెళ్ళి సురక్షితంగా తిరిగి భూమ్మీదకు రావడాన్ని ఇస్రో ప్రధాన లక్ష్యాలలో ఒకటిగా నిర్దేశించుకుంది. "గగనయాన్ చాలా సంక్లిష్టమైన సవాళ్ళతో కూడిన సాహసయాత్ర.ఎంత ఆలస్యమైనాగానీ లెక్కచేయకుండా మన ప్రయత్నం మనం చేయాలి, గగన్‌యాన్ దిశగా మన కృషి కొనసాగించాలి, ఇప్పుడున్న ఉత్సాహం తగ్గకుండా ముందుకు తీసుకువెళ్ళాలి, ఈ దిశగా నేను కృషి చేస్తాను, మొదటిరోజున నాకున్న ఉత్సాహాన్ని అదేస్థాయిలో ఇంకా ముందుకు కొనసాగిస్తాను, ఏదో ఒకరోజు మనుషులు రోదసీలోకి అడుగుపెట్టే మొదటిరోజు రావాలి, దానికి చివరిరోజు లేకుండా అలాగే కొనసాగాలి, ఈ యాత్రలో ఉన్న సంక్లిష్టతలను, చిక్కులను నేను అర్థం చేసుకున్నాను, ఈ విధమైన ఎంతో గొప్ప ఆశయ యాత్రలో ఎన్నో సవాళ్ళు కూడా ముడిపడి ఉంటాయి, ఔను, నిశ్చయంగా మనం రోదసీలో మనకు తెలియని ప్రదేశాలకు వెళ్ళాలి, దానిని పూర్తిచేయాలి" అన్నారు. భారత్–అమెరికా ఉమ్మడి కార్యక్రమం గురించి ప్రస్తావిస్తూ, యాగ్జియం మిషన్ అనేది అంతర్జాతీయ సహకారానికి ఒక పెద్ద ఉదాహరణ అన్నారు. గగనయాన్‌లో వ్యోమగామిగా ఎంపికైన గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ నాయర్ మాట్లాడుతూ ఓపికగా ఎదురుచూడాలని, ప్రతీదీ జరుగుతుందని, అన్ని లక్ష్యాలూ నెరవేరతాయని అన్నారు. భారతదేశం గగనయాన్‌లో విజయం సాధిస్తే ప్రపంచంలో ఈ యాత్రలు చేసిన నాలుగోదేశంగా జాబితాలో చేరుతుందని అన్నారు.

# ముంబయి మేయర్‌గా రితూ తావ్డే

## డిప్యూటీ మేయర్‌గా సంజయ్ ఘాడీ ఎన్నిక



**న్యూఢిల్లీ :** ముంబయి మేయర్ పీఠం విషయంలో కొనసాగిన సస్పెన్స్‌కు తెరపడింది. నగర (బృహన్ ముంబయి కార్పొరేషన్) మేయర్‌గా బిజెపికి చెందిన రితూ తావ్డే, డిప్యూటీ మేయర్‌గా శివసేన (షిండే) వర్గానికి చెందిన సంజయ్ ఘాడీ ఎన్నికయ్యారు. బుధవారం ఎన్నిక జరగాల్సి ఉంది. అయితే, ఏకగ్రీవంగా ఇద్దరినీ ఎన్నుకున్నారు. దీంతో 25 ఏళ్లపాటు థాక్రే ఆధ్వర్యంలోని శివసేన చేతిలో ఉన్న ముంబయి మేయర్ పదవి ఇప్పుడు బిజెపి పరమైంది. రితూ తావ్డే మూడుసార్లు కార్పొరేటర్‌గా గెలిచారు. ఆమె ఘట్‌కోపర్ (132వ వార్డు) స్థానం నుంచి ఇటీవల గెలిచారు. గతంలో బిఎంసికి చెందిన ఎడ్యుకేషన్ కమిటీ చైర్‌పర్సన్‌గా పని చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉండేవారు. తర్వాత 2012లో బిజెపిలో చేరారు. బిఎంసిలో జరిగిన మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికకు మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్, డిప్యూటీ సిఎం ఏక్‌నాథ్ షిండే హాజరయ్యారు. రితూ, సంజయ్ ఎన్నికపై వారు హర్షం వ్యక్తం చేశారు. వారి నాయకత్వంలో ముంబయి అభివృద్ధి చెందుతుందని, ప్రతి ముంబైకర్ ఆశల్ని నిజం చేస్తారని ఫడ్నవీస్ అన్నారు. రితూ తావ్డే బిజెపి తరఫున ముంబయికి ఎన్నికైన రెండో మేయర్. చివరగా 1982–83 కాలంలో ప్రభాకర్ పాయ్ మేయర్‌గా పని చేశారు. డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన సంజయ్ ఘాడీ 15 నెలలు మాత్రమే ఈ పదవిలో కొనసాగుతారు. ఆ తర్వాత శివసేన (షిండే)కు చెందిన ఇతరులకు అవకాశం ఇవ్వాలని పార్టీ నిర్ణయించినట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. సంజయ్ ఘాడీ ఐదో వార్డు అయిన మగథానే నుంచి శివసేన తరఫున 15,000 ఓట్ల మెజారిటీతో గెలిచారు. అంతకుముందు ఆయన థాక్రే వర్గంలో ఉండేవారు. ఎన్నికలకు ముందు షిండే వర్గంలో చేరి, గెలిచారు.

# ఆరోగ్య కారణాల వల్ల... 'వాంగ్‌చుక్ విడుదల' సాధ్యం కాదు

## 'సుప్రీంకోర్టు'కు కేంద్రం స్పష్టీకరణ



**న్యూఢిల్లీ :** వాతావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను నిర్బంధించినప్పటి నుంచి ఇప్పటివరకు 24సార్లు వైద్యపరీక్షలు నిర్వహించామని , ఆయన 'ఫిట్', 'హెల్దీ', 'హార్టీ' గా ఉన్నారని, ఇందులో ఆందోళన కలిగించేది ఏదీ లేదని కేంద్రం బుధవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. న్యాయమూర్తులు జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ పి.బి.వరాలే ద్విసభ్య ధర్మాసనానికి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ విషయాన్ని వెల్లడించారు. వాగ్‌చుక్ నిర్బంధ ఉత్తర్వులు జారీచేయబడిన కారణాలు కొనసాగుతున్నాయని, వాంగ్‌చుక్ ఆరోగ్య కారణాల వల్ల ఆయనను విడుదల చేయడం సాధ్యం కాదని సొలిసిటర్ జనరల్ స్పష్టంచేశారు. వాంగ్‌చుక్ విషయంలో మేం ఎలాంటి మినహాయింపులు ఇవ్వలేమని ఆయన బెంచ్‌కు తెలియజేశారు. విచారణ సందర్భంగా అదనపు సొలిసిటర్ జనరల్ కె.ఎం.నటరాజన్ తన సమర్పణలో హింసాత్మక నిరసనలలో వాంగ్‌చుక్ రెచ్చగొట్టే వ్యక్తి అని, నేపాల్, అరబ్ వసంతాన్ని ఉదాహరణలుగా చూపిస్తూ యువతను రెచ్చగొడుతుండే వాడని ధర్మాసనానికి వివరించారు. వాంగ్‌చుక్ నేపాల్ హింసాత్మక ఆందోళనను ప్రస్తావించారని, భారతదేశంలో కూడా అదే జరగవచ్చని నటరజాన్ అన్నారు.'అతను ఎక్కడ అలా అన్నాడు?. యువకులు దానిని తీసుకున్నారని అతను చెబుతున్నాడు. ఆయన స్వయంగా ఆశ్చర్యపోయాడు'. 'ఆ ప్రకటనను ఊహించాల్సి ఉంది'అని అదనపు సొలిసిటర్ జనరల్ నటరాజన్ సమాధానమిచ్చారు. 'దయచేసి తదుపరి విషయానికి రండి. లద్దాఖ్‌లో సాయుధ దళాల మోహరింపు దురదృష్టకరమని ఆయన అంటున్నారు. శాంతియుత పద్ధతులు ప్రభావవంతంగా లేవని యువత అంటున్నారు' అని నటరాజన్ చెప్పారు. 'యువత అంటే అదే అని ఆయన చెబుతున్నారు. పూర్తి వాక్యాన్ని చదవండి. హింసాత్మక పద్ధతి సరైన మార్గం కాదని ఎవరైనా వ్యక్తపరిస్తే అది సరైనది కాదని ఆయన చెబుతున్నారు. అది ఎక్కువగా చదివినట్లు అవుతుంది.' ధర్మాసనం గమనించింది. జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ) 1980 కింద వాంగ్‌చుక్‌ను నిర్బంధించడం చట్టవిరుద్ధమని ప్రకటించాలని కోరుతూ వాంగ్‌చుక్ సతీమణి గీతాంజలి అంగ్మో దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. గత ఏడాది సెప్టెంబరు 24న లేహ్‌లో జరిగిన దురదృష్టకర హింసాత్మక సంఘటనలను వాంగ్‌చుక్ చర్యలు లేదా ప్రకటనలకు ఏవిధంగానూ ఆపాదించలేమని అంగ్మో అన్నారు. తన సామాజిక మీడియా హ్యాండిల్స్ ద్వారా హింసను వాంగ్‌చుక్ స్వయంగా ఖండించారని, లద్దాఖ్ 'తపస్య', 5 సంవత్సరాల శాంతియుత ప్రయత్నం వైఫల్యానికి దారితీస్తుందని స్పష్టంగా చెప్పారని వెల్లడించారు. అంగ్మో మాట్లాడుతూ ఇది తన జీవితంలో అత్యంత విచారకరమైన రోజు అని అన్నారు.

# డిఎంకె, కాంగ్రెస్ మధ్య పొత్తు చెక్కుచెదరలేదు

## రెండు పార్టీల మధ్య చీలికలను ఖండించిన సిఎం స్టాలిన్



**చెన్నై :** డిఎంకె, కాంగ్రెస్ మధ్య పొత్తు చెక్కుచెదరకుండా ఉందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ స్పష్టం చేశారు. రెండు పార్టీల మధ్య చీలికలు ఉన్నాయనే వార్తలను ఆయన తోసిపుచ్చారు. తమిళనాడులో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడే అవకాశాన్ని కూడా ఆయన తిరస్కరించారు. కాంగ్రెస్ పార్టీకి తలుపులు మూసేశారని, ఆ పార్టీ సీనియర్ నాయకులు పేర్కొంటుండగా, స్టాలిన్ దానిపై స్పష్టత ఇచ్చారు. ఎటువంటి గందరగోళం లేదని డిఎంకె చీఫ్ అన్నారు. ప్రభుత్వంలో అధికారాన్ని పంచుకోవడం తమిళనాడుకు షూట్ కాదని, ఆ విషయం కాంగ్రెస్‌కు కూడా బాగా తెలుసు అని అన్నారు. కొంతమంది కూటమిలో చీలిక తీసుకురావడానికే అధికారాన్ని పంచుకునే అంశాన్ని రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. ఆ వ్యూహం పనిచేయదని బుధవారం చెన్నైలో జరిగిన ఇండియా టుడే రౌండ్ టేబుల్ సమావేశంలో పేర్కొన్నారు. 'కూటమిలో గందరగోళం ఉందనే పుకార్లు ఉద్దేశపూర్వకంగా వ్యాప్తి చెందుతున్నాయి. రాజకీయాలకు అతీతంగా, నేను (కాంగ్రెస్ నాయకుడు) రాహుల్ గాంధీని సోదరుడిగా చూస్తాను. ఆయన నన్ను కూడా అలాగే చూస్తాడు' అని స్టాలిన్ అన్నారు. డిఎంకె–కాంగ్రెస్ కూటమి సామరస్యంగా ఉందని, ఇతరులు ఆశించేది (విభజన) జరగదు అని ఆయన అన్నారు. సీట్ల పంపకాల చర్చలపై కాంగ్రెస్ పార్టీ ఆలస్యం వ్యక్తం చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి వ్యాఖ్య ప్రాముఖ్యతను సంతరించుకుంది. మంగళవారం, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలకు ఎఐసిసి ఇన్‌చార్జ్ గిరీష్ చోడంకర్ సీట్ల పంపకాల కమిటీని ఏర్పాటు చేయడంలో డిఎంకె జాప్యం చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 22 నుండి చర్చలు ప్రారంభించడానికి ఒక ప్యానెల్ ఏర్పాటు చేయనున్నట్లు డిఎంకె ప్రకటించింది. అధికార పంపకాలపై కాంగ్రెస్ ఎంపిలు మాణికం ఠాగూర్, జోతిమణి, మధురై డిఎంకె నాయకుడు జి. దళపతి మధ్య మాటల యుద్ధం తర్వాత డిఎంకె – కాంగ్రెస్ కూటమిపై విస్తృతమైన ఊహాగానాలు చెలరేగాయి. ఈనెల 10న, డిఎంకె మంత్రి ఆర్ఎస్ రాజకన్నప్పన్ మాట్లాడుతూ 'కాంగ్రెస్‌లో ఒకరు లేదా ఇద్దరు వ్యక్తులు ఇబ్బంది పెడతారు. మనం ఇలా చెబితే, వారు కోపంగా ఉంటారు. వారు కూటమిలో భాగం. వారు కొనసాగాలనుకుంటే, వారు కొనసాగనివ్వండి. వారు కూటమిలో ఉన్నారా లేదా అనేది తలైవర్ (స్టాలిన్) ఇష్టం. ద్రావిడ ఉద్యమాన్ని ఓడించడానికి, ఒకరు ఇంకా పుట్టాలి' అని ఆయన అన్నారు. 'కలైంజర్ (డిఎంకె జాతిపిత ఎం కరుణానిధి) 100–111 సీట్లు గెలిచినప్పుడు కూడా ఆయన ప్రభుత్వంలో వాటా ఇచ్చారా' అని ఆయన అడిగారు.డిఎంకె 150 సీట్లు గెలుచుకునే అవకాశం ఉన్నప్పుడు, (ఒక వాటా) ఎలా ఇవ్వగలమని, వ్యక్తిగత సామర్థ్యంలో దళపతి (ఎం కె స్టాలిన్) మాత్రమే ప్రభుత్వాన్ని నడిపిస్తారన్నారు. ఇదిలా ఉండగా, ఈ ఇంటరాక్టివ్ సెషన్‌లో, తమిళనాడులో రాబోయే ఎన్నికలు డిఎంకె విజయం సాధించడానికి 2021 అసెంబ్లీ ఎన్నికల కంటే కష్టం కాదని స్టాలిన్ అన్నారు. కేంద్రంపై విమర్శలు గుప్పిస్తూ, తమిళనాడులో బిజెపి ఫాసిజం ఎప్పటికీ గెలవదని అన్నారు. ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తమిళనాడుకు ఇచ్చింది సున్నా' అని అన్నారు. ఈ ఎన్నికల్లో బిజెపికి వచ్చేది కూడా సున్నా (తమిళనాడు ఎన్నికల్లో సీట్లు) అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని పథకాలను కేంద్రం అనుసరిస్తోందని స్టాలిన్ అన్నారు. 'తోజి' హాస్టళ్ల పథకాన్ని ఎత్తి చూపారు.

# ఒప్పందం కాదు.... అమెరికా దోపిడీ

## భారత్-యూఎస్ ట్రేడ్ డీల్‌పై కాంగ్రెస్ విమర్శలు




**న్యూఢిల్లీ :** భారత్ – అమెరికా మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. ఈ ఒప్పందం డీల్ కాదు, దోపిడీ అని పేర్కొంటూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై పదునైన విమర్శలు గుప్పించింది. ఈ ఒప్పందం అమెరికాకు లాభదాయకంగా, భారత్‌కు నష్టం కలిగించేలా ఉందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. ఇది మన రాజకీయ గౌరవం, ఆర్థిక దౌత్యం వైఫల్యాన్ని ప్రతిబింబిస్తుందని ఆరోపించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ప్రధాని మోదీని వ్యతిరేకించని స్వతంత్ర విశ్లేషకులు కూడా ఈ ఒప్పందాన్ని లొంగుబాటు, అసమాన ఒప్పందం, అమ్ముడుపోవడం, అవమానకరమైన వెనకడుగు అని విమర్శించారు. ప్రధాని మోదీ, ఆయన అబద్దాల బృందం ఎంత గొప్పగా చెప్పినా, వాస్తవం మాత్రం ఒక్కటే. అది భారత్ నుంచి అమెరికా ఎక్కువ తీసుకుంటుంది. తక్కువ ఇస్తుంది. 2019 సెప్టెంబర్‌లో ట్రంప్ తరఫున ప్రచారం చేయడం సహా, మోదీ ఆయనను తీవ్రంగా మెప్పించే ప్రయత్నం చేశారు. అయినా ఫలితం రాలేదు. 2025 ఫిబ్రవరిలో తిరిగి ఎన్నికైన వెంటనే ట్రంప్‌ను మొదట అభినందించిన నాయకుల్లో మోదీ ఒకరు' అని జైరాం రమేశ్ అన్నారు.

### వ్యక్తిగత స్నేహం భారత్‌కు ఉపయోగపడలేదు

అధ్యక్షుడు ట్రంప్‌తో ప్రధాని మోదీ తన వ్యక్తిగత స్నేహాన్ని బహిరంగంగా ప్రదర్శించినప్పటికీ భారత్‌కు ఎలాంటి ప్రయోజనం దక్కలేదని జైరాం రమేశ్ అన్నారు. 'ట్రంప్ కూడా మోదీ తనకు మంచి స్నేహితుడు అని చెబుతూనే వచ్చారు. కానీ అదే సమయంలో భారత్‌కు పెద్ద దెబ్బలు వేశారు. ఇది మన రాజకీయ, ఆర్థిక దౌత్యానికి ఘోర వైఫల్యం. ఈ ఒప్పందం నిజానికి డీల్ కాదు, దోపిడీ. మోదీకి వాషింగ్టన్‌లో ఉన్న మంచి స్నేహితుడు భారత్‌ను దోచుకున్నారు. ఆయనే 2025 మే 10న ఆపరేషన్ సిందూర్‌ను ఆపేశానని వందసార్లు పేర్కొన్నారు' అని జైరాం రమేశ్ వ్యాఖ్యలు చేశారు.

## సిఆర్‌పిఎఫ్ క్యాంప్‌పై ఉగ్రదాడి కేసు

# యుపి పిటిషన్ విచారణకు 'సుప్రీం' ఓకే



**న్యూఢిల్లీ :** 2007 రాంపూర్ కేంద్ర రిజర్వ్ పోలీసు బలగాల (సిఆర్‌పిఎఫ్) శిబిరంపై జరిగిన ఉగ్రవాద దాడి కేసులో నలుగురు నిందితులకు మరణశిక్ష, మరొకరికి జీవిత ఖైదు విధించడాన్ని కొట్టివేస్తూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించడానికి సుప్రీంకోర్టు బుధవారం అంగీకరించింది. 2007 డిసెంబర్ 31 రాత్రి రాంపూర్‌లోని శిబిరం వద్ద జరిగిన దాడిలో 8 మంది సిఆర్‌పిఎఫ్ సిబ్బంది మరణించగా ఐదుగురు గాయపడ్డారు. న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై నిందితులకు నోటీస్ జారీచేసి, 4 వారాల తర్వాత తకు విచారణను వాయిదా వేసింది. ఈ ఐదుగురు నిందితుల తరఫున న్యాయవాది ఎం.ఎస్. ఖాన్ హాజరయ్యారు. అక్టోబరు 29న హైకోర్టు ఇచ్చిన తీర్పును ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సవాల్ చేసింది. ఈ కేసులో నలుగురికి మరణశిక్ష, ఐదుగురికి మరొకరికి జీవిత ఖైదు విధిస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది. హత్య, ఇతర తీవ్రమైన అభియోగాలపై మొహమ్మద్ షరీఫ్, సబావుద్దీన్, ఇమ్రాన్ షాజాద్, మొహ్మద్ ఫరూఖ్, జంగ్ బహదూర్ ఖాన్‌లను నిర్దోషులుగా ప్రకటించింది. ప్రధాన నేరానికి నిందితులపై సహేతకమైన సందేహానికి మించి కేసును నిరూపించడంలో ప్రాసిక్యూషన్ ఘోరంగా విఫలం అయింది అని ధర్మాసనం పేర్కొంది. అయితే ట్రయల్ కోర్టు జీవితఖైదు విధించిన జంగ్ బహదూర్‌ఖాన్ సహా ఐదుగురిని హైకోర్టు దోషులుగా విధించింది. ఆయుధాల చట్టం సెక్షన్ 25 (1ఎ) కింద నేరానికి పాల్పడినందుకు వారిని దోషులుగా తేలిన హైకోర్టు వారికి 10 సంవత్సరాల కఠిన కారాగారశిక్ష విధించింది. మరింత శిక్షణ పొందిన పోలీసులతో దర్యాప్తు, ప్రాసిక్యూషన్ నిర్వహించబడి ఉంటే ఈ కేసు వేరే ఫలితాన్ని పొంది ఉండేదని భావిస్తున్నామని కేసు ముగించేటప్పుడు హైకోర్టు పేర్కొంది. దర్యాప్తులో లోపం కేసు మూలాల్లోకి వెళ్లి చివరికి నిందితులను నిర్దోషులుగా విడుదల చేయడంలో ముగిసిందని అసంతృప్తిని వ్యక్తంచేసింది.

# విషం కలిపిన లడ్డూలిచ్చి ముగ్గురి హత్య

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో విషం కలిపిన లడ్డూలు ఇచ్చి ముగ్గురిని హత్య చేసిన బాబాను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈ నెల ఎనిమిదో తేదీన పీరాగఢి ఫ్లైఓవర్‌పై పార్క్ చేసిన కారులో ముగ్గురు వ్యక్తులు మరణించినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు అక్కడకు చేరుకుని పరిశీలించారు. తొలుత ఆత్మహత్యగా అనుమానించారు. కాగా, మతులను ఢిల్లీలోని నంగ్లీ డెయిరీ ప్రాంతానికి చెందిన్ల రణధీర్ (76), బాప్రోలా ప్రాంతానికి చెందిన శివ నరేష్ (42), జహంగీర్‌పురికి చెందిన లక్ష్మీ (40)గా గుర్తించారు. ఆత్మహత్య చేసుకునే అవకాశాన్ని ముగ్గురి కుటుంబాలు తోసిపుచ్చాయి. దీంతో ఈ కేసుపై దర్యాప్తు చేయగా అసలు విషయం బయటపడింది. ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌కు చెందిన బాబా కమ్రుద్దీన్... ఘజియాబాద్ సమీపంలోని లోని ప్రాంతంలో తాంత్రిక కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. 'ధన్‌వర్ష్' పూజల ద్వారా రెండు, మూడు రెట్ల డబ్బు లభిస్తుందని నమ్మిస్తూ కొందరు వ్యక్తులను ఆకట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో రెండు నెలల కిందట బాబా కమ్రుద్దీన్‌ను లక్ష్మీ కలిసింది. ఆ తర్వాత శివ నరేష్, రణధీర్‌ను బాబాకు ఆమె పరిచయం చేసింది. ఈ నెల ఏడో తేదీన ఆ ముగ్గురూ లోని ప్రాంతానికి వెళ్లి బాబా కమ్రుద్దీన్‌ను కలిశారు. 'ధన్‌వర్ష్' పూజతో డబ్బును రెండుమూడింతలు చేస్తానని అతడు నమ్మించాడు. రూ.రెండు లక్షల నగదు, మద్యం, కూల్ డ్రింక్ తీసుకురావాలని చెప్పాడు. దీంతో ఎనిమిదో తేదీన ఆ ముగ్గురు మరోసారి కారులో బాబా వద్దకు వెళ్లారు. అయితే 'ధన్‌వర్ష్' పూజ తర్వాత వారితో కలిసి కారులో బాబా కమ్రుద్దీన్ ప్రయాణించాడు. విషం కలిపిన లడ్డూలు, మూడు మద్యం బాటిల్స్, కూల్ డ్రింక్స్ బాటిల్స్ వారికి ఇచ్చాడు. ఆ లడ్డూలు తిని, డ్రింక్ తాగిన తర్వాత ఆ ముగ్గురు స్పృహ కోల్పోయారు. కమ్రుద్దీన్ వారి వద్ద ఉన్న రూ.రెండు లక్షలు తీసుకుని కారు దిగి పారిపోయాడు. మతుల కుటుంబాల సమాచారం, సాంకేతిక ఆధారాలతో బాబాను నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు.

# చండీగఢ్ స్కూళ్లకు బాంబు బెదిరింపులు




**చండీగఢ్:** బాంబు బెదిరింపు కాల్స్ బాగా పెరిగాయి. చండీగఢ్‌లోని పలు పాఠశాలలలో బాంబులు పెట్టామంటూ బుధవారం ఉదయం బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. దీంతో వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని విద్యార్థులను ఖాళీ చేయించారు. చండీగఢ్‌తో పాటు పక్కనే ఉన్న మొహాలీ ప్రాంతంలో పాఠశాలలో బాంబులు పెట్టామని బెదిరింపులు రావడంతో పాఠశాల సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఆ సమాచారాన్ని పోలీసులకు అందించారు. కొన్ని పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి పాఠశాలలకు సెలవు ప్రకటించారు. దీంతో పోలీసులు పాఠశాలలకు చేరుకున్నారు. డాగ్‌స్క్వాడ్ బందాలతో పాటు జాగిలాలతో గాలింపు చేపట్టారు. ఇటీవల పాఠశాలలకు బాంబు బెదిరింపులు తరచుగా మారాయి. ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో బాంబు బెదిరింపుల కలకలం రేగింది. రాజధాని పరిసర ప్రాంతాల్లోని తొమ్మిది స్కూళ్లలో బాంబులు పెట్టామంటూ అఫ్జల్ గురు జ్ఞాపకార్థం ఢిల్లీని ఖలిస్థాన్‌గా మార్చబోతున్నామంటూ అందులో ఉంది. దీంతో అప్రమత్తమైన అధికారులు ఆ స్కూళ్లను ఖాళీ చేయించారు. జనవరి 29న రాజధానిలో ఐదు విద్యాలయాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. అధికారులు తనిఖీ చేయగా అది బెదిరింపు మెయిల్ అని తేలింది. జనవరి 28న ద్వారకా కోర్టు కాంప్లెక్స్‌లోనూ పేలుడు పదార్థాలు పెట్టామంటూ మెయిల్ రాగా పోలీసులు తనిఖీలు చేపట్టగా... అది అబద్ధమని తేలింది. బెదిరింపు కాల్స్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో ఆరుగురి దుర్మరణం

**జైపూర్ :** రాజస్థాన్‌లోని దౌసా జిల్లాలో మంగళవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం చెందారు. కల్ఫో గ్రామానికి చెందిన ఆరుగురు స్నేహితులు అభనేరి గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరై కారులో తిరిగి వస్తుండగా... డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో కారు అదుపుతప్పి డివైడర్‌పై నుంచి ఎగిరిపడి అటుగా వస్తున్న ట్రక్కును ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతులను అంకిత్, సమరు, లోకేష్, నవీన్, దిల్‌ఖుష్, మనీష్‌లుగా గుర్తించారు.

# నూతన అధికారుల బాధ్యతల స్వీకరణ

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** నూతనంగా నియమితులైన అధికారులు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. కోర్ అర్బన్ రీజియన్ వరకు జలమండలి పునర్వ్యవస్థీకరణ చేసిన నేపథ్యంలో కొత్త జాయింట్ ఎండీ, ముగ్గురు అధికారులను ఈడీలుగా ప్రభుత్వం నియమించింది. జీహెచ్ఎంసీ తరహాలోనే జలమండలి కొత్త రూపు సంతరించుకుంది. జలమండలిని కొత్తగా హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరిలుగా మూడు జోన్లు ఏర్పాటు చేశారు. ఓఆర్ఆర్ వరకు వేగంగా విస్తరిస్తున్న తరుణంలో ఈ ప్రాంతంలో పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడం, పౌర సేవలను మెరుగుపరచడం లక్ష్యంగా నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం జలమండలి ఈడీగా పని చేస్తున్న మయాంక్ మిట్టల్‌ను జాయింట్ ఎండీగా నియమించిన ప్రభుత్వం.. కొత్త విభజన ప్రకారం మల్కాజిగిరి జోన్‌కి పంకజ, హైదరాబాద్ జోన్‌కి సామ్రాట్ అశోక్, సైబరాబాద్ జోన్‌కి సంతోష్‌లను నియమిస్తున్నట్లు గురువారం ఉత్వర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జలమండలిలో జాయింట్ ఎండీగా పదోన్నతి పొందిన మయాంక్ మిట్టల్ గురువారం ఖైరతాబాద్లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. వీరితో పాటు ప్రభుత్వం ముగ్గురు ఈడీలు పంకజ, సామ్రాట్ అశోక్, సంతోష్ సైతం ఆయా జోన్లలో బాధ్యతలు స్వీకరించారు.ఇదిలాఉండగా నూతన బాధ్యతలు చేపట్టిన అధికారులు జలమండలి ఎండీ అశోక్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎండీ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా 'సెయింట్ ఫ్రాన్సిస్'లో మీడియాస్పియర్

**ప్రజాపక్షం/సోమాజిగూడ:** హైదరాబాద్ బేగంపేట్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజీ ఫర్ ఉమెన్ మాస్ కమ్యూనికేషన్, జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో "మీడియాస్ఫియర్ –2026' అంతర్ కళాశాల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సారి "భారత భాషలు"అనే థీమ్‌తో ఉత్సవం జరిగింది. ఈ ఉత్సవ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా సినీనటుడు, రచయిత, దర్శకుడు రాహుల్ రవీంద్రన్ హాజరై, మాట్లాడారు. రానున్న కాలంలో మీడియా నిపుణులుగా విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కళా, సినీకృతులను అనేక భాషల్లో చూడాలని, తమ దృష్టిని విస్తరించుకోవాలని సూచించారు.నాలుగో స్థంభం సభ్యులుగా బాధ్యాతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో, భావన్స్, సెయింట్ జోసెఫ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
గురువారం
12-02-2026
www.prajapaksham.in
ఎడిట్
PEOPLE'S VIEWS

# బంగ్లాదేశ్‌కు పరీక్షా సమయం

స్వతంత్ర బంగ్లాదేశ్ అనూహ్యమైన పరిణామాల మధ్య తన భవిష్యత్తును పునర్నిర్వచించుకోవలసిన స్థితిలో చౌరస్తాలో నిలబడి ఉంది. చరిత్ర నిర్మాతలు ప్రజలే కాబట్టి ఏది సరైన మార్గమో ఎంచుకోవలసిన బాధ్యత, భారం వారిపైనే ఉంది. ఈ రోజు(గురువారం) జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో మెజారిటీ ప్రజలు ఇచ్చే తీర్పు తమ దేశ భవిష్యత్ గమనాన్ని నిర్దేశిస్తుంది. ఈ బెంగాలీ ముస్లిం దేశం ఉదారవాద లౌకిక రాజ్యంగా కొనసాగుతుందా? ఇస్లామిక్ చాందసవాదం వైపు మొగ్గుతుందా? లేక మధ్యేమార్గం అనుసరిస్తుందా? పొరుగుదేశమైన భారత్‌తో శాంతి–స్నేహ–సహకార సంబంధాల కొనసాగింపును ఎంచుకుంటుందా? లేక ఐదు దశాబ్దాల క్రితం తమ భాష, సంస్కృతుల అణచివేతకు వ్యతిరేకంగా పాకిస్తాన్‌పై తిరుగుబాటుచేసి భారతదేశ సహాయ సహకారాలతో స్వేచ్ఛ, స్వాతంత్ర్యం పొందిందో, ఆ మత ఛాందస, సైనిక నిరంకుశ పాలకులవైపు మొగ్గుతుందా?

ఆనాటి తూర్పు పాకిస్తాన్ బంగ్లాదేశ్‌గా అవతరించిన నాటినుంచి ప్రజాస్వామ్యం, సైనిక నియంతృత్వం మధ్య, మతతత్వవాదం–లౌకికవాదం మధ్య సంఘర్షణ జరుగుతూనే వస్తున్నది. అవామీలీగ్ నాయకురాలు హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా 2024 ఆగస్టులో జన్–జడ్ పేరుతో విద్యార్థులు, యువకులు తిరుగుబాటు చేసి హింసాత్మకృత్యాలకు పాల్పడటంతో, ప్రధాని హసీనా సైనికాధికారుల సలహాపై రాజీనామా చేసి భారత్‌లో తలదాచుకున్నారు. తర్వాత మహమ్మద్ యూనస్ ముఖ్య సలహాదారుగా ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం ఎట్టకేలకు సార్వత్రిక ఎన్నికలకు ఉత్తర్వు చేసింది. అయితే ఆనాటి అల్లర్లలో పలువురు మృతిచెందిన పోలీసు కాల్పులకు హసీనాను బాధ్యురాలిని చేసి కేసులు మోపి ఆమె పరోక్షంలో ప్రత్యేక కోర్టుల్లో విచారణ జరిపి మరణశిక్ష సహా పలు శిక్షలు విధించారు. అంతేకాదు, ప్రజాస్వామ్య పునరుద్ధరణ పేరుతో ఎన్నికలు జరుపుతూ ఆమె పార్టీ అవామీలీగ్‌ను పాల్గొనే అవకాశం నిరాకరించారు. ఆమె పరిపాలనాకాలంలో మంచిచెడులపై తీర్పు చెప్పే అవకాశం ప్రజలకు ఇవ్వకుండా పాలక ముఠాయే అవామీలీగ్‌ను నిషేధించింది. 25–30శాతం ఓటర్ల మద్దతున్నట్లు భావించబడుతున్న ఆ జాతీయోద్యమ పార్టీని నిషేధించి నిర్వహించే ఎన్నికలు నిజమైన ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబిస్తాయా? అంతేగాక జులై చార్టర్‌పై రెఫరెండం అంటూ దానిని ప్రజల ఓటుకు పెట్టారు. కొన్ని రాజ్యాంగ సవరణలు ఆదేశిస్తున్న ఆ చార్టర్‌పై జనాదేశంలేని పాలక ముఠా రెఫరెండం నిర్వహించింది, రానున్న ప్రభుత్వం కాళ్లకు ముందే బంధనాలు వేస్తున్నది.

అదలావుంచితే, జన్–జడ్ వీధిపోరాటాలు అరాచక కృత్యాలుగా రుజువయ్యాయి. సోషల్ మీడియా ద్వారా పాలుపొంగులా ఉబికిన ఉద్యమకారులు చుక్కాని లేని నావ అయినారు. వారు ఎన్‌సిపి పేరుతో ఒక రాజకీయ పార్టీగా ఏర్పడినప్పటికీ ఆదరణ కరవైంది. మతఛాందస జమాత్ ఇస్లామీపై యూనస్ ప్రభుత్వం నిషేధం ఎత్తివేయటంతో తొండముదిరి ఊసరవెల్లి అయినట్లు అది ప్రభావవంతంగా ఎదిగింది. అన్ని యూనివర్శిటీ ఎన్నికల్లో దాని అభ్యర్థులు ఎన్‌సిపిని ఓడించారు. ఎన్‌సిపి నాయకులు విధిలేని పరిస్థితుల్లో సార్వత్రిక ఎన్నికలకు జమాత్‌తో అలయెన్స్ పెట్టుకున్నారు. జమాత్ 228 సీట్లకు పోటీచేస్తూ ఎన్‌సిపికి 30 సీట్లు కేటాయించింది. నిబద్ధతగల నాయకత్వం, సిద్ధాంతం, నిర్మాణంలేని గాలివాటు ఆందోళనకారులు ఎక్కడైనా అభివృద్ధి నిరోధకులకు సహాయకారి అవుతారు.

అవామీలీగ్‌తో పోటాపోటీగా ఉండే బిఎన్‌పి నాయకురాలు బేగం ఖలీదా జియా మరణంతో ఆమె కుమారుడు తారిఖ్ రెహ్మాన్ లండన్‌లో ప్రవాస జీవితం నుంచి తిరిగి వచ్చి పార్టీ పగ్గాలు చేబట్టారు. మొత్తం 300 సీట్లలో ఆ పార్టీ 272 పోటీచేస్తూ, 28 సీట్లు కూటమి భాగస్వాములకు ఇచ్చింది. ఎన్నికల క్షేత్రం బిఎన్‌పి–జమాత్ మధ్య దాదాపు ముఖాముఖీ పోటీగా తయారైంది. ఇప్పుడు అవామీ ఓటర్లు ఏమి చేయాలి? అవామీలీగ్–బిఎన్‌పి ప్రధాన రాజకీయ ప్రత్యర్థులు. అయితే అవామీ స్థానిక నాయకులు ముఖ్యంగా మూడు జిల్లాల్లో బిఎన్‌పి అభ్యర్థులకు ఓటు వేయాలని నిర్ణయించారు. ఇది బిఎన్‌పికి అనుకూలమైన మలుపు తెస్తుందని భావించబడుతున్నది. ప్రస్తుతం 60 నియోజకవర్గాలకు పరిమితమైన అవామీ తోడ్పాటు మిగతా జిల్లాలకు విస్తరించేప్రయత్నం జరుగుతున్నట్లు భావించవచ్చు.

మన ప్రభుత్వానిది గడసాము. నోరుతెరిచి ఎవరినీ బలపరచలేని స్థితి. ఒక్క బిఎన్‌పి మాత్రమే — పోటీలో ఉన్న పార్టీల్లో మన దేశంపట్ల కొంత సానుకూలత ఉన్న పార్టీ. బంగ్లాదేశ్‌లో మైనారిటీలుగా ఉన్న హిందువుల భద్రత పట్ల ఆందోళనతోనే సంబంధాలు చక్కబడవు. అదొక ప్రధాన కర్తవ్యమే. కాని ఇరు దేశాల సంబంధాల్లో ఉన్న చిక్కులన్నిటినీ చాకచక్యంతో పరిష్కరించుకుంటూ ముందుకు సాగాలి. అందువల్ల ఎన్నికల ఫలితాల కోసం, ఆతృత, ఆసక్తితో ఎదురుచూదాం!



## నన్ను మళ్లీ ఇలా అడగకండి

ముఖ్యమంత్రి పదవి కోసం నాకు, డిప్యూటీ సీఎం శివకుమార్‌కు మధ్య పోరు నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విదేశీ పర్యటనలకు ప్లాన్ చేసుకుంటున్నారన్న విషయం నాకు తెలియదు. బహుశా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వారి సొంత డబ్బు వెచ్చించి వ్యక్తిగతంగా విదేశాలకు వెళుతుండొచ్చు. నాయకత్వం అంశంపై నేను, శివకుమార్ ఇద్దరం కూడా కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ నిర్ణయానికి కట్టుబడి ఉండాల్సిందే. మీరు (మీడియా) నాయకత్వ మార్పు అంశం తప్ప నన్ను వేరే ఏమీ అడగలేరా? దయచేసి నన్ను మళ్లీ ఇలా అడగకండి.

- కర్ణాటక సిఎం సిద్ధరామయ్య



# స్వయం కృషిని నమ్మిన బహుముఖ ప్రజ్ఞాశాలి అబ్రహం లింకన్

12 ఫిబ్రవరి 1809 రోజు కెంటకీ ప్రాంతంలో థామస్ లింకన్ నాన్సీ దంపతులకు పేద కుటుంబంలో జన్మించిన అబ్రహం లింకన్ తన చిన్నతనంలోనే తల్లిని కోల్పోయారు. సవతి తల్లి ప్రేరణతో పుస్తకాలు చదవడం అలవాటు చేసుకున్నారు. పాఠశాల విద్య కన్న స్వంతంగా చదువుకొని విజ్ఞానాన్ని సమపార్జించారు. తండ్రి వ్యవసాయ పనుల్లో నిమగ్నం కాగా లింకన్ మాత్రం పుస్తకాలు చదవడం మాత్రమే ఇష్ట పడ్డారు. న్యాయవాది, పరిపాలనాదక్షత కలిగిన మహా నాయకుడు, మేధావి, అద్భుత వక్త, సాధారణ జీవన విధానం గడిపిన వీరుడు లాంటి విలక్షణ లక్షణాలు కలిగి ప్రపంచ చరిత్రలో చెరగని ముద్రను వేయగలిగారు. ఇల్లినాయిస్ రాష్ట్ర శాసనసభసభ్యుడిగా, అమెరికా ప్రతినిధుల సభ సభ్యుడిగా సేవలు అందించి1860లో అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికైనారు. 1861–1865 మధ్య అమెరికా 16వ అధ్యక్షుడిగా దేశ సమైక్యతను కాపాడటంలో కృతకృత్యులు అయ్యారు. 1863లో బానిసత్వాన్ని రద్దుచేసి చరిత్రలో నిలిచి పోయారు. 1863లో ఎమాన్సిపేషన్ ప్రోక్లమేషన్ ద్వారా బాలికలకు స్వేచ్ఛను ప్రసాదించారు. గెట్టిస్ బర్గ్ ప్రసంగం, తన కుమారుడి ఉపాధ్యాయుడికి లేఖ ద్వారా అత్యంత ప్రసిద్ధి పొందారు. తను చూపిన నిజాయితీ కారణంగా ఆయన హానెస్ట్ ఏబ్‌గా కీర్తించబడ్డారు.

**తన కుమారుడి ఉపాధ్యాయుడికి అబ్రహం లింకన్ రాసిన లేఖ:**

అబ్రహం లింకన్ అనగానే అతను తన కుమారుడి ఉపాధ్యాయుడికి రాసిన ప్రఖ్యాత లేఖ గుర్తుకు వస్తుంది. ఈ లేఖ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులు, పౌర సమాజం నేర్చుకోవలసిన అవసరం ఎంతో ఉన్నది. నైతిక విలువలు, నిజాయితీ, సామాజిక స్పృహ లాంటి గుణాల ప్రాధాన్యాన్ని ప్రస్తుతించారు. లేఖ సారాంశాల్లో కొన్ని ముఖ్య వాక్యాలు మనకు నిత్య ప్రేరణగా నిలుస్తున్నాయి. ప్రతి శత్రువుకు ఒక మిత్రుడు ఉంటాడు. ప్రతి స్వార్థ రాజకీయ నాయకుడికి ఎదురుగా అంకితభావం కలిగిన మహోన్నత నాయకుడు కూడా ఉంటాడని పేర్కొన్నారు. ప్రపంచంలో అందరూ న్యాయవంతులు, నిజాయితీ పరులు కాదని పేర్కొన్నారు. ప్రతి ద్రోహి అంతానికి ఒక వీరుడు ఉద్యమిస్తాడని పేర్కొన్నారు. పుస్తకాల విజ్ఞానంతో పాటు ప్రకృతి, పక్షులు, జీవుల గురించి నేర్పాలని సూచించారు. స్వంత ఆలోచనలు నమ్మమని నేర్పాలి. మోసం చేయడం కన్న ఓడిపోవడం మిన్న అని నేర్పమని కోరారు. కష్టాల్లో నవ్వడం, తప్పులను ఎదిరించడం, పుస్తక జ్ఞానంతో పాటు లోక జ్ఞానం నేర్పాలని ఒక తండ్రిగా కోరారు. సున్నితంగా ఉండే వారితో కఠినమైన వారిలో కఠినంగా ఉండడం నేర్పాలని తెలిపారు. అక్రమంగా సంపాదించిన వందల డాలర్ల కన్న న్యాయంగా సంపాదించిన ఒక్క డాలర్ మిన్న అని విద్యార్థులకు నేర్పమని ఉపాధ్యాయులను కోరారు. నాటి అమెరికా అంతర్యుద్ధ సమయంలో అత్యంత కార్యదక్షత ప్రదర్శించిన అబ్రహం లింకన్ దురదృష్టవశాత్తు అదే సమయంలో 15 ఏప్రిల్ 1865 రోజున తన 56వ ఏట దారుణ హత్యకు గురి అయ్యారు. అమెరికాలో పౌర సమాజ ఐక్యతను సాధించి, బానిసత్వాన్ని రద్దు చేసి, సమానత్వం కోసం ఆరాటపడి, వర్ణ వివక్షను వ్యతిరేకించిన న్యాయవాది అబ్రహం లింకన్ జీవితం నేటి పౌర సమాజానికి దారి దీపంగా నిలుస్తున్నది.

*(12 ఫిబ్రవరి అబ్రహం లింకన్ జన్మ దినోత్సవం సందర్భంగా)*

# ధాన్యం పంటకు బోనస్... ఖజానాకు భారమట!

ధాన్య ఉత్పత్తి పెరిగితే దేశానికి భారంగా మారుతుందా? నేరుగా రైతులకే ఎగుమతి అవకాశాలు కల్పిస్తామంటూ కబుర్లు చెప్పిన నరేంద్రమోదీ సర్కార్ అదే చెబుతోంది, రాష్ట్రాలకు లేఖలు రాస్తోంది. అవర్ వరల్డ్ డాటా ప్రకారం మన పక్కనే ఉన్న చైనాలో 2022లో రోజుకు ప్రతి వ్యక్తికి సగటున 3,454 కాలరీల శక్తి నిచ్చే ఆహారాన్ని అందిస్తుండగా నెలకు ఐదు కిలోల ఆహార ధాన్యాలను ఉచితంగా అందిస్తున్న నరేంద్రమోదీ ఏలుబడిలో 2,574 కాలరీలు ఉంది. అయినప్పటికీ ధాన్యం పండించే రైతులకు బోనస్ ఇస్తే ఉత్పత్తి పెరుగుతుందని, అది దేశానికి భారంగా మారుతుందని కేంద్ర ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కేంద్ర వైఖరిని ఆదివారం నాడు ఒక ప్రకటనలో విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వరి మద్దతు ధరకంటే అదనంగా క్వింటాలుకు కేరళ ప్రభుత్వం రు.631 అందిస్తున్నది. కేంద్రం ప్రకటించిన మద్దతు ధరల కంటే ఎక్కువగా ఇవ్వటాన్ని నిలిపివేయాలని కేంద్ర ఆర్థికశాఖలో ఖర్చుల విభాగ కార్యదర్శి కేరళ ప్రభుత్వానికి లేఖ రాశారు. ఇలా ఇస్తున్న కారణంగా ధాన్య సేకరణ ఖర్చు పెరిగి ప్రభుత్వ ఖజానా మీద వత్తిడిని పెంచుతున్నదని కేరళ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాసిన అధికారిక లేఖలో పేర్కొన్నారు. తెలంగాణాలో సన్న రకాలు పండించే వారికి బోనస్ ఇస్తున్న సంగతి తెలిసిందే. కేంద్ర లేఖ ఒక్క కేరళకేనా, అన్ని రాష్ట్రాలకు పంపిందా అన్నది తెలియదు. ఎలాంటి శషభిషలు లేకుండా కార్పొరేట్ కంపెనీలకు వేలాది కోట్ల రూపాయల రుణాలను రద్దు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం రైతుల పట్ల ఇలా ఎందుకు వ్యవహరిస్తున్నదని, రైతులకు ఇచ్చే బోనస్‌ను ప్రధాన ఆర్థిక భారంగా ఎందుకు భావిస్తున్నదని పినరయి విజయన్ ప్రశ్నించారు. ఈ లేఖలో వెల్లడించిన అభిప్రాయం వెనుక మనదేశ మార్కెట్‌ను అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు తెరవాలన్న ఆలోచన ఉందా అని కూడా ప్రశ్నించారు. వరి రైతులకు చెల్లించాల్సిన సాయాన్ని సకాలంలో విడుదల చేయటంలో కేంద్రం విఫలమైందని విమర్శించారు.

కేంద్ర ప్రభుత్వం ఈ లేఖను వెంటనే వెనక్కు తీసుకోవాలని ఎల్‌డిఎఫ్ రాష్ట్ర కన్వీనర్ టిపి రామకృష్ణన్ డిమాండ్ చేశారు. కేంద్ర వైఖరి ఆహార భద్రత, స్వయం సమృద్ధిని దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. జనవరి తొమ్మిదవ తేదీన కేంద్ర ప్రభుత్వం రాసిన ఈ లేఖలో గోధుమ, వరి పంటలకు అదనపు ప్రోత్సాహాన్ని నిలిపివేయాలని, కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పప్పు ధాన్యాలు, చమురు గింజలు, చిరుధాన్యాలకు ప్రోత్సాహకాలను అందించాలని పేర్కొన్నారు. కేంద్ర సూచనను తిరస్కరిస్తున్నామని, వరి సాగు విషయంలో రాజీపడేది లేదని వ్యవసాయ శాఖ మంత్రి పి. ప్రసాద్ కేంద్రానికి లేఖ రాశారు. చిరుధాన్యాలు, పప్పుధాన్యాల సాగు ప్రోత్సాహకాలను తాము వ్యతిరేకించటం లేదని, వరిని ఫణంగా పెట్టి ఆ పని చేయలేమని, వాటి ఉత్పత్తికి కూడా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి పేర్కొన్నారు. కేరళ అవసరాలలో కేవలం 21 శాతం మాత్రమే స్థానికంగా బియ్యం ఉత్పత్తి ఉంది, దాన్ని 30శాతానికి పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు ప్రోత్సాహం అందిస్తున్నది.

కొసమెరుపు ఏమంటే కేంద్రం చర్యతో రైతాంగంలో వ్యక్తమైన వ్యతిరేకతతో రాష్ట్ర బిజెపి బెంబేలెత్తింది. వెంటనే ఆ లేఖను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాసినట్లు సోమవారం నాడు వార్త వచ్చింది. అంతవరకైతే అదో దారి, రాష్ట్ర ప్రభుత్వం ధాన్య రైతాంగాన్ని పట్టించుకోవటం లేదని, ముఖ్యంగా ఉత్పాదక ఖర్చు, సేకరణ యంత్రాంగం, మార్కెటింగ్ మద్దతు ఇవ్వటం లేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం అదనంగా బోనస్ ప్రకటించలేదని కూడా చెప్పారు. కేంద్రం పంపిన లేఖలో పేర్కొన్నట్లు కేరళలో అదనపు ఉత్పత్తిలేదని, కేంద్ర నిల్వలు కూడా అదనంగా లేవని, భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని చెప్పిన అంశాలు కేరళకు వర్తించవని బిజెపి నేత వాపోయారు. ధాన్యం సాగు విస్తీర్ణం తగ్గుతున్నదని, ఇక్కడ ఉన్న ప్రత్యేకతలు, ఆహార భద్రతను పరిగణనలోకి తీసుకోవాలని కూడా పేర్కొన్నారు. ఈ కారణంగానే కేంద్రం ఆర్థికంగా కేరళను ఎన్ని ఇబ్బందులు పెడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం వరి సాగును పెంచేందుకు అదనంగా బోనస్ ఇస్తున్నది. దీన్ని సాకుగా చూపి మరిన్ని ఇబ్బందులు పెట్టేందుకే ఆర్థిక శాఖ రాసిన లేఖ అన్నది స్పష్టం. త్వరలో ఎన్నికలు జరగనుండగా ఇలాంటి పనులు చేస్తే వచ్చే ఇబ్బందులను ఊహించి బిజెపి నేత నిర్మలా సీతారామన్‌కు మొరపెట్టుకున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం, బిజెపి కూడా ఇరుకునపడింది. ఇప్పుడు లేఖను వెనక్కు తీసుకున్నా, లేకున్నా బిజెపికే నష్టం.అదొక అసెంబ్లీ ఎన్నికల ప్రచార అస్త్రంగా మారుతుంది.

ప్రకటిస్తున్న కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించటం గురించి పరిశీలనకు కేంద్ర ప్రభుత్వం 2022జూలైలో వేసిన కమిటీ ఇంతవరకు ఎలాంటి నివేదిక సమర్పించలేదు, ఏం చేస్తున్నారని కేంద్రం అడగనూ లేదు. రైతుల పట్ల మోదీ ప్రభుత్వ శ్రద్ధకు ఇది చక్కటి తార్కాణం.అమెరికా ఉత్పత్తులకు ఒక్కసారే పూర్తి స్థాయిలో మార్కెట్‌ను తెరిస్తే రైతాంగం నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందన్న భయంతో దశలవారీ చర్యలకు పూనుకున్నట్లు కనిపిస్తోంది.



ఎవరినైనా హత్య చేయదలచుకుంటే మెల్లగా పని చేసే విషం ఇవ్వటం తెలిసిందే. అలా ఒక్కొక్కటిగా వెల్లడిస్తే ఈలోగా జనం అలవాటు పడిపోతారన్నది భావన కావచ్చు. మంత్రి పియూష్ గోయల్ స్వయంగా చెప్పినట్లు ఇప్పుడు కుదిరింది ఒక స్వరూప అవగాహన మాత్రమే. ఉదాహరణకు ఇల్లు కట్టేటపుడు ఒక ప్లాన్ గీస్తారు. తరువాత పిల్లర్లు, గోడలు, స్లాబ్ వేస్తారు. ఇంట్లో ఏమేమి ఉండేది తరువాత మాత్రమే బయటివారికి తెలుస్తుంది. అలాంటిదే అమెరికాతో కుదిరిన అవగాహన. తాత్కాలిక ఒప్పందం పేరుతో పశుదాణా అవసరాలకు ఎర్ర జొన్నలు, పలురకాల ధాన్యాలతో చేస్తున్న ఇథనాల్ తయారీలో ఉప ఉత్పత్తిగా తయారయ్యే చెక్కను కూడా కూడా దిగుమతి చేసుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి దిగుమతి పన్నులేకుండా అనుమతించింది. ఇప్పటికే పత్తి దిగుమతి పన్ను తగ్గింపుతో క్వింటాలకు వెయ్యి నుంచి రెండువేల వరకు రైతాంగం నష్టపోయింది.ఈ పశుదాణా పేరుతో దిగుమతులు, అందుకోసం మనదేశంలో సాగు చేస్తున్న మొక్కజొన్న, జొన్న, ఇతర పంటల ధరల పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. సోయా ఆయిల్ దిగుమతి ఆ పంట పండించే రైతాంగంతో పాటు పామాయిల్, నూనె గింజల సాగుమీద ఎలాంటి ప్రతికూల ప్రభావం పడనుందో అధ్యయనం చేయాల్సి ఉంది. యాపిల్ పండ్ల దిగుమతులు కాశ్మీర్, హిమచల్ ప్రదేశ్ ఇతర ప్రాంతాల్లోని రైతాంగానికి గొడ్డలి పెట్టని యాపిల్ సాగుదార్ల అఖిల భారత సంఘ అధ్యక్షుడు, సిపిఐ(ఎం) నేత మహమ్మద్ యూసుఫ్ తారిగామి పేర్కొన్నారు.

అమెరికాతో ఒప్పందం రైతాంగానికి నష్టం గనుక ఆందోళన చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా, దాన్నుంచి విడిపోయిన వారితో సహా అనేక రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. దేశ వ్యవసాయ రంగాన్ని అమెరికన్ కార్పొరేట్లకు పూర్తిగా అప్పగించేశారని పేర్కొన్నాయి. వాణిజ్యశాఖ మంత్రి పియూష్ గోయల్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. అమెరికా నుంచి దిగుమతి చేసుకొనే వస్తువులపై ఎలాంటి పన్నులు ఉండవని, మనం ఎగుమతి చేసే వాటిపై 18శాతం పన్ను విధిస్తామని ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అమెరికా, ఐరోపా యూనియన్ దేశాల ఆర్థిక వ్యవస్థలు గిడసబారిన స్థితిలో ఉన్నందున చేసుకొనే ఒప్పందాలు వాటికి ఉపయోగం తప్ప భారత్‌కు మేలు చేయవని అనేకమంది చేస్తున్న ఆందోళనను కేంద్రం పట్టించుకోవటం లేదు. ఈనెల పన్నెండున లేబర్ కోడ్‌లు, ఇతర కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాపిత సమ్మెకు కార్మిక సంఘాలు పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే, వారికి మద్దతుగా, రైతు వ్యతిరేక చర్యలకు నిరసనగా ఆ రోజున రైతాంగం కూడా పాల్గొనాలని రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. ఆ రోజున ట్రంప్, మోదీ దిష్టి బొమ్మలను దగ్ధం చేయాలని కోరాయి. సంయుక్త కిసాన్ మోర్చా(రాజకీయేతర) ఒక ప్రకటన చేస్తూ త్వరలో సమావేశం జరిపి, అమెరికాతో ఒప్పందానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలకు పిలుపునిస్తామని పేర్కొన్నది. ప్రతిపక్షాలు, రైతు సంఘాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, వ్యవసాయానికి ఎలాంటి ముప్పు ఉండదని పియూష్ గోయల్ చెప్పుకున్నారు. వాణిజ్య ఒప్పందం గురించి 2025 ఫిబ్రవరి 13న డోనాల్డ్ ట్రంప్ నరేంద్రమోదీ చర్చలకు శ్రీకారం చుట్టారు.

రెండు దేశాల మధ్య కుదిరిన తాత్కాలిక ఒప్పందంలోని అంశాలు ఇలా ఉన్నాయి. అమెరికా పారిశ్రామిక వస్తువులు, పలు ఆహార, వ్యవసాయ ఉత్పత్తులపై పన్నులను భారత్ పూర్తిగా ఎత్తివేయటం లేదా తగ్గించటం చేస్తుం ది. వాటిలో పశుదాణా అవసరాల కోసం డ్రైడ్ డిస్టిల్లర్స్ గ్రెయిన్స్(పైన చెప్పుకున్న ఇథనాల్ ఉప ఉత్పత్తులు), ఎర్ర జొన్నలు, ట్రీ నట్స్, తాజా మరియు ప్రోసెస్ చేసిన పండ్లు, సోయాబీన్ నూనె, వైన్, ఆల్కహాల్ మరియు అదనపు ఉత్పత్తులు. దీనికి ప్రతిగా ఏప్రిల్ రెండవ తేదీన జారీ చేసిన ఆదేశాల ప్రకారం భారత ఉత్పత్తులపై 18శాతం పన్నులు విధిస్తారు. వాటిలో వస్త్రాలు, దుస్తులు, తోలు వస్తువులు, చెప్పులు, ప్లాస్టిక్ మరియు రబ్బరు, ఆర్గానిక్ రసాయనాలు, గృహ అలంకరణ వస్తువులు, కళా ఉత్పత్తులు, కొన్ని యంత్రాలు ఉన్నా యి. జనరిక్ ఔషధాలు, వజ్ర వైఢూర్యాలు, విమానాల విడిభాగాల మీద పన్నులను రద్దుచేస్తారు. అమెరికా జాతీయ భద్రతకు ముప్పుగా భావించి గతంలో పన్నులు విధించిన భారత విమానాల విడిభాగాలు, అల్యూమినియం, ఉక్కు, రాగి, వాహన ఉత్పత్తులపై రాయితీలు, కోటాలను అమలు చేస్తారు.

రానున్న ఐదు సంవత్సరాల్లో అమెరికా నుంచి ఇంధన ఉత్పత్తులు, విమానాలు, విమాన విడి భాగాలు, వంట బొగ్గు, విలువైన లోహాలు, సాంకేతిక ఉత్పతులను 500 బిలియన్ డాలర్ల మేర కొనుగోలు చేయాలసుందని భారత్ చెప్పింది. ఈ ఒప్పందంలో భారత్ నుంచి అమెరికా ఏ వస్తువులను, ఎంత మొత్తంలో కొనుగోలు చేసేందు కు అంగీకరించిందీ లేదా వాంఛిస్తున్నదీ వివరాలు లేవు. ఈ కారణంగానే దీన్ని ఖరారుచేసే నాటికి వాటిలో ఎన్ని చేరుస్తారో ఏమిటో జనాల కు అంతుబట్టటం లేదు గనుకనే అనేక అనుమానాలు తలెత్తాయి. ఇది అమెరికాకు అనుకూలంగా ఉందనే అభిప్రాయం రావటానికి అనేక అంశాలు దోహదం చేస్తున్నాయి. మరిన్ని వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది, ఒప్పందంపై సంతకాల తరువాత అవి వెల్లడౌతాయి!

ఎంకెఆర్

# భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం : సార్వభౌమత్వ నిర్ణయాలపై నీలినీడలు



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
98493284967

భారత ప్రధాని నరేంద్ర మోడీ,అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మధ్య ఇటీవల కుదిరిన వాణిజ్య ఒప్పందం దేశంలో ఆర్థిక, రాజకీయ, విదేశాంగ విధానాల సార్వభౌమత్వం గురించిన తీవ్ర చర్చలను రేకెత్తిస్తోంది. ఈ ఒప్పందం కేవలం వర్తక, వాణిజ్య, టారిఫ్ శాతాల మాట కాకుండా, భారతదేశం ఎలాంటి షరతులపై ఇతర దేశాలతో చర్చలను నిర్వహిస్తుంది? మన దేశ దీర్ఘకాలిక సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక జాతీయ ప్రయోజనాలను ఎలా నిర్వచిస్తుంది? అనే ప్రాథమిక ప్రశ్నలను ఎత్తిపట్టింది. ప్రధానంగా రెండు వైపులా ప్రతిపక్షాలు, విశ్లేషకులు వ్యక్తం చేస్తున్న ఆందోళనలో ప్రధాన అంశం... ఈ ఒప్పందంలో స్పష్టమైన పారదర్శకత లేకపోవడం, ఈ విషయాన్ని మరింత సంక్లిష్టతరం చేస్తున్నాయి.

ఒప్పందం యొక్క అంతర్లీన వివరాలు ఇంకా పూర్తిగా బహిర్గతం కాలేదు. అయినప్పటికీ, ఇప్పటికే బహిర్గతమైన సమాచారం ప్రకారం రెండు నాయకుల వ్యాఖ్యల ఆధారంగా, ఇది ఒక సంప్రదాయ వాణిజ్య ఒప్పందం కంటే ఒక ప్రకటన లేదా 'అవగాహనా పత్రం' లాగా కనిపిస్తుంది. ప్రధాన ఆందోళనలలో ఒకటి, భారత ఉత్పత్తులపై (ముఖ్యంగా స్టీల్, అల్యూమినియంపై) అమెరికా విధించిన 18 శాతం టారిఫ్‌ను తొలగించడానికి బదులుగా, దానిని మాత్రమే సవరించడం జరిగిందనే విషయం. మోడీ ప్రభుత్వం వచ్చేసరికి ఈ టారిఫ్ కేవలం 2.93 శాతం మాత్రమే ఉండేది. దీనర్థం, కొత్త ఒప్పందం భారతదేశం ఇప్పటికే ఎదుర్కొంటున్న అన్ని టారిఫ్ అడ్డంకులను తొలగించలేదు. అయితే ఆ వ్యాపార సంబంధాలను ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉంది.

ఈ సందర్భంలో, బీజేపీ నేతలు ముఖ్యంగా వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ఇతర దేశాలతో పోలిస్తే భారతదేశంపై టారిఫ్ తక్కువగా ఉందని వాదించడం విడ్డూరంగా ఉంది. విమర్శకుల ప్రకారం, అసంపూర్తిగా ఉంది. ఉదాహరణకు, బంగ్లాదేశ్, పాకిస్తాన్ వంటి దేశాలు అమెరికా నుండి ప్రత్యేక రాయితీలు (జీ.ఎస్.పీ) పొందుతున్నాయి, ఇది భారతదేశం కోల్పోయింది. అదనంగా, ఈ దేశాలు తమ ఉత్పత్తులపై టారిఫ్‌ను భరించగలిగినంత మేరకు వాటి సరఫరా శృంఖలాలు అలాగే తయారీ సామర్థ్యాలు బలంగా ఉన్నాయి. ఈ వాదన మన తయారీ మరియు ఎగుమతి సామర్థ్యం యొక్క అంతర్లీన బలహీనతలను అలాగే పోటీని పరిగణనలోకి తీసుకోవడంలో విఫలమవుతుంది.

ఈ ఒప్పందంతో పాటు వచ్చిన అత్యంత తీవ్రమైన ఆరోపణ సార్వభౌమ నిర్ణయం తీసుకునే సామర్థ్యంపై ప్రభావం చూపుతుంది. మన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ,లేదా వాణిజ్య శాఖా మంత్రి పీయూష్ గోయల్ ప్రకటన లేదా సంయుక్త ప్రకటనకు బదులు నేరుగా భారత వర్తక, వాణిజ్య, రక్షణ విదేశాంగ విషయంలో జోక్యం చేసుకుని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనలు వెలువడుతున్నాయి. భారత ట్రేడ్ పాలసీలో నిర్ణయం తీసుకోవలసింది ఎవరు? ట్రంప్ ఏకపక్షంగా మన దేశ దీర్ఘకాలిక ప్రయోజనాలకు నష్టం జరిగే ప్రకటనలు ఎందుకు చేస్తున్నారు? దానికి మన ప్రధాన మంత్రి ఎందుకు ధీటుగా సమాధానం ఇవ్వలేకపోతున్నారు?

భారత ప్రధానమంత్రి మోదీకి బదులు 'భారత్ రష్యా నుండి చమురు దిగుమతులు చేసుకోకుండా నిర్ణయించుకుంది' అని సూటిగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏలా బహిరంగ ప్రకటన చేస్తారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ విషయంలో భారత్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు 'మాకు ఎలాంటి సమాచారం లేదు' అని ప్రకటించారు. ఈ విషయంలో స్పష్టత ఇవ్వాల్సిన మన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మౌనం వహిస్తున్నారు. దీనిని మనం భారత ప్రజలు ఏలా అర్థం చేసుకోవాలి? ఇక మన కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు మోదీ ఈ ఒప్పందం ద్వారా ఘనకార్యం చేసినట్లు సన్మానం చేశారు. అసలు ఇంత వరకు పూర్తి వాణిజ్య ఒప్పందం కుదరలేదు,చర్చలు జరుగుతున్నాయి అని పీయూష్ గోయల్ ప్రకటన చేస్తారు. అంతా గందరగోళంగా ఉంది. గతంలో యుపిఎ హయాంలో 2.93 శాతం ఉన్న టారిఫ్ ఇప్పుడు 18 శాతానికి ఒప్పుకుంటే...ఇది మన భారత ప్రధానమంత్రి సాధించిన ఘన విజయమా!? దీనికి మోదీని సన్మానించటమా?

ఇది ఒక విదేశీ శక్తి (అమెరికా) మన దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన భద్రతా విధానాన్ని నేరుగా ప్రభావితం చేస్తుందని సూచిస్తుంటం లేదా? దీనికి మన గోదీ మీడియా మోదీ ఘనకార్యం చేశారని చంకలు గుద్దు కోవటం ఏంటి? తమ మీడియా ఛానళ్ళలో తప్పుడు కథనాలు వండి వార్చటం ఏంటి?

ఇరాన్, వెనిజులాతో ఇదే విధమైన ఒత్తిళ్లు గతంలో జరిగాయనే విషయం ఇందుకు పునాది. మన పాలకులు ఇరాన్‌పై అమెరికా పునఃప్రతిబంధకాలను 'అన్యాయం', 'ఏకపక్షం' అని గట్టిగా విమర్శించారు. కానీ ఇప్పుడు, అదే తరహా ఒత్తిళ్లకు లొంగడం, విదేశాంగ విధాన సార్వభౌమత్వానికి చేసిన మోసం అని ఈ 'బీజేపీ దేశ భక్తులు', 'గోదీ మీడియా' గుర్తించటం లేదా అని సందేహాలు కలుగుతున్నాయి.

అంతర్జాతీయ మాధ్యమాలు అలాగే విశ్లేషకులు కూడా ఈ అంశంపై తీవ్ర ప్రశ్నలు వేస్తున్నారు. 'ది ఎకనామిస్ట్' మరియు 'ఫైనాన్షియల్ టైమ్స్' వంటి ప్రముఖ పత్రికలు ఈ ఒప్పందం భారతదేశం యొక్క 'రాజకీయ స్వయంప్రతిపత్తి'కి ధిక్కారంగా ఉండవచ్చని వ్యాఖ్యానించాయి. ఇంటర్నల్ మరియు ఎక్స్‌టర్నల్ రెండు రకాల విమర్శలు ఉన్నాయి. భారతదేశంలోని ఆర్థిక నిపుణులు, సమృద్ధ భారత్ ఫౌండేషన్ డైరెక్టర్ పుష్పరాజ్ దేశ్‌పాండే వంటి వారు, ఈ ఒప్పందం భారత ఆర్థిక, భౌగోళిక రాజకీయ విధానాలపై అమెరికా జోక్యం ప్రకటనలను ఏలా అనుసరించడం? అని ప్రశ్నలతో హెచ్చరించారు.

**పార్లమెంటరీ ప్రక్రియకు ధిక్కారం:**

మరొక వివాదాస్పద అంశం ఈ ఒప్పందం చేసుకునే విధానం. పార్లమెంట్ సెషన్ జరుగుతున్న సమయంలోనే సోషల్ మీడియా ద్వారా ఈ ప్రధాన నిర్ణయం ప్రకటించబడింది. ఇది పార్లమెంటరీ ప్రాతినిధ్యం మరియు పారదర్శకత యొక్క సూత్రాలకు విరుద్ధంగా ఉంది. ప్రధాని మోడీ తాము పార్లమెంట్‌ను 'అత్యున్నత దేవాలయం'గా పిలుస్తారు.

కానీ ఈ సందర్భంలో ఆ సంస్థను విస్మరించడం, ప్రజాస్వామ్య ప్రక్రియలపై తీవ్ర అప్రమత్తత రావాల్సిన అవసరాన్ని సూచిస్తుంది.

దీర్ఘకాలిక ఆర్థిక ప్రభావాలు: వాణిజ్య లోటు మరియు 'మేక్ ఇన్ ఇండియా' : ఒప్పందం ప్రకారం, భారత్ ఐదేళ్లలో $500 బిలియన్ల విలువైన అమెరికన్ వస్తువులు మరియు ఇంధన ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటుంది. ఇది భారత వార్షిక వాణిజ్య లోటును ప్రస్తుత $20 బిలియన్ల నుండి $36 40 బిలియన్లకు పెంచుతుందని అంచనా. అంటే, మన డాలర్ నిల్వలపై ఒత్తిడి పెరుగుతుంది. అలాగే మన రూపాయి విలువ మరింత దెబ్బతినే అవకాశం ఉంది.

ఇంకా మరో గంభీరమైన ఆందోళన ఏమిటంటే, ఇది 'మేక్ ఇన్ ఇండియా' పథకం యొక్క ఆశయాలకు,లక్ష్యాలకు పూర్తి విరుద్ధంగా ఉంది. భారత దేశం తన దేశీయ తయారీ ఉత్పత్తులకు ఎగుమతులను ప్రోత్సహించాలనే లక్ష్యానికి బదులుగా, ఈ ఒప్పందం విదేశీ ఉత్పత్తులపై మన దేశం పూర్తిగా ఆధారపడే టట్లు చేస్తుంది. మన దేశ ఎగుమతులు అమెరికా 'జీరో టారిఫ్' తో కొంటుంది. అమెరికా ఎగుమతులకు (అల్యూమినియం, ప్లాస్టిక్స్, మెకానికల్ ఉపకరణాలు మరియు ఇంజనీరింగ్ వస్తువుల వంటి )రంగాలలో మనం 18 శాతం టారిఫ్‌లతో దిగుమతులు పెరిగే అవకాశం ఉంది, ఇది స్థానిక పరిశ్రమలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. అమెరికన్ వ్యవసాయ ఉత్పత్తులు (బాదం, ఆపిల్, వైన్) తదితర దిగుమతి చేయడం మన వ్యవసాయానికి, పాల ఉత్పత్తులకు ముప్పు తెచ్చే అవకాశం ఉంది.

**భవిష్యత్తుకు మన ఆర్థిక నిపుణుల సూచనలు:**
**మన ప్రభుత్వం చేపట్టవలసిన చర్యలు:**

1.పారదర్శకత: ఒప్పందం యొక్క పూర్తి వివరాలను పార్లమెంటుకు ముందు ఉంచాలి. విస్తృతమైన చర్చను ప్రోత్సహించాలి. ప్రజలు తమకు ప్రయోజనం చేకూర్చే నిబంధనలు ఏవిటో తెలుసుకోవడానికి హక్కు ఉంది.

2. ప్రత్యామ్నాయ మార్కెట్లను బలోపేతం చేయాలి: అమెరికాపై పూర్తిగా మనం ఆధార పడటాన్ని తగ్గించాలి. యూరోపియన్ దేశాలు, అరబ్, ఆగ్నేయాసియా, ఆఫ్రికా మరియు లాటిన్ అమెరికా దేశాలతో వాణిజ్య ఒప్పందాలపై చర్చలను వేగవంతం చేయాలి.

3. స్థానిక పరిశ్రమలకు రక్షణ: అమెరికా నుండి దిగుమతుల వల్ల ప్రతికూలంగా ప్రభావితమయ్యే రంగాలలో స్థానిక తయారీదారులకు ఆదాయం కోల్పోకుండా రక్షించడానికి సహాయం చేయాలి. వారికి ఆధునికీకరణ మరియు పోటీ సామర్థ్యం కోసం ప్రోత్సాహకాలు అందించాలి.

4. ఇంధన భద్రతా వ్యూహాల పునఃపరిశీలన: రష్యా నుండి చమురు దిగుమతి తగ్గించడం వలన కలిగే ప్రభావాన్ని తట్టుకోవడానికి, ఇతర దేశాల నుండి దిగుమతులను వైవిధ్య పరచడం, పునరుత్పాదక శక్తి వైపు మరింత దృష్టి పెట్టడం, అలాగే స్థానిక శోధనలను ప్రోత్సహించడం జరగాలి.

5. దీర్ఘకాలిక వ్యూహం రూపకల్పన: భారతదేశం తన వాణిజ్య విధానాలను జాతీయ ప్రయోజనాల ఆధారంగా రూపొందించుకోవాలి, బాహ్య ఒత్తిళ్ల ఆధారంగా కాదు. విదేశాంగ విధానం ప్రధాన లక్ష్యం దేశ ప్రయోజనాలను సాధించడం అయి ఉండాలి.

చివరిగా, భారత అమెరికా వాణిజ్య ఒప్పందం భారత దేశం యొక్క ఆర్థిక, రాజకీయ స్వయంప్రతిపత్తికి సంబంధించిన ప్రశ్నలను ఎత్తిపట్టింది. వాణిజ్య లావాదేవీలు రెండు దేశాలకు ప్రయోజనకరంగా ఉండాలి, కానీ అవి దేశం యొక్క సార్వభౌమ నిర్ణయాలను ప్రభావితం చేయకూడదు. ప్రభుత్వం తప్పనిసరిగా ఈ విషయంలో ప్రజల ఆందోళనలను అర్థం చేసుకోసుకోవాలి. పారదర్శకతను నిర్ధారించుకోవాలి. ఈ ఒప్పందం భారతీయుల భవిష్యత్తు ప్రయోజనాలకు ఎలా సహాయపడుతుందో స్పష్టంగా వివరించాలి. లేకపోతే, ఈ ఒప్పందం భారత ఆర్థిక వ్యవస్థపై అమెరికా ప్రభుత్వం ప్రభావాన్ని పెంచే ఒక పెద్ద దశగా మారే ప్రమాదం ఉంది. ఇది దీర్ఘకాలంలో జాతీయ ప్రయోజనాలకు హాని కలిగించవచ్చు.



## మక్తల్‌లో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికలు

### ఎలక్షన్ సరళి, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

**ప్రజాపక్షం/మక్తల్ :** నారాయణపేట జిల్లా, మక్తల్ మున్సిపాలిటీలలో ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. బుధవారం రోజు మక్తల్‌లోని, జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్లో, గార్లపల్లిలో పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల సరళి, పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తును జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ స్వయంగా పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అంతరాయం లేకుండా శాంతియుత వాతావరణంలో మున్సిపల్ ఎన్నికలు కొనసాగేలా చూడాలని, అలాగే పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. మున్సిపల్ ఎన్నికల సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఓటు వేయడానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, క్యూ లైన్‌లో ఉండేలా చూడాలని ఆయన తెలిపారు. ఎన్నికలు పూర్తయ్యేవరకు పోలీస్ విభాగం హై అలర్ట్‌లో కొనసాగాలని, శాంతి భద్రతలను కాపాడడంలో ప్రతి పోలీసు సిబ్బంది బాధ్యతగా ఉండాలని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఎస్పీ తెలిపారు. ఎస్పీతో పాటు డిఎస్పీ మహేష్, సిఐ రామ్‌లాల్, ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మద్యం అమ్మకాలపై దాడులు

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట్ జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం 12:30 గంటలకు నారాయణపేట పట్టణంలోని సుభాష్ రోడ్డులో అనధికారిక మద్యం అమ్మకాలపై దాడులు నిర్వహించబడింది దాడుల సమయంలో 22 లీటర్ల బీరు, 5.5 లీటర్ల మద్యం, మొత్తం(27.5) లీటర్లు/ (మొత్తం 63 మద్యం సీసాలు) స్వాధీనం చేసుకోబడినవి నిందితుల గురించి విచారణ కొనసాగుతుంది. రెండు కేసుల నమోదు చేయబడినవి వీటి విలువ అధికారికంగా రూ.11,500/ వరకు ఉంటుంది.

## కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రధాని మోదీ :

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ఈనెల 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని కామ్రేడ్ లక్ష్మణాచారిభవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడి మూడోసారి అధికారంలోకి వచ్చాక కార్మిక హక్కులను కాలరాస్తున్నాడని అన్నారు. ఎన్నో త్యాగాలు పోరాటాలద్వారా సాధించుకున్నటువంటి 29చట్టాలను రద్దుచేసి నాలుగుకోడ్‌ల విభజనచేసి కార్మికుల కర్షకుల రైతు వ్యవసాయకూలీల పొట్టకొట్టి బడాకార్పొరేట్ పారిశ్రామికవేత్తలకు కొమ్ముకాస్తున్నాడని అన్నారు. అనిల్‌అంబాని, ఆదానిలకు ప్రభుత్వ ఆస్తులను అప్పన్నంగా బంగారుపల్లెంలోపెట్టి ఇచ్చినట్లు ఖనిజసంపదను ఎల్‌ఐసి, బిఎస్‌ఎన్‌ఎల్, రైల్వే , విమానాశ్రయాలను ప్రైవేట్‌పరం చేస్తూ ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్నాడని అన్నారు. కార్యక్రమంలో ఎఐటియూసి జిల్లా నాయకులు చిన్నపాగశ్రీనివాసులు, వెంకటస్వామి, గొర్లసత్యం, తప్పెటకిరణ్‌కుమార్, గోపీచారి, కొత్తరామస్వామి, నరేష్, హమాలీలు బాలస్వామి, శివ, వెంకటేష్, యాదయ్య, కుర్మయ్య పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై జాగ్రత్త

**ప్రజాపక్షం/ఉట్కూర్ :** నారాయణపేట్ జిల్లా ఉట్కూర్ మండలంలో ఆర్థిక అక్షరాస్యత ఆధ్వర్యంలో వార్షికోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సైబర్ నేరాల పట్ల ప్రజల జాగ్రత్తగా ఉండాలని, అలాగే ఇన్సూరెన్స్ పాలసీల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ మోసాల నుంచి రక్షణ పొందేందుకు వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని, అనుమానాస్పద కాల్స్, సందేశాలపై స్పందించవద్దని తెలిపారు. అలాగ ఇన్సూరెన్స్ పాలసీల తీసుకునే ముందు పూర్తి వివరాలు తెలుసుకుని నిర్ణయిం తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ చింత రవి ఎల్డీఎం విజయ్ కుమార్, మేనేజర్ రాజ్‌కుమార్, చాంద్ సుల్తానా, తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

**ప్రజాపక్షం/అచ్చంపేట :** ఈనెల 15, 16తేదిలలో ఉమామహేశ్వరంలో జరిగే బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆయన సతీమణిని దేవాలయ చైర్మన్ బీరంమాధవరెడ్డి ,దేవాలయ ఇఓ శ్రీనివాసులు ఆహ్వానించారు. గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే స్వగృహానికి వెళ్లి ఆహ్వానపత్రాలు ఇవ్వగా ఆయన బ్రహ్మోత్సవాలకు వస్తున్నట్లు తెలిపారు.

## బౌరాపురం జాతరకు మంత్రి సీతక్క రాక

**ప్రజాపక్షం/అచ్చంపేట :** ప్రతి సంవత్సరం చెంచులచే పూజలు నిర్వహిస్తున్న బౌరాపురం జాతరకు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖమంత్రి సీతక్క రానున్నట్లు డిపిఆర్‌ఓ కార్యాలయం తెలిపింది. అచ్చంపేట నియోజకవర్గంలోని నల్లమలలో చెంచులచే గిరిజన సాంప్రదాయంలో నిర్వహించే ఈకల్యాణం బౌరాపురం గ్రామంలో నిర్వహిస్తారు. ప్రతి శివరాత్రిరోజు కల్యాణం నిర్వహించడం ఆనవాయితి. ఈకల్యాణానికి శ్రీశైల దేవస్థానంనుండి ఉమామహేశ్వరం దేవస్థానంనుండి సారే చీర తీసుకొస్తారు. ఈసంవత్సరం రాష్ట్రప్రభుత్వంనుండి పట్టువస్త్రాలు తీసుకురానున్నట్లు తెలిపారు.

## పోలీస్ శాఖ అప్రమత్తతతో ప్రశాంతంగా ఎన్నికలు : ఎస్పీ సునీతరెడ్డి

**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు పట్టణంలోని హరిజనవాడ, మార్కెట్ యార్డు కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లను, పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ సునితరెడ్డి, పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో పోలీసుల పటిష్ట బందోబస్తు ఉంది. పోలింగ్ కేంద్రాల పరిధిలో 163 బియన్‌ఎస్‌ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంది. ఐదుగురికి పైగా గుంపులుగా చేరడం పూర్తిగా నిషేధించబడింది. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రత్యేక పోలీస్ నిఘా కొనసాగుతుందని ఎస్పీ సునిత రెడ్డి తెలిపారు. ప్రతి సిబ్బంది ఓటర్లతో మర్యాదపూర్వకంగా మాట్లాడుతూ సమర్థంగా వ్యవహరించాలని సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ చట్ట ఉల్లంఘనలకు, బెదిరింపులు, ప్రలోభాలు లేదా గందరగోళం సృష్టించే ప్రయత్నాలకు ఎలాంటి తావులేదని, అవసరమైతే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని స్పష్టంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటి డీఎస్పీ, మునువార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ పెబ్బేరు ఎస్సైలు, యుగంధర్ రెడ్డి, దివ్యా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్

### జిల్లాలో పోలింగ్‌శాతం 77.64శాతం నమోదు

### జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లాలో మున్సిపల్ పోలింగ్‌ప్రక్రియ శాంతియుతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బదావత్‌సంతోష్ తెలిపారు. బుధవారం జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌ప్రక్రియ కట్టుదిట్టమైన ఏర్పాట్లనడుమ ప్రశాంతంగా, ఉదయం 7గంటలకే పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 5గంటలవరకు ప్రశాంతంగా కొనసాగిందన్నారు. కలెక్టరేట్‌నుండి కూడా ఆయా పోలింగ్ కేంద్రాలలో వెబ్‌క్యాస్టింగ్ ద్వారా ఓటింగ్‌తీరును, స్థానిక పరిస్థితులను ఎన్నికల పరిశీలకురాలు రాజ్యలక్ష్మి, అదనపు కలెక్టర్ దేవసహాయంలతో కలిసి జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి మున్సిపాలిటి పరిధిలోను ఓటింగ్ నిర్వహణకోసం అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. మూడు మున్సిపాలిటిల 65వార్డులకు జరిగిన ఎన్నికలకు 131 పోలింగ్‌కేంద్రాల్లో ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయగా భారీగా ఓటర్లు తరలి వచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

**జిల్లాలో 77.64శాతం నమోదు :** మూడు మున్సిపాలిటిల్లో 40028 పురుషులకుగాను 31046మంది పురుషులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. 40728మంది మహిళా ఓటర్లకుగాను 31657మంది మహిళలు ఓటుహక్కును వినియోగించుకోగా మొత్తం 80757మంది ఓటర్లకుగాను 62703మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. నాగర్‌కర్నూల్ మున్సిపాలిటిలో పురుషులు 17460మంది ఓటర్లకుగాను 12906 మంది పురుషులు ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోగా , 17918 మహిళా ఓటర్లకుగాను 13265మంది మహిళలు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మొత్తం ఓటర్లు 35378మంది ఉండగా 26171మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 73.98శాతం నమోదైంది. కల్వకుర్తి మున్సిపాలిటిలో పురుషులు 12975మంది ఓటర్లకుగాను 10444మంది పురుషులు ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోగా, 13048మంది మహిళా ఓటర్లకుగాను 10538 మంది మహిళలు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మొత్తం ఓటర్లు 26023మంది ఉండగా 21027మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 80.80 శాతం నమోదైంది. కొల్లాపూర్ మున్సిపాలిటిలో పురుషులు 9593మంది ఓటర్లకుగాను 7696మంది పురుషులు ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోగా, 9763మహిళా ఓటర్లకుగాను 7809మంది మహిళలు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మొత్తం ఓటర్లు 19356మంది ఓటర్లు ఉండగా 15505మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 80.10 శాతం నమోదైనట్లు తెలిపారు. ఓటింగ్ సందర్భంగా పోలింగ్‌కేంద్రాలవద్ద గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్‌బాక్సులను సీల్‌చేసి పోలీసుబందోబస్తు మధ్య స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించారు.



## ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

### మంత్రి వాకిటి శ్రీహరి

**ప్రజాపక్షం/మక్తల్ :** ఎన్నికల్లో ఓటు విలువను కాపాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా బుధవారం మక్తల్ పట్టణంలోని 7వ వార్డు పరిధిలో 16వ పోలింగ్ బుత్‌లో మంత్రి వాకిటి శ్రీహరి తన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంత్రితోపాటు 7వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీవిద్య నీలగౌడ్, మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు బి.శంషోద్దీన్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. ప్రజాస్వామ్యంలో ఓటు విలువ ఎంతో గొప్పది అన్నారు. నిజాయితీగా, నిస్వార్థంగా ఓటు విలువను కాపాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రజాప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు దోహదం చేస్తాయని అభిప్రాయపడ్డారు. మక్తల్ మున్సిపాలిటీతో పాటు మిగతా రెండు మున్సిపాలిటీలను కూడా హస్తగతం చేసుకోవడం ఖాయమని మంత్రి వాకిటి శ్రీహరి ధీమా వ్యక్తం చేశారు.

## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ విజయేందిర బోయి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మహబూబ్‌నగర్ జిల్లాలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల సందర్భంగా భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డు నంబర్ 9 లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఓటింగ్ నిర్వహణను పరిశీలించారు. అలాగే వార్డు నంబర్ 10 లోని ఉర్దూ కమ్యూనిటీ హాల్ లో కొనసాగుతున్న పోలింగ్ ప్రక్రియను సమీక్షించారు. వార్డు నంబర్ 06 అమిస్తాపూర్ ప్రాథమిక పాఠశాలలో, అలాగే వార్డులు 05,06 పరిధిలని ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు.

# బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**ప్రజాపక్షం/మక్తల్ :** రాష్ట్రంలో హత్య.. బెదిరింపు రాజకీయాలు జరుగుతున్నాయని, ఇలాంటి రాజకీయాలు నిలువవని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు బిజెపి అభ్యర్థి మహాదేవ్ ఆత్మహత్యకు పాల్పడిన నేపథ్యంలో బుధవారం ఉదయం ఎంపి డికె.అరుణ, ఇతర పార్టీ నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని మంత్రి కిషన్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మహదేవ్ ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. పార్టీ తరపున పది లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి మంత్రి కిషన్ రెడ్డి, ఎంపి డికె.అరుణ అందజేశారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రోజు రోజుకూ ప్రజా విశ్వాసాన్ని కోల్పోతుందని చెప్పారు. ఈ కారణంగానే మంత్రులు, ఎమ్మెల్యేలు హత్యలు, బెదిరింపు రాజకీయాలు చేస్తున్నారని మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. ప్రజల అభిమానంతో, ఆదరణతో రాజకీయాలు చేయాలని, కానీ బెదిరింపు, హత్యా రాజకీయాలు చెయ్యొద్దని మంత్రి అధికార పార్టీ నేతలకు సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విషయం తెలుసుకుని వెంటనే బాధిత కుటుంబం వద్దకు వెళ్లి ధైర్యం చెప్పి అండగా నిలవాలని నన్ను ఆదేశించడంతో, హుటాహుటిన ఢిల్లీ నుండి రావడం జరిగిందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపి డికె.అరుణ, నారాయణపేట జిల్లా బిజెపి నేతలు నాగురావు నామాజీ, రతన్ పాండు రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు బి.కొండయ్య పాల్గొన్నారు.

# 108 అంబులెన్స్‌లో సుఖ ప్రసవం

### తల్లి, శిశువు సురక్షితం



**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు మండల పరిధిలోని యాపర్ల గ్రామానికి చెందిన భూమిక అనే గర్భిణీ మహిళ బుధవారం తెల్లవారుజామున ఆకస్మాత్తుగా తీవ్రమైన పురిటి నొప్పులతో బాధపడింది. పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో కుటుంబ సభ్యులు వెంటనే అత్యవసర సేవలైన 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే వీపనగండ్ల ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో విధులు నిర్వహిస్తున్న 108 అంబులెన్స్ టెక్నీషియన్ రాము, పైలెట్ మైనుద్దీన్ తక్షణమే యాపర్ల గ్రామానికి చేరుకున్నారు. గర్భిణీని అంబులెన్స్‌లోకి ఎక్కించి వనపర్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా, పెబ్బేరు కంచిరావుపల్లి గ్రామాల మధ్య మార్గమధ్యంలోనే ప్రసవ వేదనలు మరింతగా పెరిగాయి. పరిస్థితిని గమనించిన 108 సిబ్బంది అప్రమత్తమై, ఎలాంటి ఆలస్యం చేయకుండా అంబులెన్స్‌లోనే అవసరమైన వైద్య సహాయాన్ని అందించారు. అత్యవసర పరిస్థితుల్లోనూ అత్యంత నైపుణ్యంతో వ్యవహరించిన టెక్నీషియన్ రాము, పైలెట్ మైనుద్దీన్ సహకారంతో భూమిక అంబులెన్స్‌లోనే సుఖ ప్రసవం చేసి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం అనంతరం తల్లి, శిశువును పూర్తిగా సురక్షితంగా వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం తల్లి, బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఇది భూమికకు నాలగవ కాన్పు కాగా, సమయానికి 108 సేవలు అందుబాటులోకి రావడం వల్ల ప్రాణాపాయ పరిస్థితి తప్పినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అత్యవసర సమయంలో అద్భుత సేవలందించిన 108 సిబ్బంది రాము, మైనుద్దీన్‌లకు భూమిక భర్త శివానంద సహా కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 108 అత్యవసర సేవల వేగవంతమైన స్పందన మరోసారి ప్రాణాలను కాపాడిందని స్థానికులు సిబ్బందిని అభినందించారు.

## అపర సంజీవినిలో 108, 102 అంబులెన్స్ సేవలు

**ప్రజాపక్షం/రేవల్లి :** ఉమ్మడి జిల్లా సలహాదారుడు మేనేజర్ రవి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 108, 102 అంబులెన్స్లు అత్యుత్తమంగా పనిచేస్తున్నాయని అపర సంజీవనిల ఆదుకుంటున్నాయని ఉమ్మడి జిల్లా సలహాదారుడు మేనేజర్ కె.రవి పేర్కొన్నారు. బుధవారం రేవల్లి మండల కేంద్రంలోని 108 అంబులెన్స్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్‌లోని వివిధ రకాల పరికరాల పనితీరు, మందులను పరిశీలించారు. 108 అంబులెన్స్లు ద్వారా ప్రజలకు అత్యుత్తమ సేవలను అందిస్తున్నామని ప్రమాద బాధితులను ఆపదలో ఉన్న వారిని వెంటనే దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నామని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 108, 102 అంబులెన్స్లు ద్వారా ప్రజలకు వైద్య సహాయాన్ని అందిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ మోహబూబ్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ నరసింహ్మ ఫైలెట్ పి. కిరణ్ చారి పాల్గొన్నారు.

## విజయమ్మకు నివాళులార్పించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**ప్రజాపక్షం/ వనపర్తి న్యూ టౌన్ :** ఖిల్లా ఘణపురం మండల కేంద్రానికి చెందిన తన పెద్దనాన్న కూమారుడు భాస్కర్ రెడ్డి సతీమణి విజయమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది. విషయం తెలుసుకున్న వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి వారి కుటుంబాన్ని, పరామర్శించి విజయమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులార్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తనకున్న ఇద్దరు కొడుకులు తల్లి లేని పిల్లలుగా అయిపోయారని ఆవేదన వ్యక్తం చేసిన భాస్కర్ రెడ్డిని ఓదారుస్తూ తన కుటుంబానికి ఎల్లవేళలా తను అండగా ఉంటానని ఎమ్మెల్యే వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో గంజాయి రమేష్, నాయకుడు లక్ష్మారెడ్డి, ఆగారం ప్రకాష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## గద్వాలలో ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్



**ప్రజాపక్షం/గద్వాల :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ అత్యంత ఉత్సాహంగా, ప్రశాంత వాతావరణంలో ముగిసింది. ఉదయం నుండే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. యువతతో పాటు వృద్ధులు, మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఆసక్తి చూపారు. ముఖ్య విశేషాలు : పోలింగ్ శాతం ని అన్ని వార్డుల్లో కలిపి సుమారు (శాతం ఉదా: 57.08%) పోలింగ్ నమోదైనట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. భద్రతా ఏర్పాట్లు : ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తు నిర్వహించింది. సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘా ఉంచారు. అధికారుల పర్యవేక్షణ : జిల్లా కలెక్టర్, ఎస్పీ పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటర్లకు ఇబ్బంది కలగకుండా అన్ని వసతులు కల్పించినట్లు వారు తెలిపారు. నేతల ఓటు హక్కు : స్థానిక ప్రముఖ రాజకీయ నాయకులు, అభ్యర్థులు తమ వార్డుల్లో ఓటు హక్కును వినియోగించుకుని, ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పోలింగ్ ముగియడంతో బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. అభ్యర్థుల గెలుపోటములపై ఇప్పుడు పట్టణమంతా జోరుగా చర్చ సాగుతోంది. కౌంటింగ్ ప్రక్రియ (తేదీ : 13) నాడు చేపట్టనున్నట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.

## పురపాలక ఎన్నికలు : క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

**ప్రజాపక్షం/గద్వాల్ :** పురపాలక సంస్థల ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు, ఐపీఎస్, స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లా ఎస్పీ మంగళవారం సాయంత్రం గద్వాల్ పట్టణంలో ఉన్న పలు క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఎన్నికలు శాంతియుతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా గంజిపేట పరిధిలోని మౌంటేశ్వరి స్కూల్, వేదనగర్‌లోని దయానంద విద్యామందిర్, రాఘవేంద్ర కాలనీలోని ప్రభుత్వ పాఠశాల, ఎమ్ఎఎల్ డి జూనియర్ కాలేజ్ తదితర పోలింగ్ కేంద్రాలను ఎస్పీ సందర్శించి, అక్కడ చేపట్టిన భద్రతా చర్యలు, పోలీస్ బందోబస్తు, సిసి కెమెరాల ఏర్పాటు తదితర అంశాలను పరిశీలించారు. అవసరమైన చోట మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌లో పోలింగ్ కేంద్రాన్ని 4,7,8,9 వార్డులో తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్, ఈ తనిఖీలలో జిల్లా ఎస్పీ తో పాటు గద్వాల్ డిఎస్పీ వై.మొగిలయ్య, గద్వాల్ సర్కిల్ ఆఫీసర్ టంగుటూరి శ్రీను, పట్టణ ఎస్సై కల్యాణ్ పాల్గొన్నారు.

## పోలింగ్ ప్రశాంతం

**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ జిల్లాలోనీ నాలుగు మున్సిపాలిటీలలో ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గద్వాల పురపాలక పరిధిలోని దౌదర్పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఐజ జెడ్పిహెచ్ఎస్, పర్దిపురం అంగన్వాడి భవనం, శాంతినగర్ జెడ్పిహెచ్ఎస్, అలంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను బుధవారం ఎస్పీ శ్రీనివాస రావుతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో విధులు నిర్వహించే సిబ్బంది, ఓటర్లు సెల్ ఫోన్స్ ఎట్టి పరిస్థితుల్లో తీసుకురాకూడదని అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితాలో ఓటర్ల క్రమ సంఖ్యను సరి చూసుకొని ఓటు వేసేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఓటర్లకు బ్యాలెట్ పేపర్ లు ఇచ్చిన తర్వాత బ్యాలెట్ బాక్స్ లో వేసేంత వరకు ఓటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల వెలుపల అతికించిన పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి గుర్తుల వివరాలను పరిశీలించారు. సాయంత్రం ఐదు గంటల లోపల పోలింగ్ కేంద్రాల్లోని క్యూలో నిలుచున్న వారందరికీ ఓటు వేసేదుకు అవకాశం కల్పించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. వారి వెంట అదనపు ఎస్పీ శంకర్, డీఎస్పీ మొగిలయ్య, ఆయా మున్సిపాలిటీల ఎన్నికల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న సాగులో 'బ్యాటరీ' చెన్నయ్య మార్క్

**ప్రజాపక్షం/మల్దకల్ :** జోగులాంబ గద్వాల్ మల్దకల్ మండలం పరిధిలో డి. అమరవాయి గ్రామం వ్యవసాయం పై మక్కువతో పాటు సరైన ప్రణాళిక ఉంటే బంగారు పంటలు పండించదచ్చని డి. అమరవాయి గ్రామానికి చెందిన రైతు బ్యాటరీ చెన్నయ్య (ప్రముఖంగా బ్యాటరీ చెన్నయ్య) నిరూపిస్తున్నారు. తన సాగు భూమిలో ఆయన సాగు చేసిన మొక్కజొన్న పంట ప్రస్తుతం కోత దశకు చేరుకోగా, అద్భుతమైన దిగుబడితో ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. శాస్త్రీయ పద్ధతులే పెట్టుబడిః ప్రస్తుత కాలంలో చీడపీడల వల్ల మొక్కజొన్న సాగు భారంగా మారుతున్న తరుణంలో, చెన్నయ్య మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలనిరు. పంట ఆరంభం నుండి భూసార పరీక్షలు, నాణ్యమైన విత్తనాల ఎంపిక, సకాలంలో ఎరువుల వినియోగం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఫలితంగా మొక్కలు దృఢంగా పెరగడమే కాకుండా, కంకులు ఎంతో నాణ్యంగా, భారీ సైజుల్లో ఊరాయి. విజయం రహస్యం ఇదే! పొలంలో పంటను పరిశీలిస్తున్న బ్యాటరీ చెన్నయ్య మాట్లాడుతూ. '' పంట నాణ్యత పెరగాలంటే నిరంతరం పొలంలోనే ఉండి పర్యవేక్షించాలి. చీడపీడలు ఆశించక ముందే జాగ్రత్తలు తీసుకోవాలి అప్పుడే తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందగలం. మన ఊరి వాతావరణానికి మొక్కజొన్న సాగు ఎంతో లాభదాయకం''. అని పేర్కొన్నారు. గ్రామంలో హర్షంః రైతు చెన్నయ్య సాధించిన ఈ ఫలితాలను చూసి డి. అమరవాయి గ్రామ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏ పని చేసినా అందులో ప్రత్యేకత చాటుకునే ఆయన, మొక్కజోన్న సాగులోనూ తనదైన ముద్ర వేశారని తోటి రైతులు కొనియాడుతున్నారు.

## అమరచింతలో 83.58 శాతం పోలింగ్

**ప్రజాపక్షం/అమరచింత :** మున్సిపల్ ఎన్నికలు బుధవారం అమరచింతలో ముగిశాయి. అమరచింతలో 10 వార్డులలో మొత్తం 9147 ఓట్లు ఉన్నవి. అందులో 7645 ఓట్లు పోలయ్యాయి. పదివార్డులగాను 18 పోలింగ్ బూతులలో ఓటర్లు ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎస్పీ సునీత రెడ్డి అమరచింతలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల ఓటింగ్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల దాకా అన్ని బూతులలో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డిఎంఆర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ బాలికల పాఠశాల, ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాటశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును నిర్వహించి ప్రశాంతంగా ఓటింగ్ జరిగేటట్లు ఏర్పాటు చేశారు. అమరచింతలో 10 వార్డులకు సంబంధించిన ఎన్నికలలో కాంగ్రెస్ బిజెపి, టిఆర్ఎస్, సిపిఐ, సిపిఎం, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఎన్నికలలో పోటీ చేశారు. మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



## రాష్ట్రంలో మళ్లీ అధికారం చేపట్టబోయేది ముమ్మాటికీ కాంగ్రెస్సే

### కోదాడలో ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా బుధవారం కోదాడ పట్టణంలోని 14 వార్డు 34వ పోలింగ్ బూత్‌లో రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటి, 7 కార్పొరేషన్లలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం పురపాలక సంఘం ఎన్నికల్లో గేమ్ ఛేంజర్‌గా మారిందన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమిలేదని, అందుకే ప్రజలు విసుగుచెందారని, తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ అధికారం చేపట్టబోయేది ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేనని అన్నారు. ఆయన వెంట కోదాడ కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి, వంగవీటి రామారావు పలువురు ఉన్నారు.

## చిట్యాలలో 87.88 శాతం పోలింగ్




**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటిలో బుధవారం నిర్వహించిన ఎన్నికలు చెదురుమెదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిశాయి. పట్టణంలో ఏర్పాటు చేసిన 24 పోలింగ్ బూత్‌లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణను అధికారులు పూర్తి చేశారు. పట్టణంలోని మొత్తం 12వేల118 ఓట్లకు గాను 10వేల 649 ఓట్లు పోలయ్యాయి. 87.88 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ముగియడంతో కౌన్సిలర్లుగా పోటీ చేసిన అభ్యర్థులు తమ గెలుపోటములపై అంచనాలు వేసుకుంటున్నారు. అభ్యర్థుల గెలుపుపై పట్టణ ప్రజలలో కూడా ఉత్కంఠ నెలకొని ఉంది. 13న నల్లగొండలో జరిగే కౌంటింగ్‌తో ఉత్కంఠకు తెరపడనుంది.

## హాలియాలో 85.78 శాతం

**ప్రజాపక్షం/హాలియా:** మున్సిపాలిటీ ఎన్నికలు నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిశాయి.బుధవారం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు కాసింత ఆసక్తి చూపించారు.హాలియాలో మొత్తం 12 కౌన్సిలర్లు ఉండగా అందులో 10వ వార్డు కౌన్సిలర్ ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి విధితమే. మిగిలిన 11వ వార్డులకు ఎన్నికలు నిర్వహించారు.హాలియా మున్సిపాలిటీలో 11 వార్డుల్లో 11696 ఓటర్లు ఉన్నారు.ఇందులో 10,033 ఓట్లు నమోదయ్యాయి. మహిళలు 5949 మంది ఓటర్లు ఉండగా ఇందులో 5,123 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు5746 మంది ఓటర్లు ఉండగా ఇందులో 4909 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.పురుషులలో 85.43శాతం,మహిళల్లో 86.12 శాతం ఓట్లు నమోదయ్యాయి.ఓవరాల్ గా 85.78 శాతం ఓట్లు పోలయ్యాయి.ఇందులో కూడా మహిళలే తమ ఓటు హ క్కును ఎక్కువగా వినియోగించుకోవడం గమనార్హం.

## భువనగిరిలో 82.93 శాతం

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి మున్సిపాలిటీలోనీ 35 వార్డులలో బుధవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 35 వార్డులకు గాను 43,781 ఓటర్లు ఉండగా 39,664 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం ప్రారంభమైన పోలింగ్ మందకోడిగా సాగగా మధ్యాహ్నం వరకు ఎక్కువ శాతం నమోదయింది. ఉదయం 9 గంటలకు 4474 ఓటింగ్ నమోదుకగా 9.35 శాతం, 11 గంటలకు 14876 ఓటు హక్కును వినియోగించుకోగా 31.10 శాతం, మధ్యాహ్నం ఒంటిగంటకు 25,540 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 47.12 శాతం, మూడు గంటలకు 32,498 పోలింగ్ జరగడు 67.94 శాతం, సాయంత్రం 5 గంటలకు 39,664 ఓటరు తమ ఓటు హక్కును వినియోంచుకోగా 82.93 శాతం నమోదైంది.

## నందికొండలో 59.68 శాతం



**ప్రజాపక్షం/నందికొండ:** మున్సిపాలిటీలో బుధవారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ముగిశాయి.ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మొదట మందకొడిగా సాగినా 10 గంటల తర్వాత ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు భారీగా తరలి రావడంతో పోలింగ్ వేగం పెరిగింది.మధ్యాహ్న భోజన విరామం తర్వాత కొంత నెమ్మదించినా,సాయంత్రం వరకు ఓటర్లు తమ ఓటు హక్కునువినియోగించుకోవడంతో పోలింగ్ శాతం క్రమంగా పెరిగింది.అధికారిక గణాంకాల ప్రకారం, నందికొండ మున్సిపాలిటీ పరిధిలో 12 వార్డులు, 24 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 6,441 మంది పురుషులు,7,079 మంది మహిళలు,ఇతరులు 1 కలిపి మొత్తం 13,521 మంది ఓటర్లు ఉండగా 8,069 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.పోలింగ్ ముగిసే సమయానికి 59.68 శాతం చేరుకుంది. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుందూరు జానారెడ్డి,సతీమణితో పాటు,కుమారులు స్థానిక ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి,ఎంపీ రఘువీర్ రెడ్డిల తో కలిసి పోలింగ్ కేంద్రానికి వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ

**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లాలో జరుగుతున్న 6 మున్సిపాలిటీలకు సంబంధించిన పోలింగ్ ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ వ్యవస్థను జిల్లా కలెక్టర్ హనుమంతరావు కలెక్టరేట్‌లో ప్రత్యక్షంగా పరిశీలించారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల నుండి ప్రత్యక్షంగా ప్రసారం అవుతున్న దృశ్యాలను మానిటరింగ్ చేస్తూ పోలింగ్ నిర్వహణను పరిశీలించారు.

# సూర్యాపేట జిల్లాలో 79.90 శాతం

### తిరుమలగిరి మున్సిపాలిటీలో అత్యధికంగా 88.36 శాతంపోలింగ్









**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట జిల్లాలోని 5 మున్సిపాలిటీలలో బుధవారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎక్కడా ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పి కె నరసింహ జిల్లాలోని పలు మున్సిపాలిటీలలోని పోలింగ్ బూత్‌లకు వెళ్ళి పోలింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ స్టేషన్ల వద్ద గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి సిసి కెమెరాల నిఘాలో ప్రశాంత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నారు. వృద్ధులు, వికలాంగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా వీల్‌చైర్లలో తీసుకెళ్ళేందుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 5 మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 79.90 శాతం పోలింగ్ నమోదైనట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ప్రకటించారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. తిరుమలగిరి మున్సిపాలిటీలో అత్యధికంగా 88.36 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. మొత్తం 15 వార్డులు ఉండగా 15,455 ఓట్లు ఉండగా 13,656 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సూర్యాపేట మున్సిపాలిటీలో 79.38 శాతం పోలింగ్ నమోదు కాగా, మొత్తం 48 వార్డుల్లో 1,08,848 ఓటర్లు ఉన్నారు. ఇందులో 86,403 ఓటర్లు తమ ఓటు వేశారు. అలాగే కోదాడ మున్సిపాలిటీలో 77.05 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 32 వార్డులలో 53,056 ఓట్లు ఉండగా 40,881 మంది ఓటర్లు ఓటు వేశారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటిలో 82.88 శాతం పోలింగ్ నమోదు కాగా, మొత్తం 27 వార్డులలో 28,867 ఓట్లు ఉన్నాయి. ఇందులో 23,926 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నేరేడుచర్ల మున్సిపాలిటీలో 79.38శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 15 వార్డులు ఉండగా 13,746 ఓట్లు ఉండగా ఇందులో 10,893 మంది ఓటర్లు ఓటు వేశారు.

# మిర్యాలగూడలో 77.44శాతం పోలింగ్

### కొన్ని వార్డుల్లో స్వల్ప ఘర్షణలు





**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా బుధవారం పట్టణంలో జరిగిన మున్సిపల్ ఎన్నికలు మిర్యాలగూడలో కొన్ని చెదురుముదురు సంఘటనలు మినహాయించి ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం 7గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సరళి కొంత మందకొండిగా సాగింది. మధ్యాహ్నం తరువాత ఓటర్లు ఒక్కసారిగా క్యూలైన్‌లోకి రావడంతో ఓటింగ్ శాతం పెరిగింది. ఎన్నికల ప్రక్రియను జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ పలు వార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మిర్యాలగూడలో 48 వార్డులకు గాను మొత్తం 93,020 మంది ఓటర్లు ఉండగా 72,036 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 77.44శాతం ఓటింగ్ నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 79.31 శాతం ఓటింగ్ నమోదు కాగా ఈసారి ఓటింగ్ శాతం తరగడం గమనార్హం.

### బిఆర్ఎస్- కాంగ్రెస్ వర్గీయుల మధ్య స్వల్ప ఘర్షణలు

మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా కొన్ని వార్డుల్లో స్వల్ప ఘర్షణలు జరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. 6వ వార్డులో బిఆర్ఎస్ పార్టీకి చెందిన కొంతమంది ఆంధ్ర ఓటర్లను దొంగ ఓట్లు వేయించడానికి వచ్చారని ఆరోపిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. 20వ వార్డులో, 29వ వార్డులో పోలింగ్ ముగిసిన అనంతరం కాంగ్రెస్, బిఆర్ఎస్ కార్యకర్తల మధ్య ఘర్షణలు జరగడంతో పోలీసులు లాఠీ చార్జ్ చేశారు. 32వ వార్డులో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఉద్రిక్తత చోటుచేసుకోగా పోలీసులు లాఠీచార్జ్ చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. 8వ వార్డులో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య స్వల్ప వివాదం చెలరేగడంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే సరిదిద్దారు. 39వ వార్డులో 90 సంవత్సరాల వృద్ధుడు అంబులెన్స్‌లో వచ్చి తన ఓటు హక్కును వినియోగించుకోవడం గమనార్హం. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, రాజశేఖర్‌రాజు, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్‌లు పర్యవేక్షణలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

### పోలింగ్ అధికారుల రెమ్యునరేషన్ కుదింపుపై ఆందోళన

మున్సిపల్ ఎన్నికల విధులు నిర్వహించిన అధికారుల రెమ్యునరేషన్‌ను కుదించడం పట్ల విధులు నిర్వహించిన అధికారులు డీఆర్‌సీ సెంటర్ వద్ద ఆందోళనకు దిగారు. తమకు రూ.1300 ఇవ్వాల్సి ఉండగా రూ.1000 ఇవ్వడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిరసన తెలిపారు. కాగా సూర్యాపేట, భువనగిరి జిల్లాల ప్రభుత్వ నిబంధనలకు మేరకు ఇస్తే తమకు తక్కువ చేసి ఇవ్వడం సబబు కాదని అధికారులతో వాగ్వివాదం చేశారు.

# ప్రశాంతంగా నల్లగొండ కార్పొరేషన్ ఎన్నికలు

### భారీగా ఓటర్లు..మహిళలే ముందంజ





**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల పోలింగ్ బుధవారం పట్టణవ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకొని ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగింది.నల్లగొండ కార్పొరేషన్ పరిధిలోని 48 వార్డుల్లో ఉన్న 199 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 1,42,437 మంది ఓటర్లు ఉండగా,వారిలో 1,10,194 మంది (సుమారు 77.3 శాతం)తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఓటు వేసిన వారిలో పురుషులు 52,983,స్త్రీలు 57,165,ట్రాన్స్‌జెండర్లు 65 మంది ఉన్నారు.ఈ ఎన్నికల్లో పురుషుల కంటే 4,182 మంది మహిళలు అధికంగా ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషంగా నిలిచింది.ఈసందర్భంగా రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి 33వ డివిజన్ మీర్‌బాగ్ కాలనీలోని నల్లగొండ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.సీపీఐ సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి గిరిజ దంపతులు బోయవాడ ప్రభుత్వ పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి 34వ డివిజన్ వీటి కాలనీలోని గీతాంజలి కళాశాలలో ఓటు వేశారు. కాంగ్రెస్ మేయర్ అభ్యర్థి బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి దంపతులు 132వ బూత్ ప్రగతి జూనియర్ కళాశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కిషన్ రెడ్డి,బిఆర్ఎస్ మేయర్ అభ్యర్థి చకిలం వసంత అనిల్ కుమార్ దంపతులు 48వ వార్డు గీత విజ్ఞాన మందిర్‌లో ఓటు వేశారు.పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టగా,జిల్లా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు ఎన్నికల సరళిని పర్యవేక్షించారు.

# గ్రీన్ మోడల్ పోలింగ్ కేంద్రాల్లో బారులు తీరిన ఓటర్లు

### నూతన ఓటర్లకు స్వాగతం పలుకుతూ దివ్యాంగులను వయోవృద్ధుల ఓటర్లను సన్మానించిన జిల్లా కలెక్టర్





**ప్రజాపక్షం/యాదాద్రి :** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఓటర్లకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం 6 మున్సిపాలిటీలలో జరుగుతున్న ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో బాగంగా జిల్లా కలెక్టర్ పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిగూడెంలో, భువనగిరి బీచ్ మహల్ లోని జిల్లా పరిషత్ హై స్కూల్లో, యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని కొత్త గుండ్లపల్లిలో, ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని గ్రీన్ మోడల్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలలో ఏర్పాటు చేసిన గ్రీన్ మోడల్ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు విశేష ఉత్సాహంతో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేంద్రాల్లో పచ్చని మొక్కలు, పూల అలంకరణ, కొబ్బరి తోరణాలు, ప్లాస్టిక్ రహిత సామాగ్రి, పర్యావరణహిత అలంకరణతో ఓటర్లకు మైమరిపించే అనుభూతిని కల్పించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడం జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కల్పిస్తున్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బంది విధుల నిర్వహణ తీరును పర్యవేక్షించారు. శాంతియుతంగా, పారదర్శకంగా , ఎన్నికల నియమావళి ప్రకారం కొనసాగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ప్రశాంతంగా మున్సిపల్ పోలింగ్

### నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నల్లగొండ జిల్లాలోని నల్లగొండ మున్సిపల్ కార్పోరేషన్, ఆరు మున్సిపాలిటీల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం మిర్యాలగూడ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మోడల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో అంతటా ప్రజలు తమ ఓట హక్కును వినియోగించుకునేందుకు ఉత్సాహంగా పాల్గొన్నారని అన్నారు. పటిష్ట బందోబస్తు మధ్య ఎన్నికలు నిర్వహించామన్నారు. ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా హెల్ప్ డెస్క్, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని, అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేశామన్నారు. అనంతరం గాంధీపార్క్ ప్రాధమికొన్నత పాఠశాలలోని కేంద్రానిన కలెక్టర్ పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్, వైద్య శిబిరం నిర్వాహకులతో మాట్లాడి అందించాలని కోరారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్‌అమిత్, తహసీల్దార్ పి.శ్రీనివాస్, కమీషనర్ జి.శ్రీనివాస్, ఎంపీడీవోలు ఎం.శేషగిరిశర్మ, వంశీధర్‌లు ఉన్నారు.

## ఎన్నికల విధులకు గైర్హాజరు 17మంది ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ

**ప్రజాపక్షం/చండూరు:** నల్లగొండ జిల్లాలో జరుగుతున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాలకు ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అఫీసర్ తో పాటు తతర పోలింగ్ అధికారులకు శిక్షణ నిర్వహించి అందిరికి పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. అందులో భాగంగా చండూరు మున్సిపాలిటీకి కేటాయించిన 17 మంది అధికారులు ఎన్నికల విధులకు గైర్హాజరు అయినట్లు సంబంధిత అధికారులు గుర్తించారు. ఎలాంటి కారణాలు లేకుండా బుధవారం జరిగిన చండూరు మున్సిపాలిటీ జరుగుతున్న ఎన్నికలకు గైర్హాజరైన 17మంది ఉద్యోగులకు జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ నుండి సోకాజ్ నోటీసులు అందుకున్న వారిలో ఉన్నారు. ఎన్నికల విధులకు గైర్హాజరై సోకాజ్ నోటీసులు జారీ చేసిన వారిలో జి..ఏ కుమార్ టిఎస్ఆర్‌టిసి అధికారి, ఎండి అశ్రాఫ్ జహా ఇరిగేషన్ విభాగం అధికారి, ఎం.ఎ ఫహీప్ జిల్లా మైనార్టీ అధికారి, ఎం. శ్రీదేవి ఉపాధ్యాయురాలు, యాట మధుసుధన్ ఉపాధ్యాయులు, టి.గాయిత్రీ కేజీబివి ఉపాధ్యాయురాలు, పి. ప్రజ్వల కేజిబివి పాధ్యాయురాలు, నాసేమున్నీసా ఉపాధ్యాయురాలు, జి. సంతోషి కుమారి కేజిబివి ఉపాధ్యాయురాలు, జీడిమెట్ల స్వరాజ్యం ఉపాధ్యాయురాలు, బి. లలీత హెచ్ఎం , బత్తుల భాస్కర్ ఉపాధ్యాయుడు, ఎం.లలీత కేజిబివి ఉపాధ్యాయురాలు , ఎస్ పద్మ ఉపాధ్యాయురాలు, ఈ.రమేష్ దేవాదాయ శాఖ అధికారి, కే.కేశలయ్య దేవాదాయ శాఖ అధికారి, పి. ఏడుకొండలు దేవాదాయ శాఖ అధికారి లు జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ నుండి సోకాజ్ నోటీసులు అందుకున్న వారిలో ఉన్నారు.

## చండూరు మున్సిపాలిటీలో 91.52శాతం పోలింగ్ నమోదు

**ప్రజాపక్షం/చండూరు :** మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా బుధవారం జరిగిన చండూరు మున్సిపాలిటీలో 91.52 శాతం పోలింగ్ నమోదు అయ్యనట్లు జిల్లా ఎన్నికల సహాయ అధికారి, చండూరు మున్సిపల్ కమీషనర్ మల్లేశం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగిన పోలింగ్ లో ఓటు హక్కు కలిగిన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మున్సిపాలిటీలో ఉన్న మొత్తం 11వేల 370 ఓట్లకు గాను 10వేల 406 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన



**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట మున్సిపాలిటిలోని జడ్పి ఉన్నత పాఠశాల, ఆనంద్ విద్యా మందిర్ హైస్కూల్, తేజా హైస్కూల్, చొక్కారామయ్య హైస్కూల్‌తోపాటు కుడకుడలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పరిశీలించారు. పోలింగ్ సరళిని అధికారులను అడిగి తెలుసుకున్న ఆయన వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూడాలని కోరారు. పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా అవాంతరాలు లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటిలలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సాగుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, తహశీల్దార్ కృష్ణయ్య పాల్గొన్నారు.

## దేవరకొండలో 80.26 పోలింగ్

### అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్న మహిళా ఓటర్లు

**ప్రజాపక్షం/దేవరకొండ :** దేవరకొండ మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా బుధవారం జరిగిన ఎన్నికల్లో దేవరకొండ లోని 20 వార్డుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు గొడవలు జరగకుండా ప్రశాంతంగా పోలింగ్ జరిగింది.ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగాయి.పోలింగ్ జరుగుతున్న సరళిని దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, డిఎస్పి శ్రీనివాసరావు,తహశీల్దార్ మధుసూదన్ రెడ్డి,సిఐ వెంకటరెడ్డిలు పర్యవేక్షించారు.పటిష్టమైన పోలీసు బందోబస్తును పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేశారు.పట్టణంలోని 20 వార్డుల్లో మొత్తం ఓటర్లు 23,830 ఉండగా 19,127 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు ఇందులో అత్యధికంగా మహిళా ఓటర్లు 9823 కాగా పురుషులు 9303 మంది,ఇతరులు 1 ఓటు హక్కును వినియోగించుకున్నారు.పోలైన ఓట్ల ప్రకారం 20 వార్డుల్లో మొత్తంగా దేవరకొండ మున్సిపాలిటీలో సాయంత్రం పోలింగ్ సమయం ఐదు గంటల వరకు 80.26 పోలింగ్ నమోదైనట్లు దేవరకొండ మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ వెల్లడించారు.పోలింగ్ అనంతరం పోలింగ్ కేంద్రాల్లోని బ్యాలెట్ బాక్సులను కేటాయించిన వాహనాల్లో పోలీస్ భద్రత నడుమ కౌంటింగ్ కేంద్రాలకు తరలించారు.ఈనెల 13వ, తేదీన ఫలితాలు వెల్లడి కానున్నాయి.



టీ20 వరల్డ్‌కప్‌లో సూపర్ థ్రిల్లర్..

## రెండో సూపర్ ఓవర్‌లో నెగ్గిన దక్షిణాఫ్రికా

**అహ్మదాబాద్:** టీ20 వరల్డ్‌కప్‌లో ఆఫ్ఘనిస్తాన్, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన మ్యాచ్‌లో హైడ్రామా చోటుచేసుకున్నది. సూపర్ థ్రిల్లింగ్‌గా సాగిన ఈ మ్యాచ్‌లో రెండు సార్లు సూపర్ ఓవర్ వరకు వెళ్లింది. చివరకు దక్షిణాఫ్రికా రెండో సూపర్ ఓవర్‌లో 4 రన్స్ తేడాతో విక్టరీ నమోదు చేసింది. ఈ వరల్డ్‌కప్‌లో సూపర్ ఓవర్ వరకు వెళ్లిన తొలి మ్యాచ్ ఇదే. భారీ పవర్ హిట్టర్లు ఉన్న రెండు జట్లు.. మ్యాచ్‌పై చివరి వరకు తమ పట్టును కోల్పోలేదు. ఈ మ్యాచ్‌లో సిక్సర్ల వర్షం కురిసింది. ఫస్ట్ మ్యాచ్‌లో రెండు జట్లు కలిపి 20 సిక్సర్లు కొట్టాయి. ఇక సూపర్ ఓవర్స్‌లో మరో 10 సిక్సర్లు బాదాయి. అహ్మదాబాద్ స్టేడియం బౌండరీల మోతతో హోరెత్తింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 187 రన్స్ చేసింది. క్వింటెన్ డికాక్ 59, రికల్టన్ 61 రన్స్ చేశారు. అయితే చేజింగ్ మొదలుపెట్టిన ఆఫ్ఘనిస్తాన్‌కు గుర్బాజ్ మంచి స్టార్ట్ ఇచ్చాడు. అతను 42 బంతుల్లో 84



రన్స్ చేశాడు. అజ్మతుల్లా, రషీద్ ఖాన్ కూడా చెలరేగిపోయారు. దీంతో మ్యాచ్ ఆఫ్ఘన్ గెలుస్తుందనుకున్నారు. కానీ ఆఖరి ఓవర్లో 13 రన్స్ అవసరం కాగా .. మ్యాచ్ టై అయ్యింది. 19.4 ఓవర్లలో 187 రన్స్ చేసి ఆఫ్ఘనిస్తాన్ ఆలౌటైంది. మ్యాచ్ టై కావడంతో సూపర్ ఓవర్‌కు వెళ్లింది.ఇక ఫస్ట్ సూపర్ ఓవర్‌లో ముందుగా ఆఫ్ఘనిస్తాన్ బ్యాటింగ్ చేసింది. ఆ ఓవర్‌లో 17 రన్స్ చేసింది ఆఫ్ఘనిస్తాన్. అజ్మతుల్లా 5 బంతుల్లో 16 రన్స్ చేశాడు. అయితే ఆ టార్గెట్‌ను అనూహ్య రీతిలో ఛేజ్ చేసింది దక్షిణాఫ్రికా. ఆఖరి బంతికి భారీ సిక్సర్ కొట్టిన స్టబ్స్ ఫస్ట్ సూపర్ ఓవర్‌ను తమ ఖాతాలో వేసుకున్నాడు. రెండో సూపర్ ఓవర్‌లో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 23 రన్స్ చేసింది. స్టబ్స్ ఓ సిక్సర్ బాదగా, మిల్లర్ రెండు భారీ సిక్సర్లు కొట్టేశాడు. ఇక చేజింగ్‌లో గుర్బాజ్ వరుసగా మూడు సిక్సర్లు కొట్టి దక్షిణాఫ్రికాను వణికించాడు. కానీ ఆఖరి బంతికి క్యాచ్ అవుట్ కావడంతో 4 రన్స్ తేడాతో సఫారీలు విక్టరీ కొట్టారు.




## ఆస్ట్రేలియా ఘన విజయం!

ఐసిసి టీ20 ప్రపంచకప్ 2026లో ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. గ్రూప్‌బీలో భాగంగా కొలంబో వేదికగా ఐర్లాండ్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 67 పరుగుల తేడాతో విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ నాథన్ ఎల్లిస్(4/12) సంచలన బౌలింగ్‌తో ఆసీస్ విజయంలో కీలక పాత్ర పోషించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 182 పరుగులు చేసింది. మార్కస్ స్టోయినీస్(29 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 45), మ్యాట్ రేన్‌షా(33 బంతుల్లో 2 ఫోర్లతో 37), జోష్ ఇంగ్లీస్(17 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 37) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ఐర్లాండ్ బౌలర్లలో మార్క్ అడైర్(2/44) రెండు వికెట్లు తీయగా.. మాథ్యూ హంఫ్రేస్, జార్జ్ డాక్‌రెల్, హ్యారీ టెక్టర్ తలో వికెట్ తీసారు. అనంతరం ఐర్లాండ 16.5 ఓవర్లలో 115 పరుగులకు ఆలౌటైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియాకు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. డేంజరస్ బ్యాటర్ ట్రావిస్ హెడ్6) రెండో ఓవర్ లోనే రనౌటయ్యాడు. దాంతో క్రీజులోకి వచ్చిన కామెరూన్ గ్రీన్(21), జోష్ ఇంగ్లీస్(37) దూకుడుగా ఆడారు. కానీ భారీ షాట్ ఆడే ప్రయత్నంలో కామెరూన్ గ్రీన్ క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. దాంతో పవర్ ప్లేలో ఆసీస్ 2 వికెట్లకు 64 పరుగులు చేసింది. జోష్ ఇంగ్లీస్, మ్యాట్ రేన్‌షా కూడా వెనుదిరిగ్గా.. మార్కస్ స్టోయినీస్ దూకుడుగా ఆడాడు. హాఫ్ సెంచరీ ముంగిట అతను ఔట్ కావడంతో ఆసీస్ 182 పరుగులకే ఆలౌటైంది. అనంతరం ఐర్లాండ్ బ్యాటర్లు వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. జార్జ్ డాక్‌రెల్(41) ఒక్కటే ఒంటరి పోరాటం చేశాడు. అతను కూడా ఔటవ్వడంతో ఐర్లాండ్‌కు ఘోర పరాజయం తప్పలేదు. గ్రూప్‌బీలో రెండు మ్యాచ్‌లకు రెండు ఓడిన ఐర్లాండ. సూపర్ 8 అవకాశాలను చేజార్చుకుంది.

## ఇంగ్లాండ్‌పై వెస్టిండీస్ గెలుపు

ఐసిసి టీ20 ప్రపంచకప్ 2026లో ఇంగ్లాండ్‌కు అనూహ్య పరాజయం ఎదురైంది. గ్రూప్‌సీలో భాగంగా వెస్టిండీస్‌తో వాంఖడే మైదానం వేదికగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన ఇంగ్లాండ్ 30 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఈ పరాజయంతో సూపర్8 అవకాశాలను ఇంగ్లాండ్ సంక్లిష్టం చేసుకోగా.. వెస్టిండీస్ మెరుగుపర్చుకుంది. వెస్టిండీస్ స్పిన్నర్ గుడాకేష్ మోతీ(3/33) మూడు వికెట్లతో ఇంగ్లాండ్ పతనాన్ని శాసించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 196 పరుగుల భారీ స్కోర్ చేసింది. అనంతరం ఇంగ్లాండ్ 19 ఓవర్లలో 166 పరుగులకే ఆలౌటై ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది.



## పురాతన జంతు చర్మం..

ఒరెగాన్ రాష్ట్రంలోని ఫోర్ట్ రాక్ బేసిన్ ప్రాంతంలో ఉన్న కూగర్ మౌంటెన్ కేవ్ అనే రాతి ఆశ్రయంలో పురావస్తు శాస్త్రవేత్తలు అత్యంత ప్రాముఖ్యమైన ఆధారాలను కనుగొన్నారు. ఇజ్రాయెల్ పత్రిక 'హారెట్జ్' నివేదిక ప్రకారం, తాడు (కోర్డు) ద్వారా కలిపిన రెండు చిన్న జంతు చర్మపు ముక్కలు అక్కడ లభించాయి. ఇవే ఇప్పటి వరకు గుర్తించిన అత్యంత పురాతనంగా జంతు చర్మానికి సంబంధించిన ఆధారాలుగా పరిశోధకులు భావిస్తున్నారు. ఈ చర్మపు ముక్కలు ఖచ్చితంగా ఏ ఉపయోగానికి వచ్చాయో తెలియకపోయినా, అవి కోటు భాగంగా, మొకాసిన్ (పాదరక్ష)గా లేదా గుడారానికి సంబంధించిన భాగంగా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ అవశేషాలు సుమారు 12,900 నుంచి 11,700 సంవత్సరాల క్రితం నాటివి. ఆ



కాలంలో భూమిపై వాతావరణం ఒక్కసారిగా మారింది. ఉష్ణోగ్రతలు తగ్గి, ఉత్తరార్ధగోళం మరింత చల్లగా, పొడిగా మారింది. అటువంటి పరిస్థితుల్లో మనుషులు తమను చలిలో కాపాడుకోవడానికి వేడిమి ఇచ్చే వస్త్రాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. కూగర్ మౌంటెన్ కేవ్‌లో మొక్కల ఫైబర్‌తో తయారైన అనేక రకాల తాడులు కూడా లభించాయి. ఈ తాడులు వేర్వేరు మందాలు, నాణ్యతలు కలిగి ఉండటం వల్ల అవి వివిధ అవసరాల కోసం ఉపయోగించబడ్డాయని తెలుస్తోంది. ఇదే ప్రాంతానికి సమీపంలో ఉన్న పైస్లీ కేవ్‌లో, ఇంకా వెంట్రుకలు ఉన్న కుందేలు చర్మపు పట్టీని కూడా శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఇది ఇటీవలి కాలం వరకు ఒరెగాన్‌లో నివసించిన నార్తర్న్ పైయుట్ గిరిజనులు ఉపయోగించిన కుందేలు చర్మపు దుస్తులను పోలి ఉంది. ఈ పరిశోధన మానవ వస్త్రాల చరిత్రను, అలాగే ఉత్తర అమెరికాలో ప్రాచీన మానవుల జీవన విధానాన్ని అర్థం చేసుకోవడంలో ఒక కీలక మైలు రాయిగా నిలుస్తోంది.

## ఐరన్ ఏజ్ నివాసాలు..






ఉత్తర స్కాట్లాండ్‌లోని హైలాండ్స్ ప్రాంతంలో ఉన్న విండ్‌హిల్ వద్ద మురుగు వ్యవస్థ అభివృద్ధి పనుల కోసం సుమారు ఒక మైలు పొడవున తవ్వకాలు చేపట్టిన సమయంలో, పురావస్తు శాస్త్రవేత్తలు ఒక ముఖ్యమైన చారిత్రక ఆధారాలను కనుగొన్నారు. ఈ తవ్వకాల్లో ఇనుప యుగానికి చెందిన ఒక గ్రామ అవశేషాలు, సమాధులు వెలుగులోకి వచ్చాయి. ఇవి ప్రధానంగా క్రీ.శ. ఆరవ శతాబ్దానికి చెందినవిగా భావిస్తున్నారు. పురావస్తు పరిశోధక బృందం, వృత్తాకార నిర్మాణాలతో ఉండే రెండు ఇనుప యుగ (ఐరన్ ఏజ్) నివాసాలను గుర్తించింది. వీటిని రౌండ్‌హౌసెస్‌గా పిలుస్తారు. ఈ గృహాల సమీపంలోనే రెండు ఇనుప ఖనిజాన్ని కరిగించే కేంద్రాలు కూడా ఉన్నాయి. ఇది ఆ ప్రాంతంలో అప్పట్లో లోహ పనులు జరుగుతుండేవని స్పష్టంగా సూచిస్తోంది. ఈ లోహ తయారీ ఆధారాలు ఈ ప్రాంత పురావస్తు చరిత్రకు విలువైన సమాచారాన్ని జోడిస్తాయని వెస్ట్ కోస్ట్ ఆర్కియాలజికల్ సర్వీసెస్‌కు చెందిన పురావస్తు శాస్త్రవేత్త స్టీవెన్ బిర్చ్ అంటాడు. ఈ ప్రదేశంలో మట్టి పాత్రలు ఏవీ లభించకపోవడం కూడా ఒక విశేష అంశం. దీని ఆధారంగా, ఈ ప్రాంతంలో నివసించిన ఇనుప యుగ ప్రజలు మట్టి పాత్రలు ఉపయోగించకుండా, కలపతో తయారైన పాత్రలను వినియోగించి ఉండవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. అదనంగా, సుమారు 30 అడుగుల వ్యాసంతో ఉన్న మూడు వృత్తాకార సమాధులను కూడా గుర్తించారు. ఇవి ప్రాచీన స్కాట్లాండ ప్రజల జీవన విధానం, సంస్కృతి గురించి మరింత లోతైన అవగాహనను అందిస్తున్నాయి.




## వెలుగు చూసిన ప్రాచీన శిలా స్మారకం



తీవ్రమైన కరువు ప్రభావంతో స్పెయిన్‌లోని ఒక జలాశయంలో నీటి మట్టం గణనీయంగా పడిపోయిన సందర్భంలో, దశాబ్దాలుగా నీటిలో మునిగిపోయి ఉన్న ఒక అతి ప్రాచీన శిలా స్మారకం మళ్లీ వెలుగులోకి వచ్చింది. ఇది సుమారు 7,000 సంవత్సరాలకు పూర్వ నాటిదని పురావస్తు నిపుణులు అంచనా వేస్తున్నారు. అంటే ఇది ఈజిప్టు పిరమిడ్లు, బ్రిటన్‌లోని స్టోన్‌హెంజ్ వంటి ప్రసిద్ధ నిర్మాణాల కంటే కూడా పురాతనమైన కాలానికి చెందినదని అర్థం. ఈ విషయం ప్రపంచవ్యాప్తంగా చరిత్ర పరిశోధకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ ప్రదేశంలో ఒక వరుసగా నిలబెట్టిన పెద్ద రాళ్లు ఒక నిర్దిష్ట క్రమంలో అమర్చబడి ఉండటం విశేషం. ఇది సహజంగా ఏర్పడిన రాతి నిర్మాణం కాదని, అప్పటి మానవులు ఉద్దేశపూర్వకంగా నిర్మించారని స్పష్టమవుతోంది. లిఖిత చరిత్ర లేని కాలంలోనే ఇంత సుసంపన్నమైన నిర్మాణాన్ని రూపొందించడం, ఆ సమాజంలో ఉన్న ఆలోచనా శక్తిని, సాంకేతిక అవగాహనను సూచిస్తుంది. ఇరవయ్యవ శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని జలాశయంగా అభివృద్ధి చేసినప్పుడు, ఈ పురాతన స్మారకం పూర్తిగా నీటిలో మునిగిపోయింది. అప్పటి నుంచి అనేక దశాబ్దాల పాటు అది మన కంటికి కనిపించకుండా నీటిలోనే ఉండిపోయింది. ఇప్పుడు వాతావరణ మార్పులు, దీర్ఘకాలిక కరువు పరిస్థితుల కారణంగా నీరు తగ్గడంతో, ఇది మళ్లీ మన ముందు నిలిచింది.మనం ఉపయోగిస్తున్న ఆధునిక నిర్మాణాల కింద, జలాశయాల లోతుల్లో, భూమి పొరల మధ్య ఇంకా అనేక మానవ చరిత్ర రహస్యాలు దాగి ఉండొచ్చు. సరైన సమయం వచ్చినప్పుడు అవి వెలుగులోకి వచ్చి, ప్రాచీన నాగరికతలపై మన అవగాహనను మరింత లోతుగా, విస్తృతంగా మార్చగలవు.

## 26వ డివిజన్‌లో ఓటేసిన సాబీర్ పాషా



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా తన ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. 26వ డివిజన్ పరిధిలో ఓటు ఉన్న ఆయన సింగరేణి స్కూల్లో తన ఓటు వేశారు. సిపిఐ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ అన్ని పోలింగ్ బూత్‌లసమీపంలో పార్టీ శ్రేణులకు ధైర్యాన్ని నింపుతూ ముందుకు సాగారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ వ్యాప్తంగా 36కి పైగా స్థానాల్లో సిపిఐ విజయం సాధిస్తుందని ఆశాభావాన్నివ్యక్తం చేశారు. రామవరం ఏరియాలోని పోలింగ్ బూతుల వద్ద పోలీసులు అతి ఉత్సాహాన్ని ప్రదర్శించడంతో ఆయన అసహనాన్ని వ్యక్తం చేశారు. అతేగాక ఒకానొక దశలో సిపిఐ,కాంగ్రెస్ కార్యకర్తల మధ్య పెద్ద ఎత్తున వాగ్వాదం చోటు చేసుకోవడంతోఅది తీవ్ర రూపాం దాల్చగా ఆయన తనదైన శైలిలో వ్యవహరించారు.

### సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి ఫయాజ్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** కొల్లాపూర్ మున్సిపాలిటి పదో వార్డులో యుపిఎస్ పాఠశాలలో ఏర్పాటుచేసిన 20వపోలింగ్‌బూత్‌లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ తమ కుటుంబసభ్యులతో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈసందర్భంగా



ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని ప్రతి ఎన్నికల్లో ఓట్ల పోలింగ్‌శాతం పెరగాలని తెలియజేశారు.

## సార్వత్రిక సమ్మెకు మద్దతుఇవ్వండి

### ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి

**ప్రజాపక్షం/హయత్ నగర్:** నేడు కార్మిక సంఘాలు నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు మద్దతు ఇవ్వాలని ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి కోరారు. బుధవారం ఎఐటియుసి భవన నిర్మాణ కార్మిక సంఘం హయత్నగర్ మండల కమిటీ కార్మికుల అడ్డా కన్వీనర్ శీను అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమములో 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంబంధించిన కరపత్రాన్ని ,గోడపత్రికను ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ 106 సంవత్సరాలుగా అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కోడ్ లుగా చేసి కార్మికులను బానిసలుగా చేసే చట్టాలను రద్దు చేయాలని, మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని, ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసి లో ప్రైవేటు భాగస్వామ్యాన్ని నిలిపివేయాలని న్యాయపరమైన డిమాండ్లతో నేడు జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ప్రజా సంఘాలతో పాటు రైతులు, కాంట్రాక్టర్ రంగంలో పనిచేస్తున్నటువంటి కార్మికులు భారీగా పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో హయత్ నగర్ మండల కార్యదర్శి ఎస్ శ్రీదేవి,సహాయ కార్యదర్శి మద్రి శోభన్,కార్యదర్శి కొప్పుల సరిత,డిహెచ్ పిఎస్ నియోజకవర్గ కార్యదర్శి పాల్వాయి సురేందర్, ఎఐటియుసి నాయకులు సోమయ్య గౌడ్,పుల్లయ్య, మల్లేష్‌తో పాటు ప్రజాసంఘాల నాయకులు,కార్మికులు,తదితరులు పాల్గొన్నారు.



# కార్మిక వ్యతిరేకి మోదీ సర్కార్

### నేటి కార్మిక జాతీయ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

### మాజీ చీఫ్ విప్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్



**ప్రజాపక్షం/హనుమకొండ :** నేటి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ఫిబ్రవరి 12 గురువారం దేశ వ్యాప్తంగా కార్మిక వర్గం పిలుపునిచ్చిన సమ్మెకు మద్దతుగా అన్ని కార్మిక సంఘాలతో కలిపి బుధవారం రోజున వేయి స్తంభాల దేవాలయం నుంచి కాజీపేట రైల్వే స్టేషన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కాజీపేట రైల్వే స్టేషన్ వద్ద దాస్యం వినయ్ భాస్కర్ మీడియాతో మాట్లాడుతూ నేటి జాతీయ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని అన్ని కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారు. వ్యాపార సముదాయాలు, ఫ్యాక్టరీలు, కార్మికులు, ఉద్యోగులు స్వచ్ఛందంగా బంద్ పాటించి, సమ్మెలో పాల్గొనాలని కోరారు. కేంద్రంలోని బిజెపి మోదీ సర్కారు 12 ఏళ్లలో కార్మిక లోకానికి మేలు చేయకపోగా, పూర్తిగా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు.29 కార్మిక చట్టాలను రద్దు చేసి, 4 లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాయాలని కేంద్రం యోచిస్తోందని తెలిపారు.కార్మికులకు పని తగ్గ వేతనం, వేతనం కోసం ఉద్యమం, ఉద్యమించేందుకు యూనియన్లు ఉండకుండా చేయాలనే కుట్రలను కేంద్రం నూతన కార్మిక చట్టాల రూపంలో తీసుకొచ్చిందని వివరించారు.

కార్మికులందరు హక్కులు సా ధించుకునేందుకు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్, బిఆర్‌టియు హనుమకొండ జిల్లా కన్వీనర్ నాయిని రవి, నాయకులు కాటపూర్ రాజు, రఘు, అరుణ్ కుమార్, రవి, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్, టి.ఉప్పలయ్య, బొట్ల చక్రపాణి, కారు ఉపేందర్, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు రాజేందర్, ఎఐసిటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాస రావు, ఎంఎటిఎడియు అధ్యక్షులు ఈసంపెల్లి సంజీవ, శ్రీధర్ రెడ్డి, బాబు, జయరాం, పేయింటర్ సంఘం జిల్లా అధ్యక్షులు రాజారపు రాజు, చిరు వ్యాపారుల సంఘం ఎండి ఇస్మాయిల్, టిబిఎస్ఆర్‌కెపి శివకుమార్, భిక్షపతి, రాజు, జిడబ్ల్యూఎంసి భిక్షపతి, ధర్మరాజు, రామ్మూర్తి, ప్రతాప రుద్ర ఆటో యూనియన్ నర్సింగ్, హోటల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు బాబు రావు, తదితరులు పాల్గొన్నారు.



## సార్వత్రిక బంద్‌కు మద్దతుగా జీడిమెట్లలో కార్మిక సంఘాల బైక్ ర్యాలీ

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 12న నిర్వహించనున్న సార్వత్రిక బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ, బుధవారం జీడిమెట్ల పారిశ్రామికవాడలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వివిధ పరిశ్రమలకు చెందిన కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని, పోరాడి సాదించుకున్న కార్మిక చట్టాలను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను పరిరక్షించేందుకు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు స్వామి, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఎఐటియుసి కుత్బుల్లాపూర్ అధ్యక్షుడు హరినాథరావు, నాయకులు నర్సింహారెడ్డి, మహేందర్, కె.శ్రీనివాస్, నాగయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి అశోక్, ఆంజనేయులు, కె.శీను, స్వాతి, ఐఎఫ్‌టియు నాయకులు శివబాబు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

### సమ్మెను జయప్రదం : ఏసురత్నం పిలుపు

నేడు నిర్వహించన్ను సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి మున్సిపల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసురత్నం పిలుపునిచ్చారు. బుధవారం జగద్గిరిగుట్ట లాస్ట్ బస్‌స్టాప్ సమీపంలో జీహెచ్‌ఎంసి కార్మికులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం జరుగుతున్న ఈ సమ్మెలో ప్రతీ ఒక్కరూ ఐక్యంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసి కార్మికులు, సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సిపిఐ నేత దోటి పాండరికి అంతిమ వీడ్కోలు

### పాడెమోసిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ(కనగల్) :** సిపిఐ మండల సహాయ కార్యదర్శి దోటి పాండరి అకాల మరణం జిల్లా కమ్యూనిస్టు శ్రేణుల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఉద్యమానికి అంకితమైన నాయకుడిని కోల్పోయామని పార్టీ నేతలు, కార్యకర్తలు శోకసంద్రంలో మునిగిపోయారు. బుధవారం కురంపల్లి గ్రామంలో డప్పుల చప్పుళ్లు, ఆటపాటలతో పాండరి అంత్యక్రియలు నిర్వహించగా ఆయన పాడెను సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి మోసి అంతిమ సంస్కరణ కార్యక్రమాలను దగ్గరుండి పర్యవేక్షించి అంతిమ వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా అనంతరం ఎమ్మెల్సీ నెల్లికంటి స త్యం పాండరితో తమకు ఉన్న సన్నిహిత సంబంధాలను,ఆయన ఉద్యమ జీవనాన్ని వారు గుర్తుచేసుకున్నారు. కమ్యూనిస్టు ఉద్యమ ప్రస్థానంలో భాగంగా పాండరి అనేక కేసులను ఎదుర్కొని, శిక్షలు అనుభవించి, శత్రువుల దాడులను ధైర్యంగా అధిగమించారన్నారు. జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం మగ్దుంభవన్‌లో నివసిస్తూ, పార్టీ చేపట్టిన అనేక ఉద్యమ కార్యక్రమాల్లో వయసును లెక్కచేయకుండా చురుకుగా పాల్గొన్న అంకితభావి చాటరని గుర్తు చేశారు. మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. అంత్యక్రియలో సిపిఐ రాష్ట్ర నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు,జిల్లా కార్యవర్గ సభ్యులు గురిజ రామచంద్రం, బుల్గారి నరసింహ, టి,వెంకటేశ్వర్లు,నల్పరాజు రామలింగయ్య, మండల కార్యదర్శి సత్యనారాయణ,శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య గుర్రం వెంకట్ రెడ్డి, జలసాధన సమితి నాయకులు సత్యనారాయణ, రమేష్,గిరి రమ,కురంపల్లి సర్పంచ్, కస్తాల సర్పంచ్ పార్టీ శ్రేణులు ఉన్నారు.

# ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలకు చెక్..

## ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు

### మూతపడ్డ వేలాది చిరువ్యాపారాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజధానిలో ట్రాఫిక్ నియంత్రణతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు ప్రారంభించారు. ఫుట్‌పాత్‌లపై వెలిసిన చిరు వ్యాపారులను తొలగిస్తూ పాదచారుల రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. ఫలితంగా రద్దీగా ఉండే ప్రాంతాలలో వేలాది చిరువ్యాపారాలు రెండు రోజులుగా మూతపడ్డాయి. దుకాణాల్లో ఉండాల్సిన వస్తువులు ఫుట్‌పాత్‌లపై నింపేయడం, ఫుట్‌పాత్‌లపై నడిచే పాదచారులు రోడ్డుపై నడవడం, రోడ్డుపై పోవాల్సిన వాహనాలు జనాలపైకి దూసుపోవడం హైదరాబాద్‌లో పరిపాటిగా మారింది.

రాష్ట్ర వ్యాప్తంగా అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాలను నివారించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవలే పోలీసులకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర డిజిపి బి.శివధర్‌రెడ్డి ట్రాఫిక్ నియమాలను కఠినతరం చేయాలని ఆయా జిల్లాల పోలీసు యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు.ఈ క్రమంలోనే హైదరాబాద్ పోలీసు ట్రాఫిక్ జాయింట్ పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్ రంగంలోకి దిగారు. 'ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాము' అనే బ్యానర్లను నగరంలో ట్రాఫిక్ పోలీసులు రద్దీ ప్రాంతాలలో కట్టారు. దీంతో పాటు ఫుట్‌పాత్‌లపై ఉన్న చిన్న చిన్న హోటళ్లు, టీ స్టాళ్లు, పండ్ల దుకాణాలు, పుస్తకాల దుకాణాలు, జ్యూస్ సెంటర్లు, బట్టల దుకాణాలు, చెప్పుల దుకాణాలు, ఫోటోల దుకాణాలు, దుప్పట్ల దుకాణాలు, బాసాన్ల దుకాణాలు తదితర దుకాణాలు రెండు రోజుల నుంచి మూత పడ్డాయి. వేలాది మంది చిరు వ్యాపారులు రెండు రోజులుగా దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వారి వద్ద పనిచేసే వేలాది మంది కూలీలు, కార్మికులు సైతం ఉద్యోగం లేక ఇంట్లోనే ఉంటున్నారు. వీరిరువురు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించుకుంటున్నారు.నగరంలోని ప్రధాన రహదారుల వెంట ఉన్న ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడం వల్ల పాదచారులు రోడ్డుపై నడవాల్సి వస్తోందని, దీంతో ప్రమాదాల ముప్పు పెరుగుతోందని ట్రాఫిక్ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పలు ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. అదే సమయంలో ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలకు పూనుకుంటామని హెచ్చరికతో బ్యానర్లు ఏర్పాటు చేశారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. పాదచారుల భద్రతే తమ లక్ష్యమని, నగరంలో ట్రాఫిక్ క్రమశిక్షణ పాటించాలంటే ప్రతి ఒక్కరూ సహకరించాలని అధికారులు కోరారు. రోడ్లపై అక్రమ పార్కింగ్, ఫుట్‌పాత్ ఆక్రమణలు, అనుమతి లేకుండా వ్యాపారాలు నిర్వహించడం వంటి అంశాలపై నిరంతర తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. ఈ చర్యలపై కొంతమంది చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నప్పటికీ, ప్రజల భద్రత దృష్ట్యా తీసుకున్న నిర్ణయమని పోలీసులు పేర్కొన్నారు. నగరంలో సురక్షిత రాకపోకల కోసం పౌరులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఫుట్‌పాత్‌లపై చిరువ్యాపారాలను తొలగించడంతో పాదచారులు ఊపిరిపీల్చుకుంటున్నారు. ఇదే పద్ధతిని నిరంతరం కొనసాగించాలని వారు కోరుతున్నారు.

## నిరుపేదల పక్షాన పోరాడుతున్నది భారత కమ్యూనిస్టు పార్టీ ఒక్కటే

### సిపిఐ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** నిరుపేదల పక్షాన పోరాడుతున్నది భారత కమ్యూనిస్టు పార్టీ ఒక్కటేనని సిపిఐ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్ అన్నారు. కాచవాని సింగారం గ్రామంలో సర్వే నెంబర్ 66 లో మహేశ్వరి నగర్ ఎర్రక్వార్టర్స్ వద్ద ఒక నిరుపేద కుటుంబం గత 30 సంవత్సరాల నుండి ఇల్లును నిర్మించుకొని నివసిస్తున్న ఆ ఇంటిని భాస్కర్ గౌడ్ అనే భూ కబ్జాదారుడు 50 మంది హిజ్రాలతో వచ్చి ఇంట్లో ఉన్న సామాన్లు, బియ్యం, బట్టలు రోడ్డుపై పడేసి ఇంటిని కూల్చివేసిన సంఘటన కాచవాని సింగారంలో చోటు చేసుకుంది. సిపిఐ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్, సయ్యద్ ఖదీర్‌లు బుధవారం నిరుపేద కుటుంబాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా లొట్టి ఈశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వం చర్యలు తీసుకొని భాస్కర్ గౌడ్‌ని అరెస్టు చేయాలని సిపిఐ నాయకులు కోరారు.

## వినాయకనగర్ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దా

### తాజా మాజీ కార్పొరేటర్ క్యాసం రాజ్యలక్ష్మి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ఐదేళ్ల కాలంలో కార్పొరేటర్‌గా రూ. 65 కోట్ల నిధులతో డివిజన్‌లో అభివృద్ధి పనులు చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దానని వినాయకనగర్ తాజా మాజీ కార్పొరేటర్ క్యాసం రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. కార్పొరేటర్‌గా పదవీకాలం పూర్తి చేసుకొన్న ఆమె బుధవారం డివిజన్‌లో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. వెనుక బడిన ప్రాంతంగా, వరద ముంపు ప్రాంతాలుగా ఉన్న డివిజన్‌లో ప్రభుత్వ శాఖాధికారులు, ఎమ్మెల్యే, ఎంపిల సహకారంతో ముందుకు తీసుకొని వెళ్లానన్నారు. గతంలో చిన్నపాటి వర్షానికే వరద నీరు ఇళ్లల్లో చేరుకొనే పరిస్థితిని చక్కదిద్దేందుకు గాను డివిజన్‌లో 19 స్ట్రామ్ వాటర్ డ్రయిన్లు ఏర్పాటు చేసి సమస్య పునరావృతం కాకుండా చూసానన్నారు.

దీనదయాళ్‌నగర్, కాకతీయనగర్, జెకె కాలనీ, రేణుకానగర్,శివనగర్, వినోభానగర్, చంద్రగిరి కాలనీ, వినాయకనగర్ బస్తీ, ఈస్ట్ ఆనంద్‌బాగ్ ప్రాంతాల్లో స్టోర్మ వాటర్ డ్రైన్లు, నిర్మించటం, నాలాలు డిసిల్లింగ్ చేయటం ద్వారా వరద నుండి ఉపశమనం లభించిందన్నారు. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో 80 శాతం రోడ్లు, 60 శాతం భూగర్భ డ్రైనేజి పనులు పూర్తి చేసానన్నారు నీటి విడుదలను క్రమబద్ధీకరించటం, కాలుష్యాన్ని తగ్గించటానికి నీటి పైపు లైన్ మార్చటం, నీటి ప్రెషర్ పెంచటం ద్వారా మంచి నీటి సరఫరా మెరుగుపరచానన్నారు. విద్యుత్ పనుల్లో భాగంగా సింగిల్ ఫేజ్ నుండి 3 ఫేజ్‌కు మార్చటంతో పాటు కొత్త విద్యుత్ స్థంభాలు ఏర్పాటయ్యాయన్నారు. బండచెరువులోకి ప్రవేశిస్తున్న డ్రైనేజి నీటిని రూ. 2.4 కోట్ల బడ్జెట్‌తో ఆర్‌సిసి పైపు లైన్ ద్వారా లాలాపేట ప్రధాన లైన్‌కు మళ్లించామన్నారు. ఇక ముందు కూడా తాను ప్రజా కార్యక్రమాల్లో నిమగ్నమై అందుబాటులో ఉంటానన్నారు.



## నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి రైల్వే స్టేషన్ ఆటోస్టాండ్ ఆటో డ్రైవర్ నిజాయితీని చాటుకున్నాడు. మంగళవారం రాత్రి ఒక ప్రయాణీకుడు వరంగల్ నుండి చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేసి దిగాడు. రైల్వే స్టేషన్ నుండి మౌలాలీ హెచ్‌బి కాలనీకి చెందిన ఓ వ్యక్తి ఆటోలో వెళ్లాడు. ఆటోలోనే తన బ్యాగును మరచిపోయిన ప్రయాణీకుడు బుధవారం ఉదయం చర్లపల్లి పోలీస్ స్టేషన్ పోలీసుల సమక్షంలో అప్పగించాడు. ఆటో డ్రైవర్ అజ్జు నిజాయితీ మెచ్చుకుని కృతజ్ఞతలు తెలిపి ప్రతి ఒక్క డ్రైవర్ ఇలాగే నిజాయితీగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది చక్రపాణిరెడ్డి, బిఎంఎస్ ఆటో యూనియన్ నాయకులు, ఆటో గిరి, కేశవులు, కాశీమ్, తదితరులు పాల్గొన్నారు.



## ఆచూకీ దొరికింది.. అమ్మాయిలు క్షేమం

### జీడిమెట్ల పోలీసుల తక్షణ స్పందన

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** తండ్రి మందలించాడనే కారణంగా ఇంటి నుంచి వెళ్లిపోయిన అక్కా చెల్లెళ్లను (21), (14) జీడిమెట్ల పోలీసులు గుర్తించి క్షేమంగా వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. జీడిమెట్ల ఇన్స్‌పెక్టర్ గడ్డం మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం అర్థరాత్రి ఒంటి గంట సమయంలో ఇద్దరు అమ్మాయిలు ఇంటి నుంచి వెళ్లిపోయారని వారి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సాంకేతిక ఆధారాల సాయంతో ఆర్టీసి బస్సుల వివరాల ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టారు. విజయవాడ సమీపంలో వీరి ఆచూకీని గుర్తించి వారిని సురక్షితం గా తల్లిదండ్రులకు అప్పగించారు. పిల్లలను క్షేమంగా తిరిగి ఇంటికి చేర్చినందుకు జీడిమెట్ల పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## కీసరగుట్ట తైబజార్‌కు నేడు వేలం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** జిహెచ్‌ఎంసి కీసర సర్కిల్‌లోని కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల జాతర సందర్భంగా తేది 13 నుండి 18 వరకు జరిగే ఉత్సవాలకు కీసర గుట్ట వద్ద ఏర్పాటు చేసే దుకాణదారుల నుండి తైబజార్ ఫీజు వసూలు చేయుటకు జిహెచ్‌ఎంసి కీసర సర్కిల్ కార్యాలయం వేలం 12వ తేదీ 11 గంటలకు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద నిర్వహించబడును. తైబజార్ వేలం దరఖాస్తు రుసుము వెయ్యి రూపాయల చెల్లించి 8 గంటల నుండి 11 గంటల వరకు కమిషనర్ జిహెచ్‌ఎంసి పేర డిడిని చెల్లించి దరఖాస్తు ఫారం పొందగలరు. వేలంలో పాల్గొనే వారు పాట పాడుటకు 51 వేల రూపాయల డిడిని చెల్లించి వేలంలో పాల్గొనవలసిందిగా డిప్యూటీ కమిషనర్ వసంత తెలిపారు.

## ప్రమాణాలతో కూడిన విద్య అందిస్తాం

### కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్



**ప్రజాపక్షం/కంటోన్మెంట్:** ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలతో కూడిన విద్య అందించడం లక్ష్యంగా పనిచేస్తున్నామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ స్పష్టం చేశారు. ఈ మేరకు అధికారులు, ప్రధానోపాధ్యాయులతో బొలంరాయిలో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖ లు మార్చేందుకు, నిధులను అందించేందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కోరారు.

## 19న భూపతి చంద్ర స్మారక కథానికల పోటీ పురస్కారాల ప్రదానోత్సవం

**ప్రజాపక్షం/సోమాజిగూడ :** భూపతి చంద్ర స్మారక కథానికల పోటీ – 2026 పురస్కారాల ప్రదానోత్సవ సభ ఈ నెల 19న సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ అబిడ్స్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తు కళామందిరంలో నిర్వహించనున్నట్టు అధ్యక్షులు ఎం.ఎల్.కాంతారావు తెలిపారు. ఈ సందర్భంగా సుంకోజి దేవేంద్రాచారి (ప్రథమ బహుమతి – అంతర్థానం),పొత్తూరి సీతారామరాజు ( ద్వితీయ బహుమతి – పులి నెత్తుటి ముగ్గు), పుప్పాల కృష్ణమూర్తి (తృతీయ బహుమతి – కన్నీట వసంతం), ప్రోత్సాహక బహుమతులు డాక్టర్ ఎం.సుగుణరావు (ఒక కొడుకు తీర్పు), చొక్కర తాతారావు (ఇచ్చోటనే కద), మొయిద శ్రీనివాసరావు (అంబటి తట్ట), ఉయ్యూరు అనసూయ (రెండో కోణం), మధుసూదనరావు (కర్టెన్)లకు ప్రదానం చేస్తామని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## తరగతి గదిలోనే విద్యార్థిపై దాడి

**ప్రజాపక్షం/కార్వాన్:** తరగతి గదిలో క్లాస్ టీచర్ లేకపోవడంతో ఓ విద్యార్థి తోటి విద్యార్థిపై దాడికి పాల్పడిన ఘటన జియాగూడ జోషిగల్లిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే... దుర్గానగర్‌కు చెందిన బాలుడు జోషిగల్లిలోని కృష్ణవేణి టాలెంట్ హైస్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. క్లాస్‌లో టీచర్ లేకపోవడంతో చిన్నగా తలెత్తిన వివాదం కారణంగా ఓ బాలుడు తోటి విద్యార్థి దాడి చేయడంతో తలకు బలమైన గాయమయ్యింది. ఈ విషయంపై ప్రశ్నిస్తే స్కూల్ యాజమాన్యం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించిందని బాధితుడి తల్లిదండ్రులు వాపోయారు. ఈ విషయంలో విద్యాశాఖ అధికారులు జోక్యం చేసుకుని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు.

## మూడుచింతలపల్లిలో 89.07%

* రికార్డుస్థాయిలో పోలింగ్
* ఉత్సాహంగా కదలి వచ్చిన యువత, వృద్ధులు
* వీల్‌చైర్‌లో వచ్చి ఓటు వేసిన 102 ఏళ్ల దాసరి ఎల్లమ్మ



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పురపాలిక ఎన్నికల్లో భాగంగా బుధవారం నాటి పోలింగ్‌లో మేడ్చల్ జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లోనూ ఓటర్లు ఉత్సాహంగా కదలి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకొన్నారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలో 102 ఏళ్ల వయస్సున్న దాసరి ఎల్లమ్మ అనే వృద్ధురాలు వీల్‌చైర్‌లో వచ్చి మరీ తమ ఓటు హక్కును వినియోగించుకొని ఆదర్శంగా నిలిచింది. గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలకు భిన్నంగా ఈ ఎన్నిక ల్లో అన్నింటిలోనూ రికార్డు స్థాయిలో ఓటింగ్ శాతం నమోదైంది. మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలో ఏకంగా పోలింగ్ 89.07% గా అధికం గా నమోదైంది. ఉదయం పోలింగ్ ప్రారంభమైనప్పటి దాదాపు అన్ని పోలింగ్ బూత్‌లలోనూ ఓటర్లు పెద్ద సంఖ్యలో చేరుకొంటూ మధ్యాహ్నం 3 గంటలయ్యే సరికి ఆలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 71.35%, మూడుచింతలపల్లి మున్సిపాలిటీలో 77.92%, ఎల్లంపేట మున్సిపాలిటి పరిధిలో 72.9%గా నమోదు కాగా సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసేటప్పటికి వరుసగా ఈ మున్సిపాలిటీ పరిధు ల్లో 79.62%, 89.07%, 83.27% నమో దైంది. అన్ని పోలింగ్ బూత్‌ల్లోనూ కొత్తగా నమోదు చేసుకొన్న యువ ఓటర్లతో సహా వృద్ధులు సైతం తమ హక్కును వినియోగించుకొన్నారు. పోలింగ్ సరళిని జిల్లా కలెక్టర్ మనుచౌదరి, ఎన్నికల పరిశీలకులు నిర్మల కాంతి వెస్లీ తో కల్సి పరిశీలించారు. ఓటింగ్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశా రు. సమస్యాత్మక పోలింగ్ బూత్‌లలో లైవ్ వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసి జిల్లా ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు తమ కార్యాలయాల నుండి ఎప్పటికప్పుడు పరిస్థితులను పరిశీలించా రు.





**వికారాబాద్‌లో:** జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. వికారాబాద్ జిల్లాలో నాలుగు మున్సిపల్‌ల్లో 71.82శాతం పోలింగ్ నమోదు చేయడం జరిగింది. వికారాబాద్ మున్సిపల్‌లో 74.35 ,తాండూర్ 67.54 , పరిగి77.10,కొడంగల్ 75.81శాతం నమోదు అయిందని తెలిపారు. జిల్లాలో ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముగియడంతో అధికారులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ వెబ్ క్యాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పర్యావేక్షించారు. జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా పలు వార్డులను పర్యవేక్షించారు.



## ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికలు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి, అలియాబాద్ మున్సిపల్ ఎన్నికలు బుధవారం ప్రశాంతం గా ముగిశాయి. మూడుచింతలపల్లి మున్సిపాలిటిలో 24 వార్డులు, అలియాబాద్‌లో 20 వార్డులకు గాను ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపిల పార్టీలతో పాటు ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు బరిలో దిగారు. మూడు చింతలపల్లి మున్సిపల్‌లో 24 వార్డుల్లో 48 పోలింగ్ స్టేషన్ లను ఏర్పాటు చేశారు. ఇందులో పురుషులు 11,430, మహిళలు 11,401 మొత్తం 22,831 ఓటర్లు ఉన్నారు. కాగా ఇందులో 8531 పురుషులు 9258 మహిళలు మొత్తం 17,789 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



77.92 ఓటింగ్ శాతం నమోదైందని మూడుచింతలపల్లి మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్ తెలిపారు. ఉదయం నుంచే మున్సిపల్‌లోని వివిద వార్డుల్లోని ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జవహర్‌నగర్ ఎసిపి చక్రపాణి ఆధ్వర్యంలో శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ గట్టి పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**అలియాబాద్ మున్సిపల్‌లో..**
కాగా అలియాబాద్ మున్సిపాలిటిలో మొత్తం 20 వార్డులకు గాను 40 పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేశారు. పురుషులు 10,336 మహిళలు 10,115 ఇతరులు 3, మొత్తం 20,454 ఉండగా 8076 పురుషులు, 8210 మహిళలు మొత్తం 16,286 ఓట్లు పోలయ్యాయి. 79.62 ఓటు శాతం నమోదైందని అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ తెలిపారు.

## క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** హకీంపేటలోని తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలో 202627 విద్యాసంవత్సరానికి నాలుగవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ ఛైర్మన్, ఎండి ఎ.సోనీబాలదేవి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన ప్రతిభావంతులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 26 నుండి మార్చి 4వతేది మధ్యలో సంబంధిత వెబ్‌సైట్ ద్వారా దరశాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశం కోసం మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో 9 మోటార్ క్వాలిటీ పరీక్షలు, రాష్ట్ర స్థాయిలో మెడికల్ పరీక్షలు నిర్వహించబడతాయన్నారు విధ్యార్థులు 2017సంవత్సరం సెప్టెంబరు ఒకటో తేది నుంచి 2018 సంవత్సరం ఆగష్టు 31వ తేదీ మధ్య పుట్టిన వారు అర్హులని ఆమె పేర్కొన్నారు.

## లైంగిక వేధింపుల నిరోధక చట్టం అమలు చేయాలి

### సంక్షేమ శాఖ అధికారి అక్కేశ్వర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ :** మహిళా ఉద్యోగులకు పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం(2013) అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారని జిల్లా సంక్షమశాఖాధికారి అక్కేశ్వర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చట్టం ప్రకారం పది మంది లేదా అంతకంటే ఎక్కువ ఉద్యోగుల ఉన్న ప్రతి కార్యాలయంలో లైంగిక వేధింపుల ఫిర్యాదులను పరిష్కరించడారినికి ఒక అంతర్గత కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ కమిటీలో ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా ఆ కార్యాలయంలోని సీనియర్ ఉద్యోగితో పాటు సభ్యులు ఉంటారని చెప్పారు. లీగల్ కౌన్సిలర్‌గా మహిళా సంబంధిత చట్టాలలో అనుభవం ఉన్న న్యాయవాది పని చేస్తారని ఆయన పేర్కొన్నారు.

## చెదురు మదురు ఘటనలు మినహా తాండూరులో 67.54%

### ఓటుహక్కును వినియోగించుకున్న ప్రభుత్వ చీఫ్ విఫ్, ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/తాండూరు:** మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. తాండూరు మున్సిపల్‌లో 36వార్డులకు గాను 117 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. బుధవారం జరిగిన మున్సిపల్ ఎన్నికలలో యువత, వృద్ధులు, ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. చెదురు మదురు ఘటనలు మినహా ఎక్కడ హడావిడి లేకుండా ప్రశాంతంగా ఉదయం 7గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తాండూరులో 67.54శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. పట్టణంలో 77,029 మంది ఓటర్లకు గాను 52,025మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో మహిళా ఓటర్లు 26,534 మంది, పురుషులు 25,488మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయడంతో ఎక్కడ ఇబ్బంది లేకుండా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంతో పోలింగ్ సరళిని అధికారులు పర్యవేక్షించారు. డిఆర్‌ఒ మంగిలాల్ ఎన్నికల సరళిని పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తును నిర్వహించినట్లు డిఎస్పీ నర్సింగ్ యాదయ్య తెలిపారు.

మున్సిపల్ ఎన్నికలలో ప్రభుత్వ చీఫ్‌విఫ్ ఎంఎల్‌ఎసి పట్నం మహేందర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిలు తాండూరులో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన బూత్ నంబర్ 28లో ప్రభుత్వ చీఫ్‌విఫ్ పట్నం మహేందర్ రెడ్డి, తన కుమారుడు పట్నం రినీష్‌రెడ్డిలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 12వ వార్డులోని కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన బూత్ నంబర్ 48లో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.



## గత ఐదేళ్లలో సంతృప్తిగా అభివృద్ధి చేసా..

### తాజా మాజీ నేరేడ్‌మెట్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** కార్పొరేటర్‌గా గత ఐదేళ్ల కాలంలో డివిజన్‌లోని అన్ని ప్రాంతవాసులకు మౌలిక వసతులు కల్పించటంతో పాటు రూ.168 కోట్ల నిధులతో అనేక అభివృద్ధి పనులు సంతృప్తికరంగా చేయగలిగానని నేరేడ్‌మెట్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా అన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా ఎమ్మెల్యే, ఎంపిలతో పాటు వివిధ ప్రభుత్వ విభాగ అధికారులు, సిబ్బంది సహకారంతో పనులు పూర్తయ్యాయని, తన పదవీకాలం ముగిసినప్పటికీ ఎప్పటిలాగే ప్రజాసేవలో అందుబాటులో ఉంటానన్నారు. జిహెచ్‌ఎంసి పాలకమండలి సభ్యురాలిగా పదవీకాలం పూర్తయిన నేపథ్యంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డివిజన్‌లో సాధించిన ప్రగతి విశేషాలను వివరించారు. రూ.108 కోట్ల నిధులతో రోడ్లు, డ్రైనేజిలు, థీమ్ పార్కులు, కమ్యూనిటీ హాళ్లు, శ్మశానవాటికలు, వీధి దీపాలు, మంచి నీటి సరఫరా లాంటి మౌలిక సదుపాయాల సంబంధించి పనులు చేసానన్నారు. యాప్రాల్ నాగిరెడ్డి చెరువు నుండి కాప్రా చెరువు వరకు రూ. 43 కోట్లు, ఎంప్లాయిస్ కాలనీలో రూ.6కోట్లు, ఆందాల్ హోమ్స్‌లో రూ.2కోట్లు, బ్యాంక్ కాలనీలో రూ.3 కోట్లతో బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులు చేసానన్నారు. ఆర్‌కె పురం చెరువు సుందరీకరణకు రూ.6కోట్లు, నేరేడ్‌మెట్ ఫుట్ ఓవర్ బ్రిడ్జికి రూ.కోటి వెచ్చించామన్నారు. ప్రజా భద్రత కోసం రూ.30లక్షలతో సిసి కెమెరాలు ఏర్పాటుచేసి నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానం చేసామన్నారు. మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ సహకారంతో ఎంపి నిధులకు గాను రూ.4.16కోట్ల మంజూరుతో పనులు పూర్తయ్యాయన్నారు. అమ్ముగూడ శ్మశానవాటిక అభివృద్ధి, కాలనీల్లో కొత్త బోర్‌వెల్స్, సిసి రోడ్డు పనులు, డ్రైనేజి పనులు వీటిలో ఉన్నాయన్నారు.



## బోరు మరమ్మతుకు ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** శ్మశాన వాటికలో పాడైపోయిన బోరుకు నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మరమ్మతులు చేయించారు. జిహెచ్‌ఎంసి పరిధిలోని నాగారం డివిజన్ పరిధిలోని నాగారం శ్మశాన వాటికలో గత 15 రోజుల క్రితం బోరు కాలిపోవడంతో మూడవ రోజు కర్మ, దశదిన కర్మలకు ఇబ్బందులు పడుతున్నా జిహెచ్‌ఎంసి అధికారులు పట్టించుకోకపోవడంతో విషయం తెలుసుకున్న నాగారం మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి 20 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేసి బోరుకు మరమ్మతులు చేయించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నక్క కిషోర్‌గౌడ్, రాజుగౌడ్, ముద్రగణం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్‌లో అత్యధికంగా 84.8%

- షాద్‌నగర్‌లో అత్యల్పంగా 76.24 శాతం పోలింగ్ నమోదు
- రంగారెడ్డిలోని ఆరు మున్సిపాలిటీల్లో 36,979 మంది ఓటింగ్‌కు దూరం..
- ఆమనగల్లోని ముర్తుజపల్లి పోలింగ్ కేంద్రంలోని పైకప్పు పెచ్చులూడిపడి మహిళా ఓటరుకు గాయాలు



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లాలో చెదురు మదురు ఘటనలు మినహా మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. బుధవారం ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియ...సాయంత్రం ఐదు గంటలకు ముగిసింది. పోలింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. చేవెళ్ల,మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి సహా ఫ్యూచర్‌సిటీ పోలీసు కమిషనర్ జి సుధీర్‌బాబు లు సందర్శించగా, శంకర్‌పల్లి పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల సాధారణ పరి శీలకుడు మయాంక్ మిట్టల్ సందర్శించారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో జిల్లా ఎన్నికల అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల పరిధిలో 126 వార్డులు ఉండగా, వీటిలో 274 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1,76,023 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 1,39,044 మంది(78.99 శాతం)తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 68,725 మంది పురుషులు ఉండగా, 70,318 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మరో 36,979 మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో భద్రంగా ఉంది. పోలింగ్ సిబ్బంది ఆయా బ్యాలెట్ బాక్సులను ఏజెంట్ల సమక్షంలోనే సీజ్ చేసి, పోలీసు భద్రత మధ్య ఎంపిక చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించారు. మొదట్లో మందకొండిగా సాగిన ఓటింగ్... మధ్యాహ్నం ఒక్కసారిగా ఊపందుకుంది. ఉదయం తొమ్మిది గంటల వరకు 11.74 శాతం ఓటింగ్ మాత్రమే నమోదైంది. రాత్రి ఏడు గంటల వరకు 78.99 శాతం పోలింగ్ నమోదైంది.ఇదిలా ఉంటే ఓటు హ క్కును వినియోగించుకున్న వారిలో 78.56 శాతం మంది పురుషులు ఉండగా, 79.42 శాతం మంది మహిళలు ఉన్నారు. యువతీ, యువకులు ఉత్సాహంగా ఓటు వేశారు. వృద్ధులు, వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడు తూ మంచానికే పరిమితమైన బాధితులను వీల్‌చైర్లలో తీసుకొచ్చి ఓటు వేయించారు.

### పెచ్చులూడి పడి ఓటరుకు గాయాలు

ఇదిలా ఉంటే తనకు అనుకూలంగా ప్రచారం చేయలేదనే కోపంతో షాద్‌నగర్ మున్సిపాలిటీ 27వ వార్డులో నివాసం ఉంటున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ మహిళ ఇంట్లోకి ప్రతిపక్ష పార్టీ నేతలు చొరబడి ఆమెతో ఘర్షణ కు దిగారు. అదే విధంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆమనగల్ మున్సిపాలిటీ ముర్తుజపల్లి పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఓ మహిళా ఓటరుపై పైకప్పు పెచ్చులూడిపడటంతో ఆమె తలకు తీవ్ర గాయమైంది. అక్కడే ఉన్న వైద్య సిబ్బంది ఆమె తలకు కట్టుకట్టి ఆస్పత్రికి పంపారు. ఇక ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శేరిగూడ 15వ వార్డుకు చెందిన క్యామ పారిజాత తన ఓటును వేరే వాళ్లు వేశారని ఆరోపించారు.

### బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవితవ్యం

ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా పూర్తి కావడంతో జిల్లా ఎన్నికల అధికారులు కౌటింగ్ కేంద్రాలపై దృష్టి సారించారు. ఆమనగల్ మున్సిపాలిటీ వార్డుల్లోని బ్యాలెట్ బాక్సులను బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్లోని స్ట్రాంగ్ రూమ్‌కు తర లించారు. ఇక చేవెళ్ల మున్సిపాలిటీలోని బ్యాలెట్ బాక్సులను అదే ప్రాంతంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ భవనంలో భద్రపరిచారు. ఇక ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని బ్యాలెట్ బాక్సులను శేరిగూడలోని శ్రీ ఇందు ఇంజనీరింగ్ కాలేజీలో భద్రపరిచారు. మొయినాబాద్ మున్సిపాలిటీలోని బ్యాలెట్ బాక్సులను మ్యాక్ ఫార్మాసీ కాలేజీలో, షాద్‌నగర్ మున్సిపాలిటీ బ్యాలెట్ పేపర్ బాక్సులను మిని స్టేడియంలో, శంకర్‌పల్లి మున్సిపాలిటీ బ్యాలెట్ బాక్సులను టీఎస్ మోడల్ స్కూల్ భవనంలో భద్రపరిచారు.

**రేపే ఓట్ల లెక్కింపు**


ఇక 13న అదే కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగనుంది. ఇందుకోసం 64 కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. అత్యధికంగా షాద్‌నగర్‌లో 14 ఏర్పాటు చేయగా, అత్యల్పంగా ఆమనగల్‌లో 5 సిద్ధం చేశారు. ఒక్కో టేబుల్‌కు సగటున నలుగురు చొప్పున మొత్తం 254 మందిని ఓట్ల లెక్కింపు కోసం నియమించారు. మధ్యాహ్నం రెండు గంటల్లోగా లెక్కింపు ప్రక్రియ పూర్తి చేసి, పూర్తి ఫలితాలను వెల్లడించాలనే కృతనిశ్చయంతో జిల్లా ఎన్నికల అధికారులు ఉన్నారు. 16న చైర్మన్, వైస్ చైర్మన్ల ఎంపిక ఉంటుంది. ఇందుకోసం ఒక్కో మున్సిపాలిటీకి ఒక్కో అధికారిని ఇంఛార్జీగా నియమించారు. ఫలితాలు వెల్లడైన వెంటనే వీరు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.

## పోలింగ్ నిర్వహణ, ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు జరగకుండా, తప్పిదాలకు తవ్వివకుండా, సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం రంగారెడ్డి జిల్లాలో 6 మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికలు నిర్వహిస్తున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి చేవెళ్ళ మండలంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ నిర్వహణను, ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. పోలింగ్ స్టేషన్ ఆవరణలో పోటీ చేయు వార్డు సభ్యుల జాబితాను పరిశీలించారు.ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం ఎప్పటికప్పుడు నిర్దేశిత ఫార్మాట్లో నమోదు చేయాలనీ సంబంధిత రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితాలో ఓటర్ల క్రమ సంఖ్య సరి చూసుకొని ఓటింగ్ ప్రక్రియను నిర్వహించాలని ప్రిసైడింగ్ అధికారులకు సూచించారు. పోలింగ్ ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి చిన్న పొరపాట్లుకు తావ్వివకుండా సజావుగా నిర్వహించాలన్నారు. సాయంత్రం 5 గంటల లోపు పోలింగ్ కేంద్రం ఆవరణలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న వారందరికీ ఓటు సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. 5 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రం గేటు లోపలికి ఎవ్వరిని అనుమతించకూడదనీ, ఎలాంటి తప్పిదాలకు తావ్వివకుండా ప్రశాంతగా చేపట్టాలని కలెక్టర్ పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఎన్నికల అధికారులను ఆదేశించారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు డిసిపి సిహెచ్ శిరీష తెలిపారు. బుధవారం మున్సిపాలిటిలోని సమస్యాత్మకంగా ఉన్న 8పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పర్యవేక్షించారు. స్థానిక ఏసిపి లక్ష్మీ నారాయణ, సిఐ విజయ్‌కుమార్‌లతో కలిసి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో డిసిపి శిరీష మాట్లాడుతూ షాద్‌నగర్ మున్సిపాలిటీలోని 28వార్డులో 8 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకంగా ఉన్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 28వార్డుల్లో ఏర్పాటు చేసి 76 పోలింగ్ కేంద్రాలకు 350 మంది పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయని, ఎలాంటి ఘటనలు చోటు చేసుకొకుండా అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లు క్యూలైన్లలో ఉండటాన్ని చూసి తగిన సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు. ఉదయం సమయంలోనే ఓటర్లు ఎక్కువగా పోలింగ్ కేంద్రాలకు వచ్చారని, మధ్యాహ్నం తరువాత మందకొడిగా పోలింగ్ జరిగిందని వివరించారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకొకుండా ప్రశాంత వాతావరణంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌ను పూర్తి చేశామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల నుండి బ్యాలెట్ బాక్స్‌లను స్ట్రాంగ్ రూంకు తరలించి గట్టి బందోబస్తును ఏర్పాటు చేశామని వివరించారు. ఈనెల 13వ తేదిన ఓట్ల లెక్కింపు ఉంటుందని పేర్కొన్నారు.

## మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి




**ప్రజాపక్షం/కొందుర్గు:** పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి రక్షించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కొందుర్గు ఎంపిడిఓ లక్ష్మీ అనురాధ సూచించారు బుధవారం మండల కేంద్రంలో సర్పంచ్ చౌడపురం ప్రభాకర్, ఉప సర్పంచ్ చిప్ప చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్లాంటేషర్ చేపట్టేందుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ లక్ష్మీ అనురాధ మాట్లాడుతూ హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను గుర్తించేందుకు ప్రజాప్రతినిధులు సహాకరించాలని పేర్కొన్నారు. సమాజంలో పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి రక్షించేందుకు కృషి చేయాలని సూచించారు. భవిష్యత్‌లో పచ్చదనం పెంపోంధించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, గ్రామాన్ని హరితమయం చేసేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేఖ, టెక్నికల్ అసిస్టెంట్ మహేందర్‌లు పాల్గొన్నారు.

## చెరువులో పడి యువకుడు గల్లంతు

### గాలింపు చేపట్టిన రెస్క్యూటీం, గజ ఈతగాళ్ళు

**ప్రజాపక్షం/కొత్తూరు:** చెరువులో పడి యువకుడు గల్లంతు కావడంతో రెస్క్యూటీం, గజ ఈతగాళ్ళు గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం నందిగామ మండలం రంగాపూర్ గ్రామ శివారులో ఉన్న మల్లన్న చెరువులో యువకుడి కోసం గజ ఈతగాళ్ళు, రెస్క్యూటీం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. చాకలిదానిగుట్టా తండాకు చెందిన మూడావత్ భాస్కర్ (25) అనే యువకుడు మంగళవారం మధ్యాహ్నం నుండి కనిపించకుండా పోయాడని, యువకుడి తల్లి చుట్టు పక్కల వెతుకడంతో రంగాపూర్ గ్రామ శివారులోకి మల్లన్న చెరుకు కట్టపై భాస్కర్ బట్టలు, చెప్పులు, వాహనం ఉండటంచ అక్కడే సెల్‌ఫోన్ కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించి వివరాలను సేకరించడంతోపాటు రెస్క్యూటీం, గజ ఈతగాళ్ళను రప్పించి గాలింపు చేపట్టారు. చాకలిదానిగుట్ట తండా సర్పంచ్ గబ్రు చౌహాన్, రంగాపూర్ సర్పంచ్ గోవు అంజమ్మ కుమారుడు రవికుమార్‌తోపాటు గ్రామస్తులు పోలీసులకు సహాకరిస్తున్నారు. చెరువులో గల్లంతయిన భాస్కర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తండా వాసులు తెలిపారు. దాంతో చెరువు వద్ద కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.



## రాంకీ ఒప్పందాన్ని రద్దు చేయాలి : ఊదరి గోపాల్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (జిహెచ్‌ఎంఇయు) డైరీ, నూతన సంవత్సర 2026 క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. యూనియన్ అధ్యక్షులు ఉదరి గోపాల్, ప్రధాన కార్యదర్శి డి. నర్సింగ్ రావు, అమరేశ్వర్ చేతుల మీదుగా ఈ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. అతి స్వల్పకాలంలోనే జిహెచ్‌ఎంసిలో పరిపాలనా సౌలభ్యం కోసం 3 కార్పొరేషన్లు, 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 డివిజన్లను ఏర్పాటు చేసినందుకు గాను కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌ను యూనియన్ తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్‌కి జ్ఞాపికగా ఫొటో ఫ్రేమ్‌ను బహూకరించి సత్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు ఊదరి గోపాల్ మాట్లాడుతూ గతంలో ఎన్నో 'క్లీన్ అండ్ గ్రీన్' అవార్డులను అందుకున్న హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్, ప్రస్తుతం రాంకీ సంస్థ వల్ల చెత్త హైదరాబాద్ నగరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాంకీ సంస్థ కాంట్రాక్టును రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పర్మనెంట్ ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీనే జీతాలు మంజూరు చేయాలని కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి డి. నర్సింగ్ రావు, కె. అమరేశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ. జబ్బార్, బి. కన్నా, వైస్ ప్రెసిడెంట్లు జి. నర్సింగ్ రావు, తదితరులు ఉన్నారు.

## మూడో రోజు ఘనంగా జిల్లా స్థాయి సిఎంకప్ పోటీలు




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా స్థాయి సిఎం కప్ 2025–26 పోటీలు బుధవారం సరూర్ నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో మూడవ రోజు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలలో కబడ్డీ,కిక్ బాక్సింగ్, చెస్, యోగా, వుషు, సైక్లింగ్, జిమ్నాస్టిక్స్ విభాగాలలో క్రీడలు నిర్వహించబడినవి.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల నుండి 1500 మందికి పైగా క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీలలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మెరిట్ సర్టిఫికెట్లు,పతకాలు ప్రదానం చేయబడినవి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్.బి.నగర్ జోన్ అదనపు డిసిపి కోటేశ్వర్ రావు,కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ జగదీశ్వర్ యాదవ్ , ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లా రెడ్డి, జిల్లా యువజన సర్వీసులు,క్రీడా ల శాఖ అధికారి(డీవైఎస్ఓ), ఎర్రబెల్లి వెంకటేశ్వర్ రావు,ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శులు మనోహర్,రవి కుమార్, సుధాకర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంఎస్‌జీఎఫ్ కార్యదర్శి రాఘవ రెడ్డి,రామచంద్రుడు, షబీర్, బాబయ్య,జిల్లా కోచ్‌లు, ఫిజికల్ డైరెక్టర్లు హాజరై కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అందరి సమన్వయం మరియు కృషితో ఈ పోటీలు అత్యంత విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన జట్లు మరియు క్రీడాకారులు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి ముఖ్యమంత్రి కప్ పోటీలలో రంగారెడ్డి జిల్లాను ప్రాతినిధ్యం వహించనున్నారు.

## నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

### ఫ్యూచర్ సిటీ పోలీస్ కమీషనర్ జి.సుధీర్‌బాబు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు కృషి చేయాలని ఫూచర్ సిటి పోలీస్ కమీషనర్ జి.సుధీర్‌బాబు అన్నారు. బుధవారం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని మొదటి వార్డుతో పాటు మరికొన్ని వార్డులో కొనసాగుతున్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో కమీషనర్ సుధీర్‌బాబు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలన్నదే పోలీసుల లక్ష్యమని, అందుకు ప్రజలందరు సహాకరించాలని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి పౌరుడు సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. 18ఏళ్ళునిండిన యువతి, యువకులు ఓటు హక్కును వినియోగించుకోవడంతో పాటు సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవాలని పేర్కొన్నారు. నాయకులు పెట్టే ప్రలోభాలకు ఎవరు లొంగవద్దని, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఫ్యూచర్ సీటి కమీషనరేట్ పరిధిలో రోజు వారి కేసులు అయ్యాయని, వాటిపై దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపారు. ఎన్నికలను తాము ప్రశాంతంగా నిర్వహించాలన్న దే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని, పోలీస్ శాఖకు ప్రజలందరు సహాకరించాలని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత ర్యాలీలు తీసి ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి ఒక్కరు నడుచుకోవాలని కమీషనర్ పేర్కొన్నారు. అదే విధంగా షాద్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేయనున్న డిసిపి కార్యాలయ స్థలాన్ని సైతం కమీషనర్ పరిశీలించారు.

### మీడియాను పలకరించిన కమీషనర్ సుధీర్‌బాబు

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎస్పీగా విధులు నిర్వహించిన సమయంలో అప్పటి నుండి వివిధ పత్రిల్లో పని చేస్తున్న జర్నలిస్టులను ఫ్యూచర్ సిటీ పోలీస్ కమీషనర్ జి.సుధీర్‌బాబు పలకరించారు. సీనియర్ జర్నలిస్టులకు పకలరిస్తూ మాటలు కలిపారు. షాద్‌నగర్ ప్రాంతం ఎంతో అభివృద్ధి సాధించినా స్నేహపూర్వకంగా అందరితో కలిసి ఉండటం సంతోషంగా ఉందని అన్నారు. అప్పటి విషయాలను కొద్దిసేపు కమీషనర్ జర్నలిస్టులతో నెమరువేసుకున్నారు. కమీషనర్ వెంట షాద్‌నగర్ డిసిపి శిరీష, సిఐలు విజయ్‌కుమార్, నర్సయ్య, ట్రాఫిక్ సిఐ చంద్రశేఖర్‌తోపాటు అధికారులు ఉన్నారు.

## అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకుల మధ్య వాగ్వివాదం

### ఇరు వర్గాల నేతలను చెదరగొట్టిన పోలీసులు



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్‌ఎస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. బుధవారం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని 10, 15 వార్డుల్లో ఏర్పాటు చేసి పోలింగ్ కేంద్రాల వద్ద నేతలు వాగ్వివాదానికి దిగారు. 10వ వార్డులో కాంగ్రెస్ సీనియర్ నేత జమృద్‌ఖాన్, 11వ వార్డు బిఆర్‌ఎస్ నేత పిల్లశేఖర్‌లకు చెందిన వర్గాల నేతలు ఓటర్ల విషయంలో వాగ్వివాదం నెలకొని ఒకరిపై ఒకరు మాటల యుద్ధం కొనసాగించారు. ఇరు వర్గాల మధ్య మాటలు పెరిగి వివాదానికి దారి తీయడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న కేశంపేట సిఐ నరహరి, జిల్లేడు చౌదరి గూడ ఎస్ఐ విజయ్‌లు అపేందుకు యత్నించారు. వారు వినకపోవడంతో ఎసిపికి సమాచారం ఇవ్వడంతో షాద్‌నగర్ ఎసిపి లక్ష్మీ నారాయణ, పట్టణ సిఐ విజయ్‌కుమార్‌లు తమ సిబ్బందితో హుటాహుటిన పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకొని ఇరు పార్టీల నాయకులను చెదరగొట్టారు. ఎన్నికల విధులకు అటంకం కల్పిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరికలు సైతం జారీ చేశారు. అదే విధంగా 15వ వార్డులో బిఆర్‌ఎస్ మాజీ చైర్మెన్ కొందూటి నరేందర్‌తోపాటు నేతలు అధికార కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి, భేగం భర్త సాదిక్ పోలింగ్‌లోకి వెళ్ళారని ఆరోపించారు. పోలింగ్ కేంద్రంలో క్యూలైన్‌లో ఉన్న ఓటర్లకు తమ గుర్తు ఓటు వేయాలంటూ ప్రచారం చే యడం ఏమిటని కాంగ్రెస్ నేతలు మాజీ చైర్మన్ నరేందర్‌పై మండిపడ్డారు. దాంతో పోలీసులు రం గ ప్రవేశం చేసి ఇరువురి నాయకులకు బయటకు పంపించారు. అధికార కాంగ్రెస్ అభ్యర్థిని పోలిం గ్ బూత్‌లో పెట్టి ప్రతి పక్ష బిఆర్‌ఎస్ మాజీ చైర్మెన్ ను బయటకు పంపించడం పోలీసులు ఏకపక్షం గా వ్యవహరిస్తున్నారని నేతలు ఆరోపించారు. దాంతో పోలీసులు కాంగ్రెస్, బిఆర్‌ఎస్ నేతలను బయటకు పంపించడం నేతలు శాంతించారు.

## ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు

### జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు మయంక్ మిట్టల్




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని, ప్రతి అధికారి బాధ్యతగా విధులు నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు మయంక్ మిట్టల్ సూచించారు. బుధవారం మధ్యాహ్నం షాద్‌నగర్ మున్సిపాటీ పరిధిలోని 10,11వ వార్డుల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆర్‌డిఓ సరిత, మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి, తహశీల్దార్ నాగయ్యలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మయంక్ మిట్టల్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లకు మౌళిక సౌకర్యాలు కల్పించడమే కాకుండా సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఏ ఓటరు ఏ పోలింగ్ బూత్‌కు వస్తుందో చూసి ఓటర్లను పంపించేందుకు కృషి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల అధికారులు ఎప్పటికప్పుడు బూత్‌ను పరిశీలించడంతోపాటు దొంగ ఓట్లకు తావు లేకుండా చూడాలని పేర్కొన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటిలోని 28 వార్డులకు గాను 76పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు 75.7శాతం పోలింగ్ అయినట్లు వివరించారు. మున్సిపాలిటిలో మొత్తం 53403ఓటర్లకు గాను 40424మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల నుండి బ్యాలెట్ బాక్స్‌లను స్ట్రాంగ్ రూంకు తరలించినట్లు వివరించారు.

## చేవెళ్లలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతం

### 80.92 శాతం పోలింగ్ నమోదు



**ప్రజాపక్షం/షాబాద్ :** చేవెళ్ల మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా కల్లెక్టర్ సి నారాయణ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలోని 16,17,18 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మధ్యాహ్నం తరువాత ఫ్యూచర్ సిటీ కమిషనర్ జి.సుధీర్ బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఉన్నత అధికారులు మాట్లాడుతూ.. చేవెళ్ల ప్రాంతంలో మున్సిపల్ ఎన్నికలు సజావుగా సాగుతున్నట్లు వెల్లడించారు. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఓటింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. మొత్తం 18 వార్డులకు గాను 25,371 ఓటర్లు గాను సాయంత్రం సమయానికి మొత్తం పోలైన ఓట్లు 20,531 కావడంతో 80.92 శాతంగా ఓటింగ్ నమోదు అయిన్నట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. చేవెళ్ల డివిజన్‌లో 3 జోన్‌లో శంకరపల్లి, మొహినాబాద్, చేవెళ్ల మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందించేందుకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కౌటింగ్ శుక్రవారం 8 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కౌటింగ్ అనంతరం విజయోత్సవం, ర్యాలీలు తీయడానికి అనుమతులు లేవని, ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపిఐ యోగేశ్ గౌతమ్, ఏసిపి కిషన్ గౌడ్, సిఐ భుపాల్, శ్రీధర్ ఎన్నికల అధికారలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.





## రాజ్యంగ విలువలను తుంగలో తొక్కిన మాజీ కార్పొరేటర్లకు బుద్ధి చెప్పాలి

### మాదాపూర్ బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** రాజ్యంగ విలువలను తుంగలో తొక్కి తమ సొంత లాభం కొరకు బిఆర్‌ఎస్ పార్టీ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ పార్టీకి తొత్తులుగా మారారని మాదాపూర్ బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు ఈ. శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్నటితో వారి పదవీకాలం ముగయడంతో మాదాపూర్ డివిజన్ బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఈ.శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చందానగర్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం చందానగర్ లోని అంబేద్కర్ విగ్రహనికి పూలమాలలు వేసి భవిష్యత్తులో రాజ్యంగ విలువలను తుంగలో తొక్కి బిఆర్‌పెస్ బీ ఫారం తో గేలిచి తమ సొంత లాభం కొరకు కాంగ్రెస్ పార్టీలో చేరి అబివృద్ధి పేరుతో ప్రజల మనోభావాలను దెబ్బ తీశారని, డివిజన్‌లలో ఎటువంటి అబివృద్ధి పనులు జరగకపోవడంతో పాటు రోడ్లు, డ్రైనేజీలు, విద్యుతీకరణ పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి నీచ రాజకీయాలు చేస్తున్న మాజీ కారొరేటర్లకు రానున్న కార్పొరేటర్ల ఏన్నికలలో తగిన బుద్ధి చేప్పి తగిన గుణపాఠం చెప్పాలని తెలిపారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఉద్యమ కారులు, బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సినిమాలో యూనిక్ ఫిల్మ్ మేకర్‌గా, నటుడిగా ముద్రవేసిన రవిబాబు తాజాగా 'రేజర్'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్ ప్రొడ్యూసర్ సురేష్ బాబు ప్రెజెంట్ చేయగా, ఫ్లయింగ్ ఫ్రాగ్స్ నిర్మిస్తోంది. రవిబాబు-సురేష్ బాబు కాంబినేషన్‌లో మరోసారి వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పడ్డాయి.

లీల

# టైటిల్ మార్చమన్నారు



డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని

సంతోష్ శోభన్ హీరోగా నటిస్తున్న సినిమా 'కపుల్ ఫ్రెండ్లీ'. ఈ చిత్రంలో మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్‌గా నిర్మిస్తోంది. అజయ్ కుమార్ రాజు.పి కోప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యూజికల్ రొమాంటిక్ లవ్ స్టోరీగా తెరకెక్కిన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా 'వాలెంటైన్స్ డే' సందర్భంగా తెలుగు, తమిళంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాను ప్యాషనేట్ ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని ఎపి, తెలంగాణలో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ధీరజ్ మొగిలినేని మీడియాతో 'చిట్ చాట్' నిర్వహించారు. పదిహేను రోజుల క్రితం 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా చూశాను. మూవీ బాగా నచ్చింది. ప్రమోద్ అన్నకు వంశీ అన్నకు కాల్ చేసి ఈ సినిమా నేను డిస్ట్రిబ్యూట్ చేయాలని అనుకుంటున్నా అని అడిగాను. వారు ఓకే చెప్పడంతో ఈ ప్రాజెక్ట్ చేశాను. ఇది చెన్నై బ్యాక్ డ్రాప్‌లో సాగే మంచి లవ్ స్టోరీ మూవీ ఇది. టైటిల్ చూసి ఇదోదే ఓన్లీ యూత్ చూడాల్సిన సినిమా అనుకుంటున్నారు. ఈ సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్ ఉంటాయి. శివ, మిత్ర అనే రెండు క్యారెక్టర్స్ జర్నీ చూస్తారు. కపుల్ ఫ్రెండ్లీ' మూవీలో లివ్ ఇన్ రిలేషన్‌షిప్ గురించి కేవలం 15 నిమిషాలు మాత్రమే సీన్స్ ఉంటాయి. మిగతా అంతా మిత్ర, శివ అనే జంట ఒకరికొకరు పరిచయం అయ్యాక వారి జీవితాలు ఎలా మారాయి. వీళ్ల ఒకరి కొకరు ఎలా సపోర్ట్ చేసుకున్నారు అనేదే చూపిస్తున్నాం. సినిమా టైటిల్ విషయంలో సెన్సార్ అభ్యంతరం చెప్పారు. టైటిల్ మార్చమన్నారు. కానీ మేము ఇప్పుడు టైటిల్ విషయంలో ఎలాంటి మార్పులు చేయలేమని చెప్పాం. టైటిల్ రిజిస్ట్రేషన్ విషయంలో మొదటి నుంచే సెన్సార్ వారి అనుమతి ఇచ్చేలా ఒక కొత్త పద్ధతి రావాల్సిన అవసరం ఉంది. మాకే కాదు ఈ మధ్య చాయ్ వాలా అనే సినిమాకు కూడా సెన్సార్ వారు అభ్యంతరం తెలిపారు. ఈ సినిమా కోసం చెన్నై నగరంలో షూటింగ్ చేశారు. చెన్నైలో షూటింగ్ చేయడం చాలా కష్టం. పర్మిషన్స్ ఇవ్వరు. తమిళ చిత్రాలకు కూడా పర్మిషన్స్ ఉండవు. కానీ ఈ సినిమా టీమ్ మాత్రం గెరిల్లా పద్ధతిలో షూటింగ్ చేశారు. ఇటీవల మేము చెన్నై లవ్ స్టోరీ సినిమా కోసం చెన్నైలో ఇలాగే షూటింగ్ చేయాల్సివచ్చింది.

## 13న 'ఎ బ్యూటీఫుల్ బ్రేకప్'



తక్ష్, మటిల్డా హీరో-హీరోయిన్లుగా నటించిన ఇంగ్లీష్ ఫీచర్ ఫిల్మ్ 'ఎ బ్యూటీఫుల్ బ్రేకప్' ఇది. రొమాంటిక్ హారర్ థ్రిల్లర్. ఈ చిత్రాన్ని దర్శకుడు అజిత్ వాసన్ ఉగ్గిన రచన, దర్శకత్వంలో తెరకెక్కించారు. ఈ చిత్రాన్ని 5 నేచర్స్ మూవీస్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్మించగా, ముద్రగడ రంగారావు, ఉగ్గిన సత్యనారాయణరావు సమర్పిస్తున్నారు. పూర్తిగా ఇంగ్లీష్‌లో, గ్లోబల్ ఆడియెన్స్‌ను లక్ష్యంగా రూపొందించిన 'ఎ బ్యూటీఫుల్ బ్రేకప్ ఈ నెల 13న ప్రపంచవ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. దీనికి ముందుగా 12న దుబాయ్‌లో ఎక్స్‌క్లూజివ్ ప్రీమియర్ నిర్వహించనున్నారు. ఇంగ్లీష్ విడుదల అనంతరం ఈ చిత్రాన్ని హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం భాషల్లో డబ్ చేసి విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు అజిత్ వాసన్ ఉగ్గిన మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను చేరుకోవాలనే ఉద్దేశంతో 'ఎ బ్యూటీఫుల్ బ్రేకప్' చిత్రాన్ని పూర్తిగా ఇంగ్లీష్‌లో రూపొందించాం. లెజెండరీ సంగీత దర్శకుడు మాస్ట్రో ఇళయరాజా మా చిత్రానికి సంగీతం అందించడం మా అదృష్టం అన్నారు. హీరో తక్ష్ మాట్లాడుతూ.. ఎ బ్యూటీఫుల్ బ్రేకప్ సినిమా షూటింగ్‌లో ప్రధాన భాగం భారతదేశంలో, కర్ణాటకలోని చిక్కమగళూరు అరణ్య ప్రాంతంలో, ఓ అద్భుతమైన, ప్రశాంతమైన ఎస్టేట్‌లో జరిగింది. మబ్బులతో నిండిన ఆ సహజ వాతావరణం సినిమాకు ఒక భయానకమైనా అందమైన అనుభూతిని ఇచ్చింది. ఈ సినిమాలో సినిమాటోగ్రఫీ పెద్ద హైలైట్. మా డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ గుణశేఖరన్ విజువల్స్‌ను అంత అందంగా తీర్చిదిద్దారు సినిమా చూసిన పాశ్చాత్య ప్రేక్షకులు కూడా 'వావ్' అని స్పందించారు. ఈ కథలో సంగీతం కీలక పాత్ర పోషిస్తుంది.

## అందరూ మెచ్చేలా ఫంకీ



'చిట్ చాట్'లో కె.వి.అనుదీప్

'జాతిరత్నాలు'తో హాస్య చిత్రాలలో కొత్త పంథాను సృష్టించిన దర్శకుడు కె.వి.అనుదీప్, ఇప్పుడు 'ఫంకీ'తో మరోసారి థియేటర్లలో నవ్వుల వర్షం కురిపించడానికి వస్తున్నారు. విశ్వక్ సేన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాలో కయాదు లోహర్ కథానాయిక. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ప్రేమికుల దినోత్సవం కానుకగా ఒకరోజు ముందుగా ఈ నెల 13న విడుదలవుతున్న 'ఫంకీ' చిత్రం విడుదల అవుతున్న నేపథ్యంలో దర్శకుడు కె.వి.అనుదీప్ మీడియాతో 'చిట్ చాట్ నిర్వహించారు. 'ఫంకీ' టైటిల్ వినడానికి క్యాచీగా ఉంటుంది. అలాగే ఈ తరం అభిరుచులకు తగ్గట్టుగా ఉంటుందని ఈ టైటిల్‌ను ఎంచుకోవడం జరిగింది. హీరో పాత్రకు కూడా ఈ టైటిల్ సరిగ్గా సరిపోతుంది. విశ్వక్ సేన్ ఇందులో ఒక సినిమా దర్శకుడి పాత్రలో కనిపిస్తారు. ఈ పాత్రను రాసుకున్నప్పుడే విశ్వక్ అయితే బాగుంటారు అనిపించింది. 'ఈ నగరానికి ఏమైంది' సినిమాలో ఆయన కామెడీ టైమింగ్ బాగుంటుంది. 'జాతిరత్నాలు'తో పోలిస్తే 'ఫంకీ' చిత్రం పూర్తి కొత్తగా ఉంటుంది. ఇది అవుట్ అండ్ అవుట్ రొమాంటిక్ కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఇందులో దర్శకుల జీవితాల్లో జరిగే కొన్ని సంఘటనలను సాధారణ ప్రేక్షకులకు కూడా అర్థమయ్యేలా సరదాగా చూపించడం జరిగింది. అలాగే ప్రేమ కథతో పాటు కుటుంబానికి సంబంధించిన మంచి భావోద్వేగ సన్నివేశాలు కూడా ఉంటాయి. నిజ జీవితంలో ప్రేక్షకులను కనెక్ట్ అయ్యే సీన్స్ ఉంటాయి. సినిమాలో లాజిక్ ఉంటుంది. నా సినిమాల్లో కామెడీ ఎక్కువగా ఉంటుంది కాబట్టి, లాజిక్ ఉండదని మీకు అనిపించవచ్చు. కానీ అన్ని సినిమాల్లో లాజిక్ ఉంటుంది. 'ఫంకీ'లో నేను అతిథి పాత్రలో కనిపిస్తాను. నాకు నటుడిగా కంటే దర్శకుడిగా సినిమాలు చేయడమే ఆసక్తి. పూర్తిస్థాయి నటుడిగా మారే ఆలోచన లేదు. చెప్పాల్సిన కథలు చాలా ఉన్నాయి. దర్శకుడిగానే మరిన్ని సినిమా చేయాలని ఉంది. ఈ సినిమాలో దర్శకులు హరీష్ శంకర్, కళ్యాణ్ శంకర్, నిర్మాతలు దిల్ రాజు, నాగవంశీ అతిథి పాత్రల్లో కనిపిస్తారు. అయితే ఆ పాత్రలు కథలో భాగంగానే వస్తాయి. ఆ పాత్రలతో కూడా సహజమైన సంభాషణలతో హాస్యాన్ని పుట్టించే ప్రయత్నం చేశాము. జయాపజయాలు సహజం. అయితే 'ప్రిన్స్' స్క్రిప్ట్ సిద్ధం చేయడానికి అప్పుడు తగిన సమయం లేదు. ఇప్పుడు 'ఫంకీ'కి తగిన సమయం తీసుకొని, మంచి స్క్రిప్ట్‌ని సిద్ధం చేశాము. నరేష్ పాత్ర చాలా బాగుంటుంది. ఆ పాత్ర రాసుకునేటప్పుడే ఆయనైతే బాగుంటుంది అనిపించింది. నాకు చిన్నప్పటి నుంచి నరేష్ అభిమానం. 'జాతిరత్నాలు' కోసం ఆయనతో కలిసి పనిచేశాను. ఇప్పుడు మరోసారి కలిసి పని చేయడం సంతోషంగా ఉంది. మూడు నిర్మాణ సంస్థలలో సినిమాలు చేయాల్సి ఉంది. ఒక ఫిమేల్ ఓరియెంటెడ్ కథ రాస్తున్నాను. అలాగే, వెంకటేష్ కోసం ఒక కథ సిద్ధం చేస్తున్నాను.

## బంధాల విలువలను చాటి చెప్పే 'సీతా పయనం'

యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా దర్శకత్వంలో నిరంజన్, ఐశ్వర్య అర్జున్ జంటగా తెరకెక్కించిన చిత్రం 'సీతా పయనం'. శ్రీరామ్ ఫిలమ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్ మీద అర్జున్ నిర్మాణంలో తెరకెక్కిన ఈ మూవీతో ఐశ్వర్య అర్జున్ హీరోయిన్‌గా పరిచయం కాబోతోన్నారు. ఈ సినిమాలో యాక్షన్ ప్రిన్స్ ధృవ సర్జా ప్రధాన పాత్రను పోషించారు. ఈ



చిత్రాన్ని 14న రిలీజ్ చేస్తున్నారు. ఈ ఈవెంట్‌కు పద్మశ్రీ డా.బ్రహ్మానందం ముఖ్యఅతిథిగా విచ్చేశారు. రియల్ హీరో లైన పర్యావరణ వేత్త, సామాజిక వేత్త డా.ప్రకాష్ ఆమ్టే, డా.మందాకిని ఆమ్టే, ట్యాంక్‌బండ్ శివ, పర్యావరణ వేత్త దుశ్చర్ల సత్యనారాయణలను 'సీతా పయనం' టీం సత్కరించి లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా డా.బ్రహ్మానందం మాట్లాడుతూ మంచి మనిషి, రియల్ జెంటిల్‌మెన్ అర్జున్ గురించి ఈ ఈవెంట్‌కు వచ్చాను. రియల్ హీరోల్ని సత్కరిస్తున్నాను అని అర్జున్ చెప్పినప్పుడు ఎంతో సంతోషించాను. ఇలాంటి గొప్ప వారిని సత్కరించే అవకాశం అందరికీ లభించదు. అర్జున్ దర్శకత్వం వహించిన 'జై హింద్ 2' చిత్రంలో నేను నటించాను. అర్జున్ ఎప్పుడూ ఎవ్వరినీ డిమాండ్ చేయరు. ఎప్పుడూ సౌమ్యుడిగానే ఉంటారు. ఈ చిత్రంతో ఐశ్వర్యకు మంచి పేరు రావాలి, అర్జున్ పేరు నిలబెట్టాలని కోరుకుంటున్నాను అని అన్నారు. దర్శక, నిర్మాత అర్జున్ సర్జా మాట్లాడుతూ 'సీతా పయనం' అనేది ఒక్కరి ప్రయాణం కాదు. నా కూతురిని ఓ మంచి కథతో, పాజిటివిటీ ఉన్న సినిమాతో పరిచయం చేయాలని అనుకున్నాను. ఇదొక డిఫరెంట్ జానర్ కథ. నా కూతురికి ఓ బహుమతిలా ఈ సినిమాని ఇవ్వాలని అనుకున్నాను. జనాలకు ఓ మంచి చిత్రాన్ని ఇవ్వాలనే బాధ్యతతో ఈ చిత్రాన్ని తీశాను. ఎంతో నిజాయితీతో ఈ మూవీని తీశాను. ఉపేంద్ర అన్న కొడుకు నిరంజన్ చాలా టాలెంటెడ్ పర్సన్ అన్నారు. హీరోయిన్ ఐశ్వర్యా అర్జున్ మాట్లాడుతూ 'సీతా పయనం' నాకు కేవలం ఓ సినిమా మాత్రమే కాదు. ఇది నాకొక ఎమోషన్. ప్రేమ గురించి, కుటుంబం గురించి, విలువల గురించి చెప్పే చిత్రమిది. నాకు ఇంత గొప్ప అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాత.. నేను గర్వంగా చెప్పుకునే నా తండ్రి అర్జున్ కి థాంక్స్. ఆయన పేరు నిలబెట్టేందుకు ప్రయత్నిస్తాను 14న సినిమా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో హీరో నిరంజన్, సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్, నటుడు సత్య రాజ్ , నటుడు, నిర్మాత అశోక్ కుమార్ , నిర్మాత ప్రసన్న కుమార్, డైలాగ్ రైటర్ సాయి మాధవ్ పాల్గొన్నారు.

## 28న 'అతడు' రీ-రిలీజ్



మహేష్ బాబు ఐకానిక్ క్లాసిక్ 'అతడు' మరోసారి గ్రాండ్‌గా వెండి తెర పైకి రాబోతోంది. ప్రేక్షకుల మనసులో చెరగని ముద్రవేసిన ఈ టైమ్‌లెస్ క్లాసిక్ ఫిబ్రవరి 28న ఫోర్ కే ఫార్మాట్‌లో థియేటర్లలో రీ-రిలీజ్ కానుంది. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటించారు. వెటరన్ నటుడు-నిర్మాత మురళీ మోహన్ జయభేరి ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ సినిమాను నిర్మించారు. ఇప్పుడు సూపర్ ఫోర్లో కే డాల్బీ ఆడియోతో మరోసారి థియేటర్లలో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది.

## 'నవాబ్ కేఫ్'గా మారిన 'చాయ్ వాలా'



శివ కందుకూరి, రాజీవ్ కనకాల, తేజు అశ్విని ప్రధాన పాత్రలో హర్షిక ప్రొడక్షన్స్ బ్యానర్ మీద రాధా విపపుడిప్పు నిర్మించిన చిత్రం 'నవాబ్ కేఫ్'. ఈ మూవీకి ప్రమోద్ హర్ష దర్శకత్వం వహించారు. ఈ సినిమాని 20న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో హీరో శివ కందుకూరి మాట్లాడుతూ 'చాయ్ వాలా' అంటూ మా జర్నీని ప్రారంభించాం. 'చాయ్ వాలా'ని జనాల్లోకి తీసుకు వెళ్లేందుకు చాలా కష్టపడ్డాం. సెన్సార్ రూల్స్, గైడ్ లైన్స్‌ను గౌరవిస్తూ మేం మా టైటిల్‌ను 'నవాబ్ కేఫ్'గా మార్చాం. ప్రమోద్ ముందుగా నాకు ఈ కథను చెప్పినప్పుడు 'నవాబ్ కేఫ్' అని టైటిల్ అనుకున్నాం. ఇప్పుడు విధి చివరకు 'నవాబ్ కేఫ్' టైటిల్‌ను పెట్టేలా చేసింది. 'నవాబ్ కేఫ్' టైటిల్ మా సినిమాలోని స్టోరీని, ఆత్మని తెలియజేస్తుంది. టైటిల్ చేంజ్ అయినా, సెన్సార్ సమస్యలు వచ్చినా మా నిర్మాత వెంకట్ ఎక్కడా వెనక్కి తగ్గకుండా, కాంప్రమైజ్ కాకుండా నిలబడ్డారు. 'నవాబ్ కేఫ్' అనే కొత్త టైటిల్‌తోనే మళ్లీ ప్రమోట్ చేద్దామని టీం అంతా ముందుకు వచ్చాం అని చెప్పారు. ఈ ప్రెస్ మీట్ లో దర్శకుడు ప్రమోద్ హర్ష, హీరోయిన్ తేజు అశ్విని మాట్లాడారు.

## సర్కారు మెడలు వంచుదాం

(మొదటి పేజీ తరువాయి)

చట్టాన్ని సర్కారు రద్దు చేయడాన్ని ఆక్షేపించారు. ఉద్యోగాలు, వేతనాలు, సామాజిక భద్రత, గౌరవమైన పనికి హాని కలించే ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్ల ప్రయోజనాలకు పెద్ద పీట వేస్తూ కార్మికులు, కర్షకులను అభద్రతా అనే అగాధంలోకి నెట్టివేయడానికి బీజేపీ ప్రభుత్వం పూనుకున్నదని, దీనిని ప్రతిఘటించాలని డి.రాజా సూచించారు. సార్వత్రిక సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొని, దానిని విజయవంతం చేయాలంటూ కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీలు, గిగ్ వర్కర్లు, స్కీమ్ వర్కర్లు, ఉద్యోగులతో పాటు అన్ని ప్రజాస్వామిక శక్తులకు సీపీఐ తరపున పిలుపునిచ్చారు. ఐక్యతాను, ప్రతిఘటనను, గౌరవమైన పని హక్కును తిరిగి సాధించే సంకల్పాన్ని చాటే విధంగా ఈ సమ్మె జరగాలని డి.రాజా వెల్లడించారు. సమ్మె జయప్రదానికి పిలుపునిచ్చారు.

## దిశానిర్దేశ ఎన్నికలు నేడే

(మొదటి పేజీ తరువాయి)

(బిఎన్‌పి)-జమాత్-ఏ-ఇస్లామీ పార్టీలు ప్రధానంగా ఎన్నికల బరిలో నిలిచాయి. మొత్తం 51 పార్టీలకు చెందిన వేలాదిమంది అభ్యర్థులు ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో యువకులదే నిర్ణయాత్మక ఓటు. ఎవరు అధికారాన్ని తీసుకుంటారనే విషయాన్ని యువతరమే నిర్దేశించనున్నారు. ఎన్నికల ప్రక్రియలో 44 శాతం ఓటర్లు అందరూ 37 ఏళ్ళ లోపు వయసుగలవారే కావడం ప్రత్యేక విశేషం. ఈ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకూ బంగ్లాదేశ్‌లో నాలుగు రోజులు సెలవు దినాలు ప్రకటించారు. పోలింగ్ సందర్భంగా గురువారం దేశంలో వీధుల్లో రాకపోకల సమయాలపై కూడా ఆంక్షలు విధించారు. మొబైల్ ఫైనాన్స్ సర్వీసులపై కూడా బ్యాంకింగ్ వ్యవస్థ ఈనెల తొమ్మిదో తేదీ నుండి మూడు రోజులపాటు ఆంక్షలు విధించింది.

**పోలింగ్ దేశ భవితకు మార్గనిర్దేశం : యూనుస్**

ఈ ఎన్నికలు ఎప్పుడూ జరిగే ఒక రాజకీయ ప్రక్రియ మాత్రమే కాదని, బంగ్లాదేశ్ ప్రజలందరూ ఉమ్మడిగా తమ భవిష్యత్తును, విధిరాతను నిర్దేశించుకోవడానికి ఉద్దేశించిన పోలింగ్ ప్రక్రియ అని తాత్కాలిక ప్రభుత్వ అధినేత, ప్రధాన సలహాదారు మహ్మద్ యూనుస్ వ్యాఖ్యానించారు. రాబోయే కొత్త ప్రభుత్వానికి అధికారాన్ని బదలాయించేందుకు తానెంతో ఉత్సుకతతో ఉవ్విళ్ళూరుతున్నానన్నారు. జాతీయ టెలివిజన్‌లో ఆయన ప్రజలు ఉద్దేశించి ప్రసంగించారు.

**స్థిరత్వం-సర్వసమానత్వం కావాలి : తారిఖ్ రెహ్మాన్**

'బంగ్లాదేశ్‌కు స్థిరత్వం కావాలి, దేశానికి సర్వసమానత్వం కావాలి, ప్రతీకార రాజకీయాలు దేశాన్ని నాశనం చేస్తాయి' అని బంగ్లాదేశ్ నేషనలిస్టుపార్టీ (బిఎన్‌పి) ఛైర్మన్ తారిఖ్ రెహ్మాన్ (60) ప్రజలకు పిలుపు ఇచ్చారు. తమపార్టీకి ఓటు వేస్తే శాంతిని కాపాడి, ప్రజలకు భద్రత తీసుకువస్తామని భరోసా ఇస్తున్నారు. అన్నివర్గాల ప్రజలకు సమాన ప్రాతిపదికపై రక్షణలు ఇస్తామని చెప్పారు. తమకు సవాలు విసురుతున్న జమాత్-ఏ-ఇస్లామీ పార్టీ ఒక మంచి ప్రతిపక్షంగా బాధ్యతలు నిర్వహిస్తుందని విశ్వాసంతో ఉన్నానని అన్నారు.

**అంతా సమానం : రెహమాన్**

మెజారిటీ-మైనారిటీ అనే భేదాలు లేవని, ప్రజలు అందరూ సమానమేనని జమాత్-ఏ-ఇస్లామ్ అధ్యక్షుడు షఫీకుర్ రెహమాన్ (68) అన్నారు. ఎన్నికలు సమీపించిన తరుణంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు దేశానికి కొత్తగా అనిపించాయి. జమాత్ పార్టీపై మతఛాందస ముద్ర ఉన్న తరుణంలో మెజారిటీ, మైనారిటీ తేడా లేదని, అందరూ సమానమేనని చేసిన వ్యాఖ్యలు ఒక కొత్త మార్గానికి తెరతీశాయి.

**మరో మైనారిటీ వ్యాపారి హత్య**

బంగ్లాదేశ్‌లో మరికొద్ది గంటల్లో పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కానున్న తరుణంలో మైనారిటీ వర్గానికి చెందిన మరో వ్యాపారి హత్యకు గురయ్యాడు. హిందూ వ్యాపారి సుసేన్ చంద్ర సర్కార్ (62)ను మైమన్‌సింగ్‌లో గుర్తుతెలియని వ్యక్తులు నరికి చంపారు. ఆయన బియ్యం వ్యాపారం చేస్తారు. ఆయనను రాత్రి దుకాణంలో ఉండగా దుండగులు నరికిచంపి షట్టర్లు దించి పారిపోయారు. బంధువులు వచ్చి చూసేసరికి అప్పటికే ఆయన మరణించారు. బంగ్లాదేశ్‌లో ఇప్పటికే ఏడుగురు హిందూ మైనారిటీ వ్యాపారులు, యువకులు హత్యలకు గురయ్యారు. దీపూ చంద్ర దాస్, ఖోకోన్ చంద్ర దాస్, బజేంద్ర బిశ్వాస్, అమృత మండల్ సహా అనేకమంది హత్యలకు గురయ్యారు.

## వందేమాతరం తప్పనిసరి..

(మొదటి పేజీ తరువాయి)

వందేమాతరం కూడా పాడాలని ఆదేశించింది. ఈ మేరకు బుధవారం ఉదయం తాజా ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాల ప్రకారం వందేమాతరం ఆలపించేటప్పుడు అందరూ తప్పనిసరిగా నిలబడాలి. గేయంలోని ఆరు చరణాల్ని ఆలపించాల్సిందే. వీటిలో కాంగ్రెస్ 1937లో తొలగించిన నాలుగు చరణాలు కూడా ఉన్నాయి. వాటిని కూడా ఆలపించాలి. గతంలో నెహ్రూ ఆధ్వర్యంలో సెక్యులర్ అంశాలను సాకుగా చూపి, ముస్లిం లీగ్ అభ్యంతరాల మేరకు గేయంలోని నాలుగు చరణాలను తొలగించారు. ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వం వాటిని కూడా తిరిగి చేర్చింది. ఈ అంశంపై గత ఏడాది కాంగ్రెస్, బిజెపి మధ్య మాటల యుద్ధం నడిచింది. తాజా మార్గదర్శకాల ప్రకారం సినిమా హాళ్లలో వందేమాతరం ప్లే చేయాల్సిన అవసరం లేదు. అలాగే థియేటర్లలో లేదా న్యూస్ రీల్స్‌లో ఈ గేయం ప్లే అవుతుంటే నిలబడాల్సిన అవసరం లేదు. ఇలాంటి చోట్ల ఎక్కువ మంది నిలబడటం వల్ల కార్యక్రమానికి ఆటంకం కలగడం, అలాగే శాంతి భద్రతల సమస్యను దృష్టిలో ఉంచుకుని తాజా ఆదేశాలిచ్చింది. 'వందేమాతరం' ఆలపించడానికి మూడు నిమిషాల 10 సెకండ్ల సమయం పడుతుందని కేంద్రం వెల్లడించింది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు అయినటువంటి రాష్ట్ర వేడుకలు, పౌర సన్మానాలు, రాష్ట్రపతి పర్యటన, గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు, మంత్రులు పాల్గొనే వేడుకలు, జాతీయ పతాకావిష్కరణ వంటి కార్యక్రమాల సందర్భంగా ఇకపై వందేమాతరం ఆలపించాలి. ఇప్పటికే పద్మ వంటి కేంద్ర అవార్డులు ప్రదానం చేసే వేడుకల్లో ఈ గేయాన్ని ఆలపిస్తున్నారు. ఈ నిబంధనలు అతిక్రమించి జాతీయ గేయాన్ని అవమానిస్తే వారికి గరిష్టంగా మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. 'వందేమాతరం' గేయాన్ని 1875లో బంకిం చంద్ర ఛటర్జీ రచించారు. తర్వాత దీన్ని ఆయనే తన ఆనంద్ మఠ్ అనే నవలలో భాగం చేశారు. ఈ గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తైన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. దీనిలో భాగంగానే తాజా ఆదేశాలిచ్చింది.

# మహా శివరాత్రికి 43 శైవ క్షేత్రాలకు 2,243 ప్రత్యేక బస్సులు

**శ్రీశైలం 781, వేములవాడ 416, ఏడుపాయలకు 249 స్పెషల్ సర్వీసులు**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని 43 ప్రసిద్ధ శైవక్షేత్రాలకు ఆర్‌టిసి 2,243 ప్రత్యేక బస్సులను నడపనుంది. ఈ నెల 15న మహా శివరాత్రి పురస్కరించుకుని, 14 నుంచి 16వ తేది వరకు స్పెషల్ సర్వీసులను నడపనుంది. ప్రధానంగా శ్రీశైలానికి 781, వేములవాడకు 416, ఏడుపాయలకు 249, కీసరగుట్టకు 326, వేలాలకు 127, కాళేశ్వరానికి 71తో పాటు రాష్ట్రంలోని కొమురవెల్లి, అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప, తదితర ఆలయాలకు 273 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని ఎంజిబిఎస్, జెబిఎస్, సిబిఎస్, ఐఎస్ సదన్, కె.పి.హెచ్.బి, బిహెచ్‌ఈఎల్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు భక్తులకు అందుబాటులో ఉండనున్నాయి.భక్తులకు ఏలాంటి అసౌకర్యం కల్గకుండ ఆయా ప్రాంతాల్లో షామియానాలు, చైర్లు, తాగునీరుతో పాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను సంస్థ ఏర్పాటు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం ఈ నెల 14 నుంచి 16 వరకు (మూడు రోజులు) నడిచే ప్రత్యేక బస్సులకు మాత్రమే సాధారణం కంటే అదనంగా 1.5 రెట్లు చార్జీలు వసూళ్లు చేయనున్నారు. రెగ్యులర్ సర్వీస్‌లో టికెట్ చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదని అధికారులు వెల్లడించారు. ఏడుపాయలకు తిరిగే స్పెషల్ బస్సుల్లో 15 నుంచి 17 వరకు (మూడు రోజులు) సవరణ చార్జీలు వర్తిస్తాయని సంస్థ ప్రకటించింది. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డ్‌లను సంస్థ ఏర్పాటు చేస్తుంది. మహాశివరాత్రి స్పెషల్ బస్సుల్లో రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు రాష్ట్రంలో ప్రయాణానికి ఉచిత బస్సు రవాణా సదుపాయం యధావిధిగా అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. తమ ప్రయాణ సమయంలో మహిళలు విధిగా జీరో టికెట్లను తీసుకోవాలని సూచించారు. 'శివరాత్రికి ప్రత్యేక బస్సుల ఏర్పాట్లపై ఆర్‌టిసి విసి ఎండి వై.నాగిరెడ్డి ఉన్నతాధికారులతో ఇప్పటికే సమీక్ష నిర్వహించారు. శివరాత్రి పండుగకు శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా మరిన్ని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని క్షేత్ర స్థాయి అధికారులకు ఎండి అదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలంకు వెళ్లే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించారు. టికెట్ల బుకింగ్ ను www.tgsrtcbus.in వెబ్ సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చని, మరింత సమాచారం కోసం ఆర్‌టిసి కాల్ సెంటర్ నంబర్లు 04069440000, 040 23450033ల ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.

# నేడే సార్వత్రిక సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

నాలుగు కోడ్‌లు తెచ్చి ఉద్యోగ భద్రత లేకుండా చేస్తామంటే ఊరుకునేది లేదని కేంద్ర కార్మిక సంఘాలు స్పష్టం చేశాయి. యాజమాన్యాల దయకు కార్మికులు/ఉద్యోగులను వదిలేసే చట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేశాయి. సమ్మెకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), అఖిలభారత కిసాన్ సభ (ఎఐకెఎస్) సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. వామపక్షాలు, బ్యాంకుల సంఘాలు, జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాలు సైతం మద్దతిచ్చాయి. భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందం దేశ రైతాంగానికి సర్కారు ద్రోహమని ఎస్‌కేఎం ఆగ్రహం వ్యక్తంచేసింది. చౌకగా అమెరికా వ్యవసాయ ఉత్పత్తులతో దేశీయ మార్కెట్లు నింపి దేశ రైతాంగాన్ని అగాధంలోకి నెట్టివేసేలా ఈ ఒప్పందం ఉన్నదని దుయ్యబట్టింది. వాణిజ్య ఒప్పందం ద్వారా అమెరికాకు భారత వ్యవసాయాన్ని దాసోహం చేసినట్లు సర్కారును ఏఐకేఎస్ దుయ్యబట్టింది. భారతీయ విపణిను అమెరికా పాల ఉత్పత్తులు, సోయాబీన్ నూనె, పశు దాణా, ఇతర వ్యవసాయ దిగుమతులతో నింపితే ఇక్కడ రైతులకు తీరని హాని జరుగుతుందని హెచ్చరించింది. దీనికి వ్యతిరేకంగా నిరసన గళం వినిపించేందుకు సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలిపింది. బ్రిటన్, న్యూజిలాండ్, యూరోపియన్ యూనియన్‌తో చేసుకున్న స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాల్లో డెయిరీ ఉత్పత్తులు మినహాయించినట్లు అబద్ధాలు చెప్పి రైతాంగాన్ని వాస్తవాల నుంచి దారి మళ్లించేందుకు ప్రయత్నించిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. దేశీయ వ్యవసాయ రంగం, పాడి పరిశ్రమపై ఈ ఒప్పందాలు దీర్ఘకాలిక ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని ఏఐకేఎస్ హెచ్చరించింది. అమెరికా, యూరప్ ఆర్థికంగా ప్రయోజనాలు పొందే విధంగా భారత్‌తో ఒప్పందాలు జరిగాయని పేర్కొంది. ఎఐటియుసి, హెచ్‌ఎంఎస్, సిఐటియు, ఎఐయుటియుసి, టియుసిసి, ఎస్ఇడబ్ల్యుఎ, ఎఐసిసిటియు, ఎల్‌పిఎఫ్, యుటియుసి సహా 10కేంద్ర కార్మిక సంఘాల పిలుపునకు బ్యాంకుల సంఘాలు మద్దతిచ్చాయి. ప్రైవేటీకరణ, వేతనాల ప్రతిష్ఠంభన, సామాజిక భద్రతకు విఘాతం వంటి అంశాలపై ఆందోళన వ్యక్తంచేశాయి. ఇదిలావుంటే, కార్మికులకు, రైతులకు, ఉద్యోగులకు వ్యతిరేకంగా ప్రతిపాదించిన బిల్లుల ఉపసంహరణకు డిమాండ్ సర్వత్రా వినిపిస్తోంది. గ్రామీణ ఉపాధి పథకాల కింద ఉద్యోగాల భద్రతకు హామీకి డిమాండ్ ఉంది. ముసాయిదా విత్తనాల బిల్లు, విద్యుత్ సవరణ బిల్లు, శాంతి చట్టం రద్దునకు కార్మికులు, రైతులు డిమాండ్ చేశారు. వీజీ జీ రామ్ జీ చట్టం రద్దు చేసి ఎంజీఎన్ఆర్ఈజీఏను తిరిగి అమల్లోకి తేవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎఐబిఇఎ, బిఇఎఫ్ఐ వంటి బ్యాంకుల సంఘాలు సైతం సమ్మెకు మద్దతు ఇవ్వడంతో బ్యాంకింగ్ కార్యకలాపాలకు విఘాతం కలగనుంది. సమ్మె కారణంగా కేరళ, కర్నాటక, ఒడిశా తదితర రాష్ట్రాల్లో విద్యా సంస్థలు మూసివేయనున్నారు. దేశమంతటా రవాణా కూడా స్తంభించబోతోంది. కాగా, సమ్మెలో సుమారు 30 కోట్ల మంది కార్మికులు భాగస్వాములు కాబోతున్నారని, దేశంలోని 600 జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు జరగనున్నాయని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ తెలిపిన విషయం విదితమే. ప్రభుత్వ ఆర్థిక, వ్యవసాయ, కార్మిక విధానాలు నష్టం కలిగిస్తున్నాయనే కార్మికులు, రైతులు, ఉద్యోగులు సమ్మె బాట పట్టినట్లు కార్మికరైతు నాయకులు స్పష్టం చేశారు.

నిర్యాణం



స్వస్తిశ్రీ విశ్వావసు నామ సం॥ర మాఘ మాస బ॥ చతుర్దశి
తేది : 31-01-2026 శనివారం రా॥ గం॥ 7-30 ని॥లకు మా తండ్రి గారైన
శ్రీ జూలూరు లక్ష్మీ నారాయణ గారు
స్వర్గస్థులైనారని తెలుపుటకు చింతించుచున్నాము.
తేది:08-02-2026 ఆదివారం కర్మఆరంభం.
తేది:10-02-2026 మంగళవారం దశాహం. ధర్మోదకములు.
తేది : 11-02-2026 బుధవారం తిలోదకములు శిలోద్వాసన.
అంటీకాలు. సోడశం.వృషోత్సర్జనం సపిండీకరణం
తేది : 12-02-2026 గురువారం గణపతిపూజ పుణ్యాహవచనం ఆశీర్వచనం జరుపబడును.కావున
తామెల్లరు విచ్చేసి. మా తండ్రి గారి ఆత్మకు శాంతి చేకూర్చగలరని ప్రార్థన.
ఇట్లు
భార్య: జూలూరు భాగ్యలక్ష్మీ
కుమారులు-కోడళ్లు:
జూలూరు శ్రీనివాస్-పావని
జూలూరు సంతోష్-సంధ్య
కూతురు-అల్లుడు
తమ్మిశెట్టి విజయలక్ష్మీ-రవికుమార్
మనుమలు మరియు మనుమరాళ్లు
కార్యస్థలం : గ్రా॥ దామరవంచ మం॥గూడూరు, జి॥మహబూబాబాద్.
సెల్ : 9866767359,9948005270
సహపంక్తి భోజనం : తేది : 12-02-2026 గురువారం మ॥ 12-00 గం॥లకు..

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com